

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

రాజమహేంద్రవరం

fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

29-8-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 210 పేజీలు: 8+4 వెల: 6.50


## పోలీసుల సంక్షేమం లక్ష్యం

'ప్రమాణ్ కృత్రిమ మేధ ఆపరేటింగ్ సిస్టమ్' ఆవిష్కరణ 3లో

# భయం గుప్పిట్లోనే



- ఇంకా దిక్కుతోచని స్థితిలో నేపాల్‌లోని మూడు జిల్లాల ప్రజలు
- టిబెట్ సరిహద్దులో మరో సరస్సు కట్టలు తెగే ప్రమాదం
- ఆకస్మిక వరదల్లో 600కు చేరిన మృతులు
- 1600 మందిపైగా గల్లంతు
- ఢిల్లీకి క్షేమంగా చేరిన 21 మంది భారతీయులు



బాధిత ప్రాంతాల్లో హెలికాప్టర్ ద్వారా సహాయం అందిస్తున్న దృశ్యం

**కఠ్మాండు, ఆగస్టు 28:** నేపాల్‌లో సంభవించిన ఆకస్మిక వరదల్లో మృతి చెందిన వారి సంఖ్య 469కి చేరుకున్నట్లు ఆ దేశ పోలీసులు వెల్లడించారు. వరదల వల్ల సుమారు 1500 మంది ఆచూకీ లేనట్లు కూడా తెలిపారు. ఇక మరోవైపు చైనా హెచ్చరిక చేసింది. మళ్లీ దిగువ ప్రాంతాలకు మరింత భీకర వరదలు సంభవించే అవకాశాలు ఉన్నట్లు డ్రాగన్ దేశం హెచ్చరించింది. తాజా వరదల్లో సుమారు 178 మంది భారతీయులు గల్లంతు అయినట్లు నేపాల్ అధికారులు చెబుతున్నారు. 11 మందిని రక్షించ గలిగారు. విదేశీ పర్యాటకులతో పాటు మానవ సరోవర యాత్రకు వెళ్లిన యాత్రికులు ఎక్కువ సంఖ్యలో అదృశ్యమైనట్లు తెలు స్తోంది. టిబెట్-నేపాల్ సరిహద్దు వద్ద లెవెల్-4 హెచ్చరికను చైనా జారీ చేసింది. బుధవారం నాటి మట్టిచరియలు విరిగిపడిన ఘటన తర్వాత తాత్కాలిక సర స్సులు ఏర్పడినట్లు చైనా చెప్పింది. రెండు నదుల సంగమం వద్ద ఇలా జరిగినట్లు ఆ దేశం పేర్కొన్నది. అయితే ఏ క్షణమైనా ఆ తాత్కాలిక సరస్సు ఉప్పొంగే అవకాశాలు ఉన్నట్లు చైనా అభిప్రాయపడింది. టిబెట్ ఆటానమస్ ప్రాంతంలో చైనా జలవనరుల మంత్రిత్వ శాఖ ఎమర్జెన్సీ ఆదేశాలు జారీ చేసింది. చోచెన్ ఖోలా, పెరుపా సాంగో నదుల కలయిక వద్ద భారీగా బేరియర్ లేక్ ఏర్పడినట్లు చైనా పేర్కొన్నది. ఈ రెండు నదులూ టిబెట్‌లో ఉద్భవిస్తాయి. ఇవి నేపాల్‌లోకి ప్రవేశిస్తాయి. అక్కడ నుంచి బోట్ కోశిగా ఈ నదులు రూపాంతరం చెందుతాయి. అయితే ఈ రెండు నదుల సంగమం వద్ద సుమారు రెండు మిలియన్ల క్యూబిక్ మీటర్ల మేర నీరు ఉన్నట్లు చైనా చెబుతోంది. దీంతో పెను ప్రమాదం పొంచి ఉన్నట్లు చైనా హెచ్చరించింది. ఆ ముప్పు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నాలు చేపడుతున్నారు. ఆ తాత్కాలిక సరస్సు వల్ల రక్షణ చర్యలు ఆలస్యం అవుతున్నాయి. >>2



సురక్షితప్రాంతాలకు తరలుతున్న ప్రజలు

# 'విజన్‌'తో పనిచేయండి



శుక్రవారం రక్షాబంధన్ సందర్భంగా సిఎం చంద్రబాబుకు రాఖీలు కట్టిన టిడిపి మహిళా నేతలు

- అభివృద్ధి, సంక్షేమంలో ప్రజలను భాగస్వామ్యం ఉండాలి
- అన్ని స్థాయిల్లోనూ పొలిటికల్ గవర్నెన్స్ ఉండాల్సిందే
- విజన్‌ప్లాన్‌పై ప్రజాప్రతినిధులు నిరంతరం సమీక్షించాలి
- పనితీరుకు నియోజకవర్గాల విజన్ ప్లాన్ అమలు ప్రామాణికం
- విజన్ ప్లాన్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు
- ప్రజాప్రతినిధులు, అధికారులతో సిఎం చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచేందుకు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పేదరిక నిర్మూలన, ప్రజా సమస్యల త్వరిత పరిష్కారం, సుపరిపాలనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన స్వర్ణ నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్ అమలుపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీలు, ఎమ్మెల్యేలు, యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్టనర్స్‌తో సిఎం మాట్లాడారు. నియోజక వర్గాల వారీగా విజన్ ప్లాన్ రూపొందించుకుని పని చేయడం దేశంలోనే ప్రథమంగా ఎపిలోనే అమలు చేస్తున్నామని సిఎం తెలిపారు. దీనికి జాతీయ స్థాయిలో మంచి పేరు వచ్చిందని చెప్పారు. ఈ క్రమంలో నియోజకవర్గాల విజన్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నియోజకవర్గాల విజన్ ప్లాన్ అమలులో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలది కీలక పాత్ర అని చెప్పారు. రూపొందించుకున్న కీపెర్ఫామెన్స్ ఇం డికేటర్లకు అనుగుణంగా ఆయా రంగాల్లో వృద్ధి నమోదు చేసేలా పని చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల విజన్ ప్లానులో యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్టనర్లు, స్వర్ణ కార్యాలయాల సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని, ఆ మేరకు వీళ్లంతా వినూత్నంగా ఆలోచించి ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేయడం వంటి అంశాలపై ఫోకస్ పెట్టాలని సూచించారు. స్థానికంగా ఉండే వనరుల లభ్యతను ఆధారంగా చేసుకుని ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి >>2

## స్థానిక ఎన్నికలు జరగడం జగన్‌కు ఇష్టం లేదు 2లో

# స్వచ్ఛాంధ్ర దిశగా అడుగులు



- డంపింగ్ యార్డ్ రహితంగా మునిసిపాలిటీ
- పురపాలక శాఖ మంత్రి నారాయణ వెల్లడి
- వెలగపూడి సచివాలయంలో ఉన్నత సమీక్ష

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** డంపింగ్ యార్డ్ (చెత్తకుప్పలు) రహిత మున్సిపాలిటీలుగా ఎపిని మారుస్తామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. లెగసీ వేస్ట్ తొలగింపు, ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్‌ల ఏర్పాటు పనులపై మంత్రి నారాయణ శుక్రవారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశానికి స్వచ్ఛాంధ్ర >>2



శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

- అర్హులైన ప్రతి నిర్వాసితుడికీ పరిహారం
- రికార్డుల్లో లోపాలున్నా ఆందోళన అవసరం లేదు
- రూ.169 కోట్ల అదనపు భారం అయినా ప్రతి నిర్వాసితుడికి న్యాయం చేస్తాం
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

# మూడు దశాబ్దాల వెలుగొండ కల సాకారం

**మార్కాపురం, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రకాశం ఉమ్మడి జిల్లాలోని కరువు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలనే మూడు దశాబ్దాల వెలుగొండ కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర >>2



# టైమ్, డేట్.. ఫిక్స్ చెయ్ చర్చకు సిద్ధం!

- జగన్‌కు మంత్రి లోకేష్ సవాల్
- డిఎస్సీకి, ఎపిపిఎస్సీకి తేడాతెలియని అజ్ఞాని మాజీ సిఎం
- స్థానిక ఎన్నికల్లో 2024కంటే 2శాతం అదనపు ఓట్లతో గెలుపే లక్ష్యం
- రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు మరో మూడుసార్లు గెలవాలి
- వెలుగొండ ప్రాజెక్ట్ శంకుస్థాపన చేసింది ఆనాటి ముఖ్యమంత్రి బాబే, 31న ప్రారంభించేది చంద్రబాబు
- ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో లోకేష్

**ఒంగోలు(కలెక్టరేట్), ఆగస్టు 28 ప్రభాతవార్త:** ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమన్వయ సమావేశం శుక్రవారం ఒంగోలులో నిర్వహించారు. ఈ సమావేశంలో టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మరోసారి సవాల్ విసిరారు. చర్చకు తాను పూర్తిగా సిద్ధంగా ఉన్నానని, సమయం, తేదీ ఖరారు చేస్తే పులివెందులకైనా, తాడేపల్లికైనా వచ్చేందుకు సిద్ధమని స్పష్టం చేశారు. డిఎస్సీ, ఎపిపిఎస్‌సికి తేడా తెలియని వారు తనకు నీతులు చెప్పడం సరికాదని జగన్‌పై విమర్శలు చేశారు. డిఎస్సీ విషయంలో అనేక కేసులు వచ్చినప్పటికీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసి ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీ చేపట్టామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 వ్యవహారంపై కోర్టు పర్యవేక్షణలో విచారణ కొనసాగుతోందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోర్టు సూ చించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ ఏడాదితో పాటు రాబోయే మూడేళ్లలోనూ డిఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను >>2



మంగంపేట బరైటీస్ ప్రాజెక్ట్ ఏరియల్ వ్యూ



శుక్రవారం గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నాగబాబు

## 2047నాటికి 50%

# పచ్చదనమే లక్ష్యం

- మొక్కలు నాటడమే కాదు.. వాటి మనుగడపై ప్రత్యేక దృష్టి
- ఎపి గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ నాగబాబు స్పష్టీకరణ

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అటవీ, వృక్ష సంపదను విస్తరించి 2047 నాటికి మొత్తం భౌగోళిక విస్తీ ర్ణంలో పచ్చదనాన్ని 50శాతానికి పెంచడమే లక్ష్యంగా >>2

# డ్రగ్స్ నిర్మూలనకు 'ఈగల్' నయా అస్త్రం

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీతో కీలక ఒప్పందం



ఆకే రవికృష్ణ

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో యువతను పట్టిపీడిస్తున్న మత్తు రక్కసిని అంతం చేసేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలోని 'ఈగల్' విభాగం సరికొత్త వ్యూహంతో ముందుకెళ్తోంది. యువతను డ్రగ్స్ బారి నుంచి కాపాడి, వారిలో సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీతో కీలక ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. మంగళగిరిలోని ఈగల్ ప్రధాన కార్యాల యంలో ఈ మేరకు ఇరు విభాగాల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సం తకాలు చేశారు. కేవలం కేసుల నమోదుకే పరిమితం కాకుండా యువత ఆలోచనా ధోరణి మార్చేలా ఈగల్ అడుగులు వేస్తోంది. యువతలో సామా జిక బాధ్యతను, సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు ఈ ఒప్పందం దోహద పడనుంది. రాష్ట్రవ్యాప్తంగా యువత భాగస్వామ్యంతో భారీ ఎత్తున రక్తదాన, నేత్రదాన శిబిరాలను ఏర్పాటు చేసేందుకు ఈగల్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రెడ్‌క్రాస్‌సొసైటీ అనుభవంతో ఈ >>2



# ఎన్‌టిఎ డైరెక్టర్‌గా ప్రసన్న వెంకటేశ్

**విజయవాడ, ఆగస్టు 28, ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ కేడర్‌కు చెందిన 2012 బ్యాచ్ ఐఏఎస్ అధికారి వి.ప్రసన్న వెంకటేశ్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) డైరెక్టర్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. సెంట్రల్ స్టాఫింగ్ స్కీమ్ కింద ఆయన ఐదేళ్లపాటు ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు. ఈ మేరకు కేంద్ర సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో పలు కీలక బాధ్యతలను ప్రసన్న వెంకటేశ్ గతంలో నిర్వహించారు. ఏలూరు జిల్లా కలెక్టర్‌గా, విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేశారు. పరిపాలనలో తనదైన ముద్ర వేసిన ఆయనకు తాజాగా కేంద్ర ప్రభుత్వ పరిధిలో కీలకమైనఎన్‌టీఏ డైరెక్టర్ బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇకపై దేశవ్యాప్తంగా వివిధప్రవేశ, అర్హత పరీక్షలను నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీకి ఆయన నాయకత్వం వహించనున్నారు.

# మంగంపేట బరైటీస్ మూత

## రెండేళ్లలో ప్రాజెక్టు మూసేలా ప్రణాళిక, టెండర్లు పిలిచిన ఎపిఎండిసి

## 2028 ఆఖరికి మంగంపేట చరిత్ర ముగిసినట్లే

**రాజంపేట, ఆగస్టు 28 ప్రభాతవార్త:** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మంగంపేట బరైటీస్ ప్రాజెక్టు రెండేళ్లలో మూతపడనుంది. 50 ఏళ్ల పాటు ఒక వెలుగు వెలిగిన ఈ ప్రాజెక్టును మూసివేసేందుకు ఎపిఎండిసి విధాన నిర్ణయం తీసుకుంది. 2028 నాటికి మంగంపేట బరైటీస్ ప్రాజెక్టు మూసివేసేం దుకు అవసరమైన పక్కా ప్రణాళికను సిద్ధం చేసేందుకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ టెండర్లను పిలిచింది. ఈ టెండర్లలో పాల్గొనేందుకు నిర్మాణ సంస్థలకు కేవలం మూడు రోజులు మాత్రమే గడువుంది. సెప్టెంబర్ 1న ఈ టెండర్లు కూడా ఓపెన్ చేసి కాంట్రాక్టర్‌ను ఖరారు చేస్తారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఆదాయంలో కీలకమైన ఉమ్మడి కడప జిల్లాలోని (ప్రస్తుతం తిరుపతి జిల్లాలో) మంగంపేట బరైటీస్ ద్వారా ప్రతి సంవత్సరం కనీసం రూ.1000 కోట్ల నుండి 1300 కోట్ల ఆదాయం వచ్చేది. ఇలాంటి ఈ ప్రాజెక్టు మూతపడుతుందంటే సర్వత్ర ఉత్కంఠ కల్పిస్తోంది. ఈ ప్రాజెక్టు మూసివేసి వేతకు అవసరమైన తుది ప్రణాళికను టెండర్లను దక్కించుకున్న కంపెనీ సిద్ధం చేస్తుంది. 2028 చివరి నాటికి మంగంపేట ప్రాజెక్టు చరిత్ర ముగిసినట్లే అని చెప్పవచ్చు.

1982లో కేంద్ర ప్రభుత్వం ఓబులవారిపల్లె మండలం మంగంపేట గోవిందపల్లి గ్రామాలలో బరైటీస్ ఖనిజాన్ని గుర్తించి స్మారక చిహ్నం కూడా ఏర్పాటు చేసింది.

అప్పటి గణాంకాల ప్రకారం ప్రపంచంలోనే ఎక్కడా దొరకని అతిపెద్ద మందమైన ఏకపొర బరైటీస్ మంగంపేటలో 74 మిలియన్ టన్నుల ఖనిజం ఉందని గుర్తించారు. 54 సంవత్సరాలు చరిత్ర కలిగిన ఈ ప్రాజెక్టు దాదాపు అయిపోయినట్లేని ఎపిఎండిసి భావించి ఫైనల్ మైన్ క్లోజర్ ప్లాన్ సిద్ధం చేసేందుకు నిర్మాణ సంస్థకు అప్పగించనుంది.

ప్రస్తుతం మంగంపేట ప్రాజెక్టులో దాదాపు 25 లక్షల ఏ, బి గ్రేడ్ల ఖనిజం ఉన్నట్టు సమాచారం. అలాగే సి అండ్ డి ఖనిజం 1.10కోట్ల టన్నులు ఉంది. ఈ ఖనిజంలో ఇప్పటికే 60 లక్షల టన్నుల ఖనిజం టెండర్ ద్వారా ఎం ప్రదా కంపెనీ దక్కించుకుంది. అంటే సి అండ్ డి ఖనిజం కూడా ప్రస్తుతం 65 లక్షల టన్నులు మాత్రమే విక్రయించేందుకు సిద్ధంగా ఉంది. మరోవైపు త్రివేణి సంస్థ అందుబాటులో ఉన్న ఖనిజాన్ని టెండర్లు ఇటీవలే దక్కించుకుంది. అంటే ఎపిఎండిసి అంచనా ప్రకారం ఖనిజ నిలువలు పైన పేర్కొన్న మేరకు ఉన్నాయి. రెండేళ్లలో వీటిని కూడా విక్రయించి ప్రాజెక్టును క్లోజ్ చేసేందుకు నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటికే విధానపరమైన నిర్ణయం తీసుకుంది. గత కొన్ని సంవత్సరాలుగా రూ.1000 నుండి 1300 కోట్ల ఆదాయం మంగంపేట ప్రాజెక్టు ద్వారా ప్రతి ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూర్తుంది. ఈ ఆదాయాన్ని పరిగణలోకి తీసుకుని ఎపిఎండిసి ఖనిజాన్ని తాకట్టుపెట్టి కార్పొరేషన్ బాండ్ల ద్వారా రూ.10వేల కోట్ల రుణాన్ని సమకూర్చుకుంది. ఈ ప్రాజెక్టు మైనింగ్ ముగిసే లోపు ఈ రుణాన్ని ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. మంగంపేట బరైటీస్‌లో ఖనిజం వెలికితీత ద్వారా వచ్చిన ఓవర్ బర్డెన్ నిల్వలు కొన్ని కోట్ల మెట్రిక్ టన్నులు ఉన్నాయి.

పలు గ్రామాలను ఈ నిల్వలు ముంచెత్తాయి. వీటిని క్లియర్ చేసి చదును చేసేందుకే మైన్ క్లోజింగ్ చేపట్టారు. ఈ నేపథ్యంలో వెరైటీస్ ప్రదీప్ స్థానంలో ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం మరో భారీ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను స్పష్టం చేస్తోంది.



శుక్రవారం మంత్రి లోకేష్ సభలో పాల్గొన్న టిడిపి కార్యకర్తలు

## టైమ్, డేట్.. ఫిక్స్ చెయ్ చర్చకు సిద్ధం!

>> భర్తీ చేపట్టామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్-1 వ్యవహారంపై కోర్టు పర్యవేక్షణలో విచారణ కొనసాగుతోందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోర్టు సూచించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ ఏడాదితోపాటు రాబోయే మూడేళ్లలోనూ డిఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని లోకేష్ స్పష్టం చేశారు. వెలుగొండ ప్రాజెక్టు విషయంలోనూ జగన్‌పై మంత్రి లోకేష్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది చంద్రబాబేనని, ఈనెల 31న ప్రారంభించేది కూడా చంద్రబాబేనని పేర్కొన్నారు. గతంలో పనులు పూర్తికాకుండానే ప్రాజెక్టును జాతికి అంకితం చేశారని ఆరోపించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతోపాటు మిగిలిన పనులను కూడా పూర్తిచేసి ప్రాజెక్టును ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తన రాజకీయ జీవితంలో ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు, వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, కేసీఆర్ పాలనలను చూశానని, అయితే జగన్ తరహా పాలనను మాత్రం ఎప్పుడూ చూడలేదని వ్యాఖ్యానించారు.


**స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధండి:** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు. గత సార్వత్రిక ఎన్నికల్లో సాధించిన ఓట్ల కంటే మరో రెండు శాతం అదనపు ఓట్లతో స్థానిక ఎన్నికల్లో ఘన విజయం సాధించేందుకు అవకాశం ఉందన్నారు. కార్యకర్తలు నాయకుల చుట్టూ తిరగకుండా నేరుగా ప్రజల మధ్య ఉండాలని సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలపై క్షేత్రస్థాయి ఫీడ్‌బ్యాక్‌ను పార్టీకి అందించాలని కోరారు. 'మై టిడిపి' యాప్ ద్వారా సుమారు నాలుగు లక్షల మంది నాయకులు, కార్యకర్తల కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. పార్టీ అప్పగించే కార్యక్రమాలను బాధ్యతగా తీసుకుని సీరియస్‌గా పనిచేయాలని సూచించారు. గ్రామ, మండల, పట్టణ స్థాయిలో పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తే ప్రజల్లో పార్టీపై మరింత విశ్వాసం ఏర్పడుతుందని అన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి తనవంతు బాధ్యతను నిర్వర్తించాలని కోరారు. ప్రతి కార్యకర్త ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పార్టీపై నమ్మకాన్ని మరింత పెంచేలా పనిచేయాలని సూచించారు. రాష్ట్రాన్ని పూర్తిస్థాయిలో గాడిలో పెట్టాలంటే మరో మూడుసార్లు వరుసగా విజయం సాధించాల్సిన అవసరం ఉందని అన్నారు. సోషల్ మీడియాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పరం విమర్శలు చేసుకుంటే దాని ప్రభావం పార్టీపై మాత్రమే కాకుండా రాష్ట్రంపై కూడా పడుతుందని హెచ్చరించారు.

పార్టీ కార్యకర్తలు ప్రజల్లో నిరంతరం ఉంటూ గత పాలనలో జరిగిన పరిణామాలను వివరించడంతో పాటు ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను కూడా ప్రజలకు తెలియజేయాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అహంకారానికి దూరంగా ఉండి పరస్పర సమన్వయంతో పనిచేయాలని లోకేష్ సూచించారు. ఒంగోలు ఎమ్మెల్యే, ఎంపి ప్రజలకు అందుబాటులో ఉన్నారని, స్థానికంగా ఏవైనా సమస్యలు ఉంటే కలిసి చర్చించి పరిష్కరించుకుందామని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కఠినంగా ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను దేశంలో అగ్రస్థానంలో నిలిపేందుకు చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలకు మరింత విశ్వాసం కలిగేలా ప్రతి కార్యకర్త బాధ్యతతో పనిచేయాలని కోరారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు పార్లమెంటు టిడిపి అధ్యక్షుడు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, జోనల్ కోఆర్డినేటర్ మద్దిపాటి వెంకట్రాజు, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణరాజు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు జెడ్. శివప్రసాద్, ఉత్తరాంధ్ర పార్టీ కోఆర్డినేటర్ దామచర్ల సత్య, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఒంగోలు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కొఠారి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## 2047 నాటికి 50% పచ్చదనమే లక్ష్యం

>> బాధ్యతలు నిర్వర్తిస్తానని ఎపి గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ నాగబాబు తెలిపారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజలందరూ భాగస్వామ్యమయ్యే మహోద్యమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. శుక్రవారం మంగళగిరి అరణ్యభవన్‌లో ఎపి గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో నాగబాబు మాట్లాడుతూ "ఎపి గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం ఎంతో గౌరవంగా, బాధ్యతగా భావిస్తున్నాను. తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతలను అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి కృతజ్ఞతలు. ఎపి గ్రీన్ సొసైటీ నిర్దేశించుకున్న లక్ష్యాలను సమర్థవంతంగా సాధించేందుకు పూర్తి చిత్తశుద్ధితో కృషి చేస్తాను. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, అటవీ విస్తీర్ణం అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాల సాధనకు ఎపి గ్రీన్ ద్వారా కృషి చేస్తా" అని పేర్కొన్నారు. "ప్రస్తుతం రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం 22.96శాతంగా ఉంది. రాబోయే 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, వృక్ష సంపదను కలిపి పచ్చదనాన్ని 50శాతానికి పెంచడమే మా ప్రధాన లక్ష్యం. ఇది కేవలం గణాంకాల కోసం పెట్టుకున్న లక్ష్యం కాదు. భావి తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన పర్యావరణం, మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. వాతావరణ మార్పులు ప్రపంచానికి సవాలుగా మారుతున్న ఈ సమయంలో పర్యావరణ పరిరక్షణ అనేది మనందరి బాధ్యత. అందుకే ఎపి గ్రీన్ కార్యక్రమాన్ని కేవలం అడవులకే పరిమితం చేయకుండా, రాష్ట్రంలోని ప్రతి అనుకూలమైన ప్రాంతంలో పచ్చదనాన్ని పెంచేలా కార్యాచరణ చేపడుతున్నాం. వ్యవసాయ భూములు, గ్రామాలు, పట్టణ ప్రాంతాలు, ప్రధాన రహదారుల ఇరువైపులా, కాలువ గట్లు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ప్రాంగణాలు, పరిశ్రమల పరిసరాలు, అనుకూలమైన భూములు ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తాం. పెద్ద ఎత్తున మొక్కల పెంపకం, తోటల అభివృద్ధిని ప్రోత్సహిస్తాం" అని నాగబాబు వివరించారు.

**అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ:** "ఈ బృహత్తర లక్ష్యం విజయం కావాలంటే ఒక్క శాఖతో సాధ్యమయ్యేది కాదు. వ్యవసాయం, ఉద్యానవనం, పంచాయతీరాజ్, విద్య, పరిశ్రమలు, రెవెన్యూ, జలవనరులు, రవాణా, అటవీ శాఖలతోపాటు అన్ని సంబంధిత ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతాం. ఎపి గ్రీన్ కార్యక్రమం కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా మాత్రమే ఉండకూడదు. రైతులు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత సంస్థలు, విద్యార్థులు, యువత, పారిశ్రామికవేత్తలు, ప్రతిపౌరుడిని ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలనుకుంటున్నాం. ఎపిగ్రీన్‌ను ఒక ప్రభుత్వ పథకంగా కాకుండా, ప్రజలందరూ భాగస్వామ్యమయ్యే గొప్ప ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. మొక్కలు నాటడం మాత్రమే మా లక్ష్యం కాదు. నాటిన మొక్కలను బతికించడం, వాటిని సంరక్షించడం, అవి ఆరోగ్యంగా ఎదిగేలా చూడటమే అసలైన బాధ్యత. నాటిన ప్రతి మొక్క మనుగడపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. వాటి సంరక్షణ, నిర్వహణ కోసం ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తాం" అని ఎపి గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ నాగబాబు అన్నారు.



శుక్రవారం సిఎం చంద్రబాబును మర్యాదపూర్వంగా కలిసి ఎపి గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న నాగబాబు

## సిఎం చంద్రబాబుని కలిసిన నాగబాబు

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు కలిశారు. ఎపి గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న అనంతరం సిఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును సతీసమేతంగా కలిశారు. ఈ సందర్భంగా నాగబాబును సత్కరించి సిఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. తనకు కీలక బాధ్యతను అప్పగించినందుకు సిఎం చంద్రబాబుకు నాగబాబు ధన్యవాదాలు తెలిపారు. 'ఎపి గ్రీన్ సొసైటీ నిర్దేశించుకున్న లక్ష్యాలను సమర్థవంతంగా సాధించేందుకు పూర్తి చిత్తశుద్ధితో కృషి చేస్తాను. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, అటవీ విస్తీర్ణం అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాల సాధనకు ఎపి గ్రీన్ ద్వారా కృషి చేస్తాన్ను' అని నాగబాబు సిఎంకు తెలిపారు.

## సిఎం చంద్రబాబు రాఖీ కట్టిన మహిళా నేతలు

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** రాఖీ పౌర్ణమి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి పలువురు మహిళా నేతలు, బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టారు. సిఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రికి రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు వారికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. సిఎంను కలిసిన వారిలో మంత్రి సవిత, మాజీ మంత్రి పీతల సుజాత, ఎన్టీఆర్ జిల్లా టిడిపి అధ్యక్షురాలు గద్దె అనురాధ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆచంట సునీత, తదితరులు ఉన్నారు.

## 'విజన్'తో పనిచేయండి

>> ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని అంశాలను పరిగ ణనలోకి తీసుకుని నియోజక వర్గాల విజన్‌ను అందించామని, ఆయా స్థానిక పరిస్థితులకు అనుగుణంగా విజన్ ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచిం చారు. వివిధ అంశాలకు సంబంధించిన సమాచారాన్ని అందిం చేందుకు డేటా లేక్ సిద్ధం చేశామని, అందు బాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషించుకో వడంతోపాటు పూర్తి స్థాయిలో టెక్నాలజీని వినియోగించుకోవా లని సిఎం ఆదేశించారు. నియోజకవర్గాల యాక్షన్ ప్లాన్ అమలుపై ఎమ్మెల్యేలు ఎప్పటి కప్పుడు సమీక్షలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. క్షేత్ర స్థాయిలో సమీక్షలు మొక్కుబడిగా కాకుండా, ప్రజలకు పూర్తిగా జవాబుదారీగా ఉండేలా నిర్వహించాలని సూచించారు. లబ్ధిదారులకు కేవలం నగదు సాయం అందించడమే కాకుండా, వారిని ఆర్థికంగా నిలబెట్టి సాధికారత వైపు నడిపించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సిఎం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అభివృద్ధి- సంక్షేమం చేపడుతోందని, వాటిని ప్రజలకు వివరించే బాధ్యతను ప్రజా ప్రతినిధులే తీసుకోవాలని అన్నారు. పి-4 ప్రాజెక్టు ద్వారా పేదలకు అవసరమైన చేయూత అందిస్తున్నట్లు చెప్పారు. పేదరిక నిర్మూలనకు పారిశ్రామికవేత్తలను సైతం ప్రోత్సహిస్తూ, సమాజంలోని ప్రతి పేద కుటుంబానికి అండగా ఉంటామనే నమ్మకాన్ని కలిగించాలని సిఎం పిలుపునిచ్చారు. ప్రతి నియోజకవర్గాల్లోనూ తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. అలాగే అనుమతులు పొందుతున్న పరిశ్రమలు ఆయా జిల్లాల్లో, నియోజకవర్గాల్లో గ్రౌండ్ అయ్యే విధంగా ప్రజా ప్రతినిధులు, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది పూర్తి స్థాయిలో సహకరించాలని సిఎం ఆదేశించారు. ఉద్యోగుల సామర్థ్యం పెరిగేలా ఇప్పటికే 1.50 కోట్ల ఆన్‌లైన్ కోర్సులు కూడా పూర్తి చేసుకున్నారని సిఎం తెలిపారు. నియోజకవర్గాల విజన్ ప్లాన్ యూనిట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చిందని సిఎం అన్నారు.

**వినూత్నంగా ఆలోచించాలి.. మెరుగైన సేవలు అందించాలి**

ప్రస్తుత పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య, వైద్యం భారంగా మారుతున్నాయని, ఈ ఇబ్బందుల నుంచి వారిని గట్టెక్కించేందుకే సంజీవని, తల్లికి వందనం వంటి వినూత్న పథకాలను తెచ్చామని సిఎం చంద్రబాబు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, నైపుణ్యాలు పెంచడం వల్ల అదనంగా లక్ష మంది విద్యార్థులు చేరారని, ఇది వారి కుటుంబాలపై విద్యా భారాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు, ప్రజా ప్రతినిధులు సాంప్రదాయ ధోరణి వీడి వినూత్నంగా ఆలోచించాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా విజన్ ప్లాన్‌ను వర్తింపజేస్తూ సమస్యలకు తగిన పరిష్కారాలు చూపాలని కోరారు. పరిపాలనలో ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం అత్యంత కీలకమని, అన్ని స్థాయిల్లో పొలిటికల్ గవర్నెన్స్ సమర్థవంతంగా అమలు కావాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయాల్లోనూ, అభివృద్ధి కార్యక్రమాల్లోనూ ప్రజలను భాగస్వాములను చేసినప్పుడే అద్భుత ఫలితాలు వస్తాయని సిఎం చంద్రబాబు అన్నారు. ఉత్తరాంధ్ర ప్రజల కలల సాకారంగా చేపట్టిన భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందని గుర్తుచేశారు. ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు పేరుతో కార్యక్రమం నిర్వహిస్తే ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రచారం చేపట్టారని గుర్తు చేశారు. అదే విధంగా యువతకు, నిరుద్యోగులకు మేలు చేసేలా చేపట్టిన మెగా డిఎస్సీ ప్రక్రియకు అనేక అడ్డంకులు కల్పించే ప్రయత్నం జరిగినా సమర్థవంతంగా నిర్వహించి రిక్రూట్మెంట్ పూర్తి చేశామన్నారు. పారదర్శకంగా చేపట్టిన మెగా డిఎస్సీపై విమర్శలు చేస్తుంటే టీచర్లేస్వయంగా ఉద్యమించిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలను మెప్పించగలిగితే ప్రజలనుంచి సహకారం కూడా అదే స్థాయిలో ఉంటుందని సిఎంచెప్పారు. ఈ సమీక్షలో మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక,ప్రణాళికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్‌కుమార్,ఎపిఎస్ డిపిఎస్ ఇడివిఆర్ అలపర్తి సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మూడు దశాబ్దాల వెలుగొండ కల సాకారం

>> జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం విలువైన భూములు, ఆస్తులు, స్వగ్రామాలను త్యాగం చేసిన నిర్వాసితుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు. మార్కాపురం జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం మీడియాతో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ, 1996లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎట్టి పరిస్థితుల్లోనూ 2026 ఆగస్టు నాటికి వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యాన్ని ముఖ్యమంత్రి నిర్దేశించారని తెలిపారు రెండేళ్లలో వెలుగొండ ప్రాజెక్టు పనుల కోసం సుమారు రూ.2,250 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసి, రాత్రింబవళ్లు పనులు కొనసాగిస్తూ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసిందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం బాధ్యతలు చేపట్టే సమయానికి వెలుగొండ హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించిన వింగ్స్, వాల్స్ పనులు పూర్తికాని పరిస్థితి ఉండేదని చెప్పారు. 2025 మేలో పనులు ప్రారంభించి, 2026 మే నాటికి హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించిన వింగ్స్, వాల్స్ పనులను పూర్తి చేసినట్లు వివరించారు. టన్నెల్1 కు సంబంధించి సుమారు 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపు పనులు, టన్నెల్2కు సంబంధించి సుమారు 4,990 మీటర్ల బెంచింగ్ పనులు, 6,990 మీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేసినట్లు మంత్రి వెల్లడించారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు సుమారు రూ.900 కోట్లు చెల్లించాల్సి ఉండగా, గత ఐదేళ్లలో వారికి ఎలాంటి చెల్లింపులు జరగలేదని మంత్రి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కేవలం 40 రోజుల్లో మూడు విడతల్లో సుమారు రూ.768 కోట్లను నిర్వాసితులకు చెల్లించినట్లు తెలిపారు. వెలుగొండ ప్రాజెక్టు పరిధిలోని 11 ముంపు గ్రామాలకు 11 కమిటీలను ఏర్పాటు చేసి, జిల్లా స్థాయి అధికారులు, జలవనరుల శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో నిర్వాసితుల గ్రీవెన్స్‌లను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. సామాజిక, ఆర్థిక సర్వేలో పేరు లేకపోయినా, గెజిట్‌లో నమోదు కాకపోయినా, కొత్త ఇల్లు ఉన్నా లేకపోయినా, పేర్లలో తేడాలు ఉన్నా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. రికార్డుల్లో ఉన్న లోపాలను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకుండా, వాస్తవ పరిస్థితులను పరిశీలించి అర్హత ఉన్న ప్రతి నిర్వాసితుడికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి నిర్వాసితుడికి పరిహారం అందించే క్రమంలో ప్రభుత్వంపై అదనంగా సుమారు రూ.169 కోట్ల ఆర్థిక భారం పడుతున్నప్పటికీ, ఆ భారాన్ని లెక్కచేయకుండా ప్రతి నిర్వాసితుడికి న్యాయం చేయాలనే మానవతా దృక్పథంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నిర్ణయం తీసుకున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. వెలుగొండ జలాలతో లబ్ధి పొందే రైతులు, ప్రజల కంటే కూడా ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన నిర్వాసితులు ఒక మెట్టు పైన ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన అని మంత్రి తెలిపారు.

## అవినీతి ఆరోపణలపై కర్ణాటక మంత్రి నాగేంద్ర రాజీనామా

**బెంగళూరు, ఆగస్టు 28:** కర్ణాటక మంత్రి బీ నాగేంద్ర రాజీనామా చేశారు. అవినీతి ఆరోపణల కారణంగా రెండోసారి మంత్రివర్గం నుంచి తప్పుకున్నారు. శుక్రవారం తన రాజీనామాను ప్రకటించేటప్పుడు భావోద్వేగానికి లోనైన ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. బీజేపీ తనపై అసత్యాలు ప్రచారం చేస్తున్నదని నాగేంద్ర ఆరోపించారు. నాకు రాజ్యాంగంపై నమ్మకం ఉంది. నాపై వచ్చిన ఆరోపణలపై అసెంబ్లీలో చర్చించాలని బీజేపీని అనేకసార్లు మేం కోరాము. కానీ వారు అందుకు ముందుకు రాలేదు. మనుస్మృతిని రుద్దాలనిబీజేపీ కోరుకుంటోంది. ఆ పార్టీకి గిరిజన వ్యతిరేక వైఖరిఉన్నదని మీడియాతో ఆయన అన్నారు. ఎస్టీ వర్గానికి చెందిన కాంగ్రెస్ నేత బీ నాగేంద్ర తొలుత సీఎం సిద్ధరామయ్య ప్రభుత్వంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారు. అయితే కర్ణాటక మహర్షి వాల్మీకి షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి సంస్థలో రూ.89 కోట్ల మేర అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. 2024 మే నెలలో ఆ సంస్థ అకౌంట్స్ ఆఫీసర్ చంద్రశేఖరన్ ఆత్మహత్య చేసుకున్నారు. అనధికార నిధుల బదిలీ గురించి సూసైడ్ నోట్‌లో ఆయన పేర్కొనడంతో ఈ అవినీతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత జరిగిన విచారణలో వాల్మీకి షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి సంస్థ బ్యాంక్ ఖాతాల నుంచి భారీ మొత్తంలో నిధులు ఇతర ఖాతాలకు బదిలీ అయినట్లు తేలింది. దీంతో ఆ రాష్ట్రంలోని ప్రతిపక్ష బీజేపీ ఈ అంశాన్ని టార్గెట్ చేసింది. ఈ నేపథ్యంలో సిద్ధరామయ్య మంత్రివర్గంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేసిన బీ నాగేంద్ర, 2024 జూన్‌లో తొలిసారి మంత్రి పదవికి రాజీనామా చేశారు. మరోవైపు డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆగస్ట్ 3న జరిగిన మంత్రివర్గ విస్తరణలో నాగేంద్రను తిరిగి కేబినెట్‌లోకి తీసుకున్నారు. ప్రణాళికా, గణాంక శాఖల బాధ్యతలను ఆయనకు అప్పగించారు. అయితే వాల్మీకి షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి సంస్థలో జరిగిన స్కామ్ గురించి బీజేపీ మళ్లీ పోరుబాట పట్టింది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను బయటపెట్టేందుకు సెప్టెంబర్ 1 నుంచి 10 వరకు రాయచూర్ నుంచి బళ్లారి వరకు 10 రోజుల పాదయాత్రను ఆ పార్టీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మంత్రి నాగేంద్ర అనూహ్యంగా శుక్రవారం రెండోసారి మంత్రివర్గం నుంచి తప్పుకున్నారు. కన్నీళ్లతో తన రాజీనామాను ఆయన ప్రకటించారు.

## చీరెల పంపిణీలో తొక్కిసలాట: స్పృహకోల్పోయిన కొందరు మహిళలు

**లక్నో,ఆగస్టు 28:** రాఖీ సందర్భంగా ఒక బీజేపీ మేయర్ చీరల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే ఊహించని విధంగా వేల సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. చీరల కోసం వారు ఎగబడ్డారు. ఈ సందర్భంగా తోపులాట జరుగడంతో కొందరు మహిళలు స్పృహ కోల్పోగా చాలామంది గాయపడ్డారు. ఉత్తరప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. బరేలీ బీజేపీ మేయర్ ఉమేష్ గౌతమ్ రక్షాబంధన్‌కు ఒక రోజు ముందు మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గురువారం బరేలీ క్లబ్ గ్రౌండ్‌లో జరిగిన ఈకార్యక్రమం కోసం 20వేల మందికిపైగా మహిళలు తరలివచ్చారు. పిల్లలు, కుటుంబంలోని వృద్ధులతో కలిసి ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. బరేలీ బీజేపీ మేయర్ ఉమేష్ గౌతమ్‌కు రాఖీలు కట్టేందుకు మహిళలకు ముందుగానే కూపన్లు పంపిణీ చేశారు. అయితే వారు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో గ్రౌండ్‌లో కనీసం నిల్చోవడానికి కూడా చోటు లేనంత పరిస్థితి ఏర్పడింది. చాలా మంది మహిళలు బారికేడ్లను దాటుకుని వేదిక వైపు వెళ్లారు. తీవ్ర ఎండ, ఉక్కపోత మధ్య మహిళల సంఖ్య పెరుగడంతో పరిస్థితి అదుపుతప్పింది. మరోవైపు పంపిణీ చేస్తున్న చీరల కోసం మహిళలు ఎగబడ్డారు. ఈ సందర్భంగా తోపులాట జరుగడంతో చాలా మంది మహిళలు స్పృహ తప్పిపడిపోయారు. పలువురు గాయపడ్డారు. స్పృహ కోల్పోయిన, గాయపడిన మహిళలను అంబులెన్స్‌లలో ఆసుపత్రులకు తరలించారు. అయితే ఈ కార్యక్రమం గురించి తమకు ముందుగా సమాచారం ఇవ్వలేదని పోలీస్ అధికారి తెలిపారు. అలాగే తోపులాటలో మహిళలు స్పృహ కోల్పోవడం, గాయపడటం గురించి ఎలాంటి అధికారిక ఫిర్యాదు కూడా నమోదు కాలేదని చెప్పారు.



ఎన్టీఆర్ సాహిత్యట్రస్టు ఛైర్మన్ టీడీ జనార్దన్‌కు ప్రశంసాపత్రం అందించిన సీఎం చంద్రబాబు

## స్థానిక ఎన్నికలు జరగడం జగన్‌కు ఇష్టం లేదు

### ఆ పార్టీ బలహీన పడింది... ఎన్నికలను అడ్డుకునేందుకు కుయుక్తులు

### మాజీ సిఎంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం

### సెప్టెంబర్ 2న అనకాపల్లిలో పోలవరం జలహారతి

### మంగళగిరి టిడిపి కార్యాలయంలో మీడియాతో సిఎం చిట్‌చాట్

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక ఎన్నికలు జరగడం గొడ్డలి పార్టీ నాయకుడికి ఇష్టం లేదని సిఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక జరిగినప్పటికి కూటమి పక్షాలే గెలుస్తాయని సిఎం చంద్రబాబు స్పష్టం చేసారు. ఈ ఎన్నికల్లో కూటమి 100శాతం స్ట్రైక్‌రైట్‌తో విజయతతం సాధిస్తుందనే లక్ష్యంతో క్యాడరు ఉందన్నారు. రాష్ట్రంలో తమ ప్రత్యర్థి పార్టీ బలహీనపడిందన్నారు. స్థానిక ఎన్నికలు జరగడం ఆ పార్టీ నాయకుడికి ఇష్టం లేదని ధ్వజమెత్తారు. శుక్రవారం మంగళగిరిలో ఎన్టీఆర్ భవన్‌లో టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ యత్నిస్తున్నారని విమర్శించారు. వైసిపి నేతలు 'సర్క్‌పై కోర్టుకెళ్లారని, స్థానిక ఎన్నికలు జాప్యం జరిగే కొద్దీ అధికార పార్టీకి నష్టం కలుగుతుందనే ఆశ వైసిపికి ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికలు వాయిదా పడితే ఆ పార్టీకి లాభం అనుకోవడం దింపుడుకళ్లెం ఆశలే అన్నారు. స్థానిక ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిలో జరిగితేనే రాజకీయ స్థిరత్వం ఉంటుందన్నారు. ఏ ఎన్నికల్లోనైనా బిసిలకు ఎక్కువ సీట్లు ఇచ్చేది టిడిపినే అని పునరుద్ఘాటించారు. బిసిలకు 34శాతం సీట్లు అనేది చట్టపరమైన రక్షణ మాత్రమే అని సిఎం పేర్కొన్నారు. గత ఎన్నికల్లో 34శాతం కంటే ఎక్కువ సీట్లే బిసిలకు ఇచ్చినట్లు తెలిపారు స్థానిక ఎన్నికల నిర్వహణపై ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలు జరగడం ఇష్టం లేకే గొడ్డలి పార్టీ అధినేత న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారని ఆరోపించారు. గొడ్డలి పార్టీ చేస్తున్న కుయుక్తులు ప్రజలకు ఇప్పటికే తెలుసని చంద్రబాబు అన్నారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిలో జరగడమే మేలని సిఎం అభిప్రాయపడ్డారు. మేయర్ లేదా ఛైర్మన్‌ను ప్రజలు నేరుగా ఎన్నుకోవడం వల్ల మెరుగైన సేవలు అందుతాయని చెప్పారు. ఎమ్మెల్యేలు, మేయర్లు, ఛైర్మన్లు సమన్వయంతో పనిచేసే అవకాశం ఉంటుందని, మరో పవర్ సెంటర్ ఏర్పడుతుందన్న భావన సరికాదన్నారు. పోలవరం నీళ్లకు సెప్టెంబర్ 2న అనకాపల్లిలో జలహారతి ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా తొలి దశ నీటిని అనకాపల్లి వరకు తీసుకెళ్లి వచ్చే ఏడాది విశాఖపట్నం వరకు పోలవరం జలాలను తరలిస్తామని సిఎం ధీమా వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టును కూడా వచ్చే ఏడాది ప్రారంభిస్తామని పునరుద్ఘాటించారు. 30యేళ్ల క్రితం తానే శంకుస్థాపన చేసిన వెలిగొండను తానే ప్రారంభిస్తుండటం విధిరాత అంటూ ఒకింత భావోద్వేగంగా మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు తన రాజకీయ ప్రస్థానంలో ప్రత్యేక అధ్యాయమని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు ఇచ్చిన హామీ మేరకు మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయడంతో పాటు వెలిగొండ తొలి దశను పూర్తి చేశామని తెలిపారు. వెలిగొండ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేశామని, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటే వారి నుంచి సహజంగానే సానుకూల స్పందన వస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సిఎం చంద్రబాబు కార్యకర్తలతో పలు అంశాలపై మాట్లాడారు. పార్టీ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తున్న నేతలను ఆయన ప్రశంచారు. పలువురు ప్రత్యేక ప్రశంసా పత్రాలు ఇచ్చి గౌరవించారు. ఈ క్రమంలో సిఎం చంద్రబాబు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎన్టీఆర్ సాహిత్య ట్రస్టు ఛైర్మన్ టిడి జనార్దన్‌ను సత్కరించారు.

## స్వచ్ఛాంధ్ర దిశగా అడుగులు

>> కార్పొరేషన్ ఎండీ సునీల్ కుమార్ రెడ్డి, కాంట్రాక్ట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. జగన్ రెడ్డి హయాంలో వదిలి వెళ్లిన 150 లక్షల టన్నుల లెగసీ వేస్ట్‌ను పూర్తిగా తొలగిస్తున్నామని మంత్రి చెప్పుకొచ్చారు. భూమిపైన ఉన్న వేస్ట్‌ను ఇప్పటికే పూర్తిగా తొలగించామని తెలిపారు. భూమి లోపల ఉన్న చెత్తను కూడా అక్టోబర్ 2వ తేదీ నాటికి పూర్తిగా తొలగించాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న 6 వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ల ద్వారా ఏ రోజు చెత్తను అదే రోజు పూర్తిగా విద్యుత్‌గా మారుస్తామని మంత్రి వెల్లడించారు. ఈలోగా ఉత్పత్తి అయ్యే ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్‌లు నెలకొల్పుతున్నామని అన్నారు. ఫ్రెష్ వేస్ట్ ప్లాంట్‌ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి మొత్తం చెత్తను ప్లాంట్‌లకు తరలించాలని మంత్రి నారాయణ దిశానిర్దేశం చేశారు.

## డ్రగ్స్ నిర్మూలనకు 'ఈగల్' నయా అస్త్రం

>> క్యాంపులను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఎపి ఈగల్ చీఫ్, ఆకే రవికృష్ణ మీడియాతో మాట్లాడుతూ, ఈగల్ సంస్థ ప్రివెంటివ్ అవేర్‌నెస్, ఇంటెలిజెన్స్ డ్రివెన్ ఎన్‌ఫోర్స్‌మెంట్, డీఅడిక్షన్, కమ్యూనిటీ పార్టిసిపేషన్ అనే నాలుగు ప్రాథమిక అంశాలపై పనిచేస్తోందని వివరించారు. ఇప్పటివరకు 2,020 ఎన్‌డిపిఎస్ కేసులు నమోదు చేసి, 65,000 కిలోలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నామని రవికృష్ణ పేర్కొన్నారు. ఆపరేషన్ చైతన్యం ద్వారా గంజాయి సాగు నిర్మూలనలో కీలక విజయాలు సాధించామని తెలిపారు. 2025 నాటికి అల్లూరి సీతారామ రాజు జిల్లాలో గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించామని వెల్లడించారు. 29,979 మంది గిరిజన రైతులకు ప్రత్యామ్నాయ, స్థిరమైన ఉపాధి మార్గాలు కల్పించామని చెప్పారు. 29,839 ఎకరాల్లో గంజాయికు బదులుగా ప్రభుత్వ పథకాల సమన్వయంతో గిరిజనులకు రూ.475 కోట్ల ఆర్థిక, ఉపాధి మద్దతు అందించామని తెలిపారు. డ్రగ్స్ వినియోగం, సరఫరా, గంజాయి సాగుకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు సమాచారం ఇవ్వాలని ఆకే రవికృష్ణ సూచించారు.

## భయం గుప్పిట్లోనే

>> ఎప్పుడు ఆ సరస్సు ఉప్పొంగుతుందో అన్న భయం నెలకొన్నది. బురదతో కొట్టుకువచ్చిన బండరాళ్లు అడ్డుపడడంతో.. రెండు నదుల సంగమం వద్ద భారీగా ఓ సరస్సు ఏర్పడింది. దీని వల్ల ముప్పు ఉందని భావిస్తున్నారు.

### వారం - వర్జ్యం

29-08-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం, మఖకార్తె
తి.పాడ్యమి ఉ.9.55
న.పూర్వాభాద్ర రా.3.41
వ.ఉ.9.43-ఉ.11.21
దు.తె.5.53-ఉ.7.31
రాహు. ఉ.9.00-ఉ.10.30
శుభ లేదు

### వార్తాఫలం

**మేషం :** జీవిత భాగస్వామి సహాయం అందుకుంటారు. అకౌంట్స్ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలసి ఉంటుంది.

**వృషభం :** పక్షపాత ధోరణితో వ్యవహరించారన్న నిందలు ప్రచారంలో ఉంటాయి. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**మిథునం :** కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి. స్థిరాస్తి వివాదాలు తీరి ఊరట చెందుతారు. ప్రముఖుల కలయిక.

**కర్కాటకం :** నూతన పరిశ్రమలు వ్యాపారాలు ప్రారంభిస్తారు. బంధువుల నుండి శుభ వార్తలు అందుకుంటారు.

**సింహం :** ఉద్యోగులకు పదోన్నతుల సూచన, ఎంత సాధించినా ఇంకా సాధించాలనే తృప్తి లేని ధోరణి కనిపిస్తుంది.

**కన్య :** పారిశ్రామిక పెట్టుబడుల విషయమై చర్చలు ఊపందుకుంటాయి. ఖర్చులు అధికంగా ఉంటాయి. నూతన విద్యావకాశం.

**తుల :** సామరస్యమైన చర్చలు సాగించి అపోహలను దూరం చేస్తారు. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి. వాహన సౌఖ్యం.

**వృశ్చికం :** వ్యాపార సంబంధమైన కాగితాలు, డాక్యుమెంట్స్ మొదలైనవి చేతికందుతాయి. పాత ఋణాలు తీరుస్తారు.

**ధనుస్సు :** మాటలను కటువుగా ఉపయోగించే వైఖరి ఆలోచించకుండా వెంటనే సమాధానం చెప్పడం వలన నష్టపోతారు.

**మకరం :** శుభకార్యాలు నిర్వహించటానికి అదృష్టం తోడవుతుంది. వాహనం కొనుగోలు యత్నాలు దాదాపుగా ఫలిస్తాయి.

**కుంభం :** కార్యాలయంలో మీ పనితీరును మరింతగా మెరుగుపర్చుకోగలుగుతారు. విదేశీ పర్యటనలు. శుభవార్తలు అందుతాయి.

**మీనం :** వ్యాపారస్తులకు సానుకూల ఫలితాలు గోచరిస్తాయి. కొత్త వింత ఆలోచనలతో మీ మనస్సు వత్తిడికి లోనవుతుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



## మంత్రి లోకేష్‌కు రాఖీ కట్టిన మంత్రి సవిత, ఎమ్మెల్యే గల్లా మాధవి, మహిళలు

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ఉండవల్లి నివాసంలో వేడుక నిర్వహించారు. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌కు బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి రాఖీ కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. తెలుగింటి ఆడపడుచులకు ఈ సందర్భంగా మంత్రి లోకేష్ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

# బిజెపి ఆధ్వర్యంలో రక్షాబంధన్

**తిరుపతి, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** మూడు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ఉదయం తిరుపతిలో ఉన్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్‌కు రాఖీ పౌర్ణమి సందర్భంగా బిజెపి మహిళా మోర్చా కార్యకర్తలు రక్షాబంధన్ కట్టారు. పివిఎన్ మాధవ్‌కి మహిళలు రాఖీలు కట్టి సోదర భావానికి ప్రతీకగా రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ మహిళల రక్షణ, గౌరవం, సాధికారతకు భారతీయ జనతా పార్టీ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనేక సంక్షేమ, సాధికారత కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాఖీ పౌర్ణమి మన భారతీయ సంస్కృతిలో అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ఆత్మీయత, ప్రేమ, పరస్పర రక్షణకు ప్రతీక అని అన్నారు. మహిళా మోర్చా కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు మహిళా సమస్యల



పరిష్కారానికి చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. సమాజంలో సోదరభావం, ఐక్యత మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, బిజెపి నేతలు కోలా ఆనంద్, గుండాల గోపీనాధరెడ్డి, ముని సుబ్రహ్మణ్యం, జల్లి మధుసూదన్, వరప్రసాద్, పొనగంటి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, వేదిక్ యూనివర్సిటీ ప్రాంగణాల్లో పార్టీ నాయకులతో కలిసి మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వాకింగ్ చేస్తూ పార్టీ నాయకులతో పలు అంశాలపై ఆయన చర్చించారు. కూటమి ప్రభుత్వ పాలన, పార్టీ బలోపేతం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై జిల్లా నాయకులతో అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించిన ఫిట్ ఇండియా కార్యక్రమం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు ప్రతిరోజూ యోగా, వాకింగ్ వంటి వ్యాయామాలను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.

# 'ప్రమాణ్ కృత్రిమ మేధ ఆపరేటింగ్ సిస్టమ్' ఆవిష్కరణ

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏఐ (కృత్రిమ మేధ) ఆధారిత అకౌంటింగ్, స్టాట్యూటరీ కాంప్లయన్స్ జనరేటెడ్ అప్లికేషన్‌గా రూపొందించిన 'ప్రమాణ్ ఆపరేటింగ్ సిస్టమ్'ను సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి 'ప్రమాణ్ ఆపరేటింగ్ సిస్టమ్' అందించే సేవలు, దాని సాంకేతిక సామర్థ్యాలు, ఏఐ ఆధారిత అకౌంటింగ్ విధానం, స్టాట్యూటరీ కాంప్లయన్స్ నిర్వహణ, సమాచార రక్షణ, డేటా సెక్యూరిటీ తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మార్కెట్లో అందుబాటులో ఉన్న ఇదే తరహా అకౌంటింగ్, కాంప్లయన్స్ సాఫ్ట్‌వేర్‌లతో పోలిస్తే 'ప్రమాణ్ ఆపరేటింగ్ సిస్టమ్' మరింత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, అకౌంటింగ్ ప్రక్రియలను సులభతరం చేయడంతో పాటు, అవసరమైన స్టాట్యూటరీ కాంప్లయన్స్ సమాచారాన్ని సమర్థవంతంగా నిర్వహించే విధంగా రూపొందించబడిందని కంపెనీ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రత్యేకంగా కృత్రిమ మేధ ఆధారిత ఆటోమేషన్, డేటా విశ్లేషణ, కాంప్లయన్స్ జనరేషన్, సమాచార భద్రత వంటి ఆధునిక సాంకేతిక అంశాలను



సమన్వయం చేయడం ద్వారా వ్యాపార సంస్థలు, చార్టర్డ్ అకౌంటెంట్లు మరియు అకౌంటింగ్ రంగానికి మరింత వేగవంతమైన, సమర్థవంతమైన సేవలు అందించడమే 'ప్రమాణ్ ఆపరేటింగ్ సిస్టమ్' లక్ష్యమని తెలిపారు. సాంకేతికతను పరిపాలన, ఆర్థిక వ్యవహారాలు, వ్యాపార రంగాలలో అనుసంధానించి ఏఐ ఆధారిత డిజిటల్ సొల్యూషన్స్‌ను అభివృద్ధి చేయడం ద్వారా భారతదేశం 'వికసిత్ భారత్-2047' లక్ష్యాల దిశగా ముందుకు సాగేందుకు తమ వంతు కృషి చేస్తామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. అప్లికేషన్ పనితీరు, భవిష్యత్‌లో దాని విస్తరణకు ఉన్న అవకాశాలు తదితర అంశాలపై ఆసక్తిగా తెలుసుకున్న ముఖ్యమంత్రి కంపెనీ బృందాన్ని అభినందించి ఆశీర్వదించారు. ఇదేరోజు తన జన్మదినం కావడంతో చంద్రబాబుని కలిసి ఆయన ఆశీస్సులు తీసుకోవడం తనకు ప్రత్యేకమైన ఆనందాన్ని, మరపురాని అనుభూతిని కలిగించిందని లంకా దినకర్ తెలిపారు. "తన జన్మదినం రోజున ముఖ్యమంత్రి చేతుల మీదుగా 'ప్రమాణ్ ఆపరేటింగ్ సిస్టమ్' ఆవిష్కరణ జరగడం, అదే సందర్భంగా ఆయన ఆశీస్సులు పొందడం ఎంతో సంతోషకరమైన విషయం. ఏఐ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అకౌంటింగ్, స్టాట్యూటరీ కాంప్లయన్స్ రంగంలో ఆధునిక సేవలను అందించే ఈ ప్లాట్‌ఫామ్‌ను మరింత అభివృద్ధి చేసి దేశవ్యాప్తంగా విస్తరించేందుకు కృషి చేస్తామని అని 20 సూత్రాల పథకాల అమలు సంస్థ చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. ప్రమాణిక్ ఇన్ఫోటెక్ రూపొందించిన 'ప్రమాణ్ ఆపరేటింగ్ సిస్టమ్'ను సిఎం ఆవిష్కరించడం ఎంతో ఆనందదాయకంగా ఉందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ లంకా దినకర్, సిఇఒ అవినాష్ రైనా, ముఖ్య కార్యనిర్వాహక సభ్యులు ఆశిష్, చార్టర్డ్ అకౌంటెంట్లు మేఘన, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

## నర్సీపట్నం ట్రెజరీ కార్యాలయంలో ఎసిబి సోదాలు

**విశాఖపట్నం, ఆగస్టు 28 ప్రభాతవార్త:** నర్సీపట్నం ట్రెజరీ కార్యాలయంలో ఎసిబి అధికారులు శుక్రవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. లంచం తీసుకుంటూ ఓ ఉద్యోగి ఎసిబి అధికారులకు పట్టుపడ్డారు. వివరాల్లోకి వెళ్తే నర్సీపట్నం డివిజనల్ సబ్ ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న నరవ విజయ భాస్కర్ లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కారు. ఒక రిటైర్డ్ ఉద్యోగి నుండి రూ. 30వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఎలమంచిలికి చెందిన పర్వతం శ్రీనివాసరావు అనే రిటైర్డ్ తహసిల్దార్‌కు సంబంధించిన 2023, 2024, 2025 సంవత్సరాల ఇంక్రిమెంట్ బకాయిల బిల్లులను, అదేవిధంగా ఆర్న్ లీవ్ బిల్లును ప్రాసెస్ చేయడానికి విజయ భాస్కర్ మొదట రూ.40 వేలు లంచం డిమాండ్ చేశారు. బాధితుడి అభ్యర్థన మేరకు ఆ మొత్తాన్ని రూ. 30 వేలు ఇవ్వటానికి ఒప్పుకున్నారు. డబ్బులు ఇవ్వకపోతే బిల్లులు ముందుకు సాగవని ఖచ్చితంగా చెప్పడంతో, బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన ఎసిబి అధికారులు విజయ భాస్కర్ లంచం డబ్బులు తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు జరుపుతున్నారు.

## సిఎం చంద్రబాబుతో మారిషస్ మంత్రి భేటీ



**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబుతో మారిషస్ పబ్లిక్ సర్వీస్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ రీఫార్మ్స్ శాఖ మంత్రి లచ్మణా (రాజ్) పెంటియా మర్యాద పూర్వకంగా సమావేశమయ్యారు. ఇటీవల మారిషస్ కేబినెట్ మంత్రిగా లచ్మణా (రాజ్) పెంటియా బాధ్యతలు చేపట్టారు. భేటీ సందర్భంగా ద్వైపాక్షిక అంశాలతోపాటు పరిపాలనా సంస్కరణల అంశాలపై చర్చించారు. ఇరు దేశాల మధ్య సంక్షేమం, అభివృద్ధి అంశాలల్లో సమన్వయం ఉన్న దృష్ట్యా పరస్పరం సహకారం అందించుకునే దిశలో సంబంధాలు కొనసాగాలని మారిషస్ కేబినెట్ మంత్రి లచ్మణా (రాజ్) పెంటియా ఆకాంక్షించారు. ఎపి హస్తకళలు, చేనేత రంగంలో సాధిస్తున్న అభ్యున్నతిని, కీలకంగా డిజిటల్ రంగంలో తీసుకుని వస్తున్న సంస్కరణలను పెంటియా ప్రశంసించారు. రాజధాని అమరావతి అభివృద్ధి చెందుతున్న దేశాలకు దీటుగా తీర్చిదిద్దతుండటం అభినందనీయమన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, వైద్యం, ఆరోగ్యం తదితర సంబంధాలు మరింతగా వృద్ధి కావాల్సి ఉందన్నారు. సిఎం చంద్రబాబు లచ్మణా (రాజ్) పెంటియా ఘనంగా సత్కరించారు. మారిషస్‌తో తమ రాష్ట్రం మంచి సంబంధాలను కలిగి ఉంటుందని సిఎం చంద్రబాబు లచ్మణా (రాజ్) పెంటియాకు తెలిపారు.

## నటుడు నారాయణరావుకు కన్నీటి వీడ్కోలు

**హైదరాబాద్, ఆగస్టు 28, ప్రభాత వార్త:** ప్రముఖ నటుడు, నిర్మాత జీవీ నారాయణ రావు(73) అంత్యక్రియలు ముగిశాయి. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ మహా ప్రస్థానంలో శుక్రవారం ఆయన అంతిమ సంస్కారాలు శాస్త్రోక్తంగా జరిగాయి. కుమారుడు, కుమార్తె ఈ కార్యక్రమాలు పూర్తి చేశారు. అంతకు ముందు సినీ ప్రముఖులు జీవీ నారాయణరావు భౌతికకాయానికి నివాళి అర్పించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధ



నటుడు నారాయణరావు భౌతికకాయం వద్ద నివాళి అర్పించి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మెగాస్టార్ చిరంజీవి

పడుతున్న జీవీ నారాయణరావు బుధవారం రాత్రి కన్ను మూసిన విషయం తెలి సిందే. 1976లో కె.బాలచందర్ దర్శకత్వం లో వచ్చిన 'అంతులేని కథ' చిత్రం తో నటుడిగా అరంగేట్రం చేసిన జీవీ, ఆ తర్వాత ఎన్నో చిత్రాలు, టీవీ సీరి యళ్లలో విలక్షణ పాత్రలు పోషించారు. నటుడిగానే కాకుండా నిర్మాతగా కూడా ఆయన తనదైన ముద్ర వేశారు. తన మిత్రుడు జీవీ నారాయణరావు అంత్య క్రియలకు ప్రముఖ సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి హాజరయ్యారు. ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన చిరంజీవి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నారాయణ రావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సీనియర్ నటుడు మురళీమోహన్‌తోపాటు పలువురు టాలీవుడ్ ప్రముఖులు ఆయనతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం కండి

**కార్యకర్తలకు జనసేనాని పవన్ సందేశం ● ఎన్నికల కమిటీ సభ్యులకు వివరించిన నాదెండ్ల మనోహర్**



విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి: స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించవలసిన వ్యూహాలు భిన్నంగా ఉంటాయి.. అభ్యర్థుల ఎంపిక దశ నుంచే పార్టీ నిర్దేశించే నియమాల ప్రకారం ముందుకు వెళ్లాలి అని పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఆయన ఎన్నికల కమిటీకి సందేశాన్ని పంపించారు. ఆయన ఆదేశాలకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ సభ్యులు బాధ్యతలు చేపట్టాల"ని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరిలో జనసేన స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు. కమిటీ సభ్యులకి పవన్ కళ్యాణ్ ఇచ్చిన సందేశాన్ని మనోహర్ తెలియచేశారు. అనంతరం మనోహర్ మాట్లాడుతూ '100 శాతం స్ట్రైక్ రేట్ మన లక్ష్యం కావాలి అనేది పవన్ కళ్యాణ్ సంకల్పం. ఆ దిశగా ముందుకు వెళ్దాము. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ముందుగా నగర పాలక, పుర పాలక సంస్థల ఎన్నికల మీద దృష్టి పెట్టాలి. డివిజన్లు, వార్డులలో మన బలబలాలు గుర్తించాల్లి అని నాదెండ్ల మనోహర్ స్పష్టం చేసారు. రాష్ట్ర స్థాయిలో కూటమి సమన్వయ కమిటీ చర్చలు నడుస్తున్నాయి. జిల్లా, నియోజక వర్గాలవారీగా సమన్వయ కమిటీలు ఉంటాయి. మన పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల కమిటీ సభ్యులకు పార్లమెంట్ నియోజక వర్గాల వారీగా బాధ్యతలు అప్పగిస్తారు. సభ్యులు క్షేత్ర స్థాయిలో పర్యటించి క్యాడర్‌ను కలిసి వారికి భరోసా ఇస్తూ, ఎన్నికలకి సమాయత్తం చేసి వారి అభిప్రాయాలను పార్టీ కేంద్ర కార్యాలయానికి నివేదిక ద్వారా తెలియచేయాలి అన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు మంత్రి కందుల దుర్గేష్. మండలి బుద్ధ ప్రసాద్, టి శివశంకర్, వల్లభనేని బాలశౌరి, బొలిశెట్టి శ్రీనివాస్, దేవ వరప్రసాద్, సీహెచ్ వంశీకృష్ణ యాదవ్, లోకం మాధవి, పత్సమట్ల ధర్మరాజు, చిలకం మధుసూదన్ రెడ్డి, కొటికలపూడి గోవిందరావు, సామినేని ఉదయభాను, యనమల భాస్కర్, కొరికాన రవి కుమార్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్ తాళ్లూరి పాల్గొన్నారు.

## సిఎంతో శ్రీలంక డిప్యూటీ హైకమిషనర్ భేటీ



**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో చెన్నైలోని శ్రీలంక డిప్యూటీ హైకమిషనర్ డాక్టర్ గణేశనాథన్ గైథీశ్వరన్ మర్యాద పూర్వకంగా సమావేశమయ్యారు. దక్షిణ భారత రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల్లో శ్రీలంక ద్వైపాక్షిక సంబంధాలను డాక్టర్ గణేశనాథన్ పర్యవేక్షిస్తున్నారు. భేటీ సందర్భంగా సిఎం చంద్రబాబుతో పలు అంశాలపై చర్చించారు. శ్రీలంకతో వ్యాపార, వాణిజ్య సంబంధాలపై ఇరువురు మధ్య కీలక చర్చలు జరిగినట్లు సమాచారం. ఉత్పత్తి రంగంలో ఎపి సాధిస్తున్న ప్రగతి అభినందనీయంగాను, తమ దేశానికి స్ఫూర్తిదాయకంగా ఉన్నట్లు డాక్టర్ గణేశనాథన్ గైథీశ్వరన్ సిఎంతో వ్యాఖ్యానించినట్లు సమాచారం. అమరావతి అత్యుత్త రాజధాని నగరంగా రూపొందుతుందని డాక్టర్ గణేశనాథన్ గైథీశ్వరన్ అభిప్రాయపడ్డారు. సిఎం చంద్రబాబును డాక్టర్ గణేశనాథన్ గైథీశ్వరన్ సత్కరించారు. ఆయనకు సిఎం చంద్రబాబు జ్ఞాపికను అందజేసారు.

# పోలీసుల సం'క్షేమ'మ్లే లక్ష్యం

**● సురక్షితమైన సౌకర్యవంతమైన వసతి సౌకర్యాల కల్పన ● మంగళగిరిలో 'విహార- విహారి'**

**వసతి భవనాలు: డిజిపి హరీష్ వెల్లడి ● సమీకృత సెంట్రల్ పోలీస్ క్యాంటీన్‌కు భూమిపూజ**

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** పోలీసు సిబ్బంది సంక్షేమం, వారికి మెరుగైన వసతి సౌకర్యాల కల్పనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ మరో కీలక ముందడుగు వేసింది. అధికారిక విధులపై వివిధ జిల్లాల నుంచి మంగళగిరికి వచ్చే పోలీసు సిబ్బందికి సురక్షితమైన, సౌకర్యవంతమైన వసతి కల్పించేందుకు 6వ బెటాలియన్ ఎపిఎస్పీ ప్రాంగణంలో పురుషుల కోసం 'విహార్', మహిళల కోసం 'విహారి' పేరుతో ప్రత్యేక ట్రాన్సిట్ అకామడేషన్ భవనాలను నిర్మించనున్నారు. వీటితోపాటు సమీకృత సెంట్రల్ పోలీస్ క్యాంటీన్ నిర్మాణానికి రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా శుక్రవారం శంకుస్థాపన చేశారు.

**ఒక్కో భవనం 13,603 చదరపు అడుగుల్లో..**

పోలీస్ ప్రధాన కార్యాలయంలో సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, బందోబస్తు విధులు, ఇతర అధికారిక పనుల నిమిత్తం రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, యూనిట్ల నుంచి పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బంది మంగళగిరికి వస్తుంటారు. వారికి తగిన వసతి అందుబాటులో లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని 'విహార్', 'విహారి' భవనాల నిర్మాణాన్ని చేపట్టారు.

పురుషులు, మహిళలకు వేర్వేరుగా నిర్మించే ఒక్కో భవనం సుమారు 13,603 చదరపు అడుగుల విస్తీర్ణంలో గ్రౌండ్ ఫ్లోర్‌తోపాటు రెండు అంతస్తులతో రూపుదిద్దుకోనుంది. 'విహార్'లో సుమారు 120 మంది పురుష పోలీసు సిబ్బంది, 'విహారి'లో 120 మంది మహిళా పోలీసు సిబ్బంది బస చేసేందుకు వీలుగా సదుపాయాలు కల్పించనున్నారు. వివిధ ప్రాంతాల నుంచి అధికారిక పనులపై మంగళగిరికి వచ్చే సిబ్బందికి సురక్షితమైన, అందుబాటు ధరలో, సౌకర్యవంతమైన శాఖాపరమైన వసతి కల్పించడం ఈ



ప్రాజెక్టుల ప్రధాన ఉద్దేశం. దీనివల్ల బయట వసతి కోసం వెతకాల్సిన అవసరం, అదనపు వ్యయం తగ్గడంతోపాటు సిబ్బందికి క్రమబద్ధమైన, గౌరవప్రదమైన బస సౌకర్యం అందుబాటులోకి రానుంది.

**20 వేల చదరపు అడుగుల్లో సెంట్రల్ పోలీస్ క్యాంటీన్**

పోలీసు సిబ్బంది, వారి కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, సంక్షేమ సేవలను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకొచ్చేందుకు మంగళగిరి పోలీస్ ప్రధాన కార్యాలయంలో సమీకృత సెంట్రల్ పోలీస్ క్యాంటీన్ నిర్మించనున్నారు. దీనికీ డిజిపి హరీష్‌కుమార్ గుప్తా శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం 6వ బెటాలియన్ ఏపీఎస్పీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న పోలీస్ క్యాంటీన్ ఉంది. ఇది పెరుగుతున్న అవసరాలకు సరిపోవడం లేదు. పోలీస్ ప్రధాన కార్యాలయంతోపాటు సమీపంలోని సిఐడి, పోలీస్ కమ్యూనికేషన్స్, పిసిఎస్ అండ్‌ఎస్, ఆక్టోపస్, పిటిఒ తదితర పోలీసు విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య పెరగడంతో మరింత విశాలమైన, ఆధునిక క్యాంటీన్ అవసరమైంది.

ఈ నేపథ్యంలో 6వ బెటాలియన్ ఎపిఎస్పీ ప్రాంగణంలో సుమారు 20 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రీఇంజినీర్డ్ బిల్డింగ్ విధానంలో సమీకృత సెంట్రల్ పోలీస్ క్యాంటీన్‌ను నిర్మించనున్నారు. ప్రస్తుత అవసరాలతోపాటు భవిష్యత్తులో పెరిగే అవసరాలను తీర్చేలా దీనిని తీర్చిదిద్దనున్నారు. పోలీసు సిబ్బందికి నిత్యావసర వస్తువులు మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావడంతోపాటు సంక్షేమ సేవలను ఒకేచోట సమర్థంగా అందించేందుకు ఈ క్యాంటీన్ ఉపయోగపడనుంది.

ఈ సందర్భంగా డిజిపి హరీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది సంక్షేమం, వారి శ్రేయస్సుకు రాష్ట్ర పోలీస్ శాఖ అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. అధికారిక విధుల నిమిత్తం మంగళగిరికి వచ్చే పురుష, మహిళా పోలీసు సిబ్బందికి 'విహార -విహారి' భవనాలు సురక్షి తమైన, సౌకర్యవంతమైన, గౌరవప్రదమైన వసతిని అందిస్తాయని పేర్కొన్నారు.

సమీకృత సెంట్రల్ పోలీస్ క్యాంటీన్ ద్వారా పోలీసు సిబ్బంది, వారి కుటుంబాలకు ఆధునికమైన, సౌకర్యవంతమైన సంక్షేమ సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. మూడు ప్రాజెక్టుల నిర్మాణంలో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను డిజిపి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిజిపి (శాంతిభద్రతలు) ఎన్. మధుసూదన్‌రెడ్డి, ఐజిలు ఎం.రవిప్రకాశ్, బి.రాజకుమారి, సిహెచ్. శ్రీకాంత్, కె.వి. మోహన్‌రావు, డిఐజిలు అన్బురాజన్, ఆర్.ఎస్. అమ్మిరెడ్డితోపాటు పలువురు సీనియర్ పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాయలసీమ 'మేయర్' వ్యూహంపై కూటమి కసరత్తు!

**ఐదు కార్పొరేషన్లలో మూడు దక్కించుకోవడమే లక్ష్యం**

**తిరుపతి, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి:** రాయలసీమలోని ఐదు మున్సిపల్ కార్పొరేషన్లపై కూటమి పార్టీలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. రాష్ట్రంలో మొత్తం 17 మున్సిపల్ కార్పొరేషన్లు ఉన్నప్పటికీ, రాయలసీమలోని కర్నూలు, కడప, అనంతపురం, తిరుపతి, చిత్తూరు కార్పొరేషన్లను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. గతంలో ఈ ప్రాంతాల్లో వైసిపికి ఉన్న బలమైన రాజకీయ పునాది, మాజీ సిఎం జగన్‌మోహన్ రెడ్డికి ఉన్న ప్రభావం నేపథ్యంలో కనీసం మూడు కార్పొరేషన్లను కైవసం చేసుకోవాలని కూటమి వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మేయర్ అభ్యర్థుల ఎంపిక విషయంలో కూటమి నాయకత్వం ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్థానిక రాజకీయ సమీకరణాలు, సామాజిక వర్గాల బలం, అభ్యర్థుల వ్యక్తిగత ప్రభావం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**ఎమ్మెల్యే వర్గానికి కాకుండా మరో వర్గానికి?:** కూటమి పరిశీలిస్తున్న ప్రధాన వ్యూహాల్లో ఒకటి.ఆయా కార్పొరేషన్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే సామాజిక వర్గానికి గాకుండా, అదే ప్రాంతంలో గణనీయమైన ఓటు బ్యాంకు ఉన్న మరో ప్రధాన సామాజిక వర్గానికి మేయర్ అభ్యర్థిత్వం ఇవ్వడం, తద్వారా కూటమిలోని వివిధ సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడంతో బాటు విస్తృతమైన ఓటు సమీకరణ సాధించవచ్చన్న ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది.

రాయలసీమలోని ఐదు కార్పొరేషన్లలో తిరుపతికి జనసేన ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తుండగా, మిగిలిన నాలుగు ప్రాంతాల్లో టిడిపి ఎమ్మెల్యేలు ఉన్నారు. ఈ నేపథ్యంలో ఐదు మేయర్ స్థానాల్లో కనీసం ఒకదానిని జనసేనకు కేటాయించే అవకాశంపై కూడా చర్చ జరుగుతున్నట్లు సమాచారం.

**కర్నూలులో బిసి కార్డు?:** కర్నూలు ఎమ్మెల్యేగా వైశ్య సామాజిక వర్గానికి చెందిన టిజి భరత్ ఉండటంతో బాటు ఆయన రాష్ట్ర మంత్రిగా కూడా ఉన్నారు. ఈ నేపథ్యంలో కర్నూలు మేయర్ పదవిని నగరంలో గణనీయమైన ఓటు బలం ఉన్న బీసీ సామాజిక వర్గానికి కేటాయిస్తే రాజకీయంగా ప్రయోజనం ఉంటుందనే అభిప్రాయం కూటమి వర్గాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇది కేవలం సామాజిక సమీకరణమే కాకుండా.. బిసిఓటర్లను కూటమి వైపు మరింతగా ఆకర్షించే వ్యూహంగా కూడా ఉపయోగపడుతుందనే అంచనాలు ఉన్నాయి.

**కడపలో మైనారిటీ సమీకరణం?:** కడపలో ఎమ్మెల్యేగా ఆర్. మాధవీరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రెడ్డి సామాజిక వర్గం తర్వాత నగర రాజకీయాల్లో ముస్లిం మైనారిటీలకు గణనీయమైన ప్రాధాన్యత ఉంది. ఈ నేపథ్యంలో మేయర్ పదవిని ముస్లిం మైనారిటీ వర్గానికి ఇవ్వడం ద్వారా సామాజిక సమీకరణాన్ని విస్తరించ వచ్చనే ఆలోచన ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే స్థానిక ఎన్నికల రిజర్వేషన్, అభ్యర్థుల రాజకీయ బలం, పార్టీ సమీకరణాలు తదితర అంశాల ఆధారంగానే తుది నిర్ణయం ఉండే అవకాశం ఉంది.

**అనంతపురంలో ఎస్సీ వర్గానికి?:** అనంతపురం ఎమ్మెల్యేగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఉన్న నేపథ్యంలో మేయర్ పదవిని ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నగరంలో ఎస్సీ ఓటర్ల ప్రాధాన్యతతో పాటు.. కూటమిలో సామాజిక సమతుల్యత సాధించాలనే ఉద్దేశంతో ఈ ప్రతిపాదన ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది.

**తిరుపతిలో 'రెడ్డి' వ్యూహం?:** తిరుపతి ఎమ్మెల్యేగా బలిజ సామాజిక వర్గానికి చెందిన శ్రీనివాసులు ఉన్నారు. ఈ నేపథ్యంలో మేయర్ పదవిని రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతకు కేటాయించే అంశంపై కూడా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ఇక్కడ రాజకీయంగా మరో అంశం కూడా ప్రాధాన్యం సంతరించుకుంటోంది. వైసిపికి చెందిన సీనియర్ నేత, మాజీ టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ప్రభావం ఉన్న తిరుపతిలో అదే సామాజిక వర్గానికి చెందిన బలమైన అభ్యర్థిని ముందుకు తీసుకురావడం ద్వారా వైసిపికి ధీటైన రాజకీయ సమీకరణాన్ని రూపొందించవచ్చనే అభిప్రాయం కూటమి వర్గాల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

**చిత్తూరులో జనసేనకు ఛాన్స్?:** చిత్తూరు ఎమ్మెల్యేగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన గురజాల జగన్‌మోహన్ నాయుడు ఉన్నారు. భవిష్యత్ రాజకీయ సమీకరణాల్లో జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని కమ్మ సామాజిక వర్గానికి చెందిన నేతకు ఇవ్వాలనే ఆలోచన ఉంటే మేయర్ పదవిని మరో సామాజిక వర్గానికి ఇవ్వడం ద్వారా సమతుల్యత సాధించవచ్చనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో చిత్తూరు మేయర్ స్థానాన్ని జనసేనకు కేటాయించి, బలిజ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిని బరిలోకి దించే అవకాశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇది జనసేనకు పట్టణ రాజకీయాల్లో మరింత ప్రాధాన్యత కల్పించడంతో పాటు.. కూటమిలో టిడిపి,జనసేన మధ్య సామాజిక, రాజకీయ సమన్వయానికి ఉపయోగపడుతుందనే అంచనాలు ఉన్నాయి.

మేయర్ అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమీకరణాలతో పాటు మహిళా ప్రాతినిధ్యాన్ని కూడా కూటమి పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని తెలుస్తోంది. రాయలసీమలో మేయర్ పీఠాలు కూటమి సామాజిక సమీకరణాలకు మరో పరీక్షగా మారనున్నాయా? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చగా మారింది.

## ఉద్యోగ సంఘాల ఉద్యమ శంఖారావం

# సిఎస్‌కు నోటీసు అందజేత

**విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త:** ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.40వేల కోట్లకు పైగా బకాయిలు, కరువు భత్యం పెంపు, జీత భత్యాల పెంపుదల, పదవీ విరమణ చేసిన ఉద్యోగుల బకాయిలు తదితర 29 సమస్యల సాధన కోసం ప్రభుత్వ ఉద్యోగులు జెఎసి అమరావతి ఆధ్వర్యంలో ఆందోళనకు సిద్ధమవుతున్నారు. విజయవాడలో సమావేశమైన వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖల ఉద్యోగ సంఘాలు ఉద్యమ శంఖారావాన్ని పూరించాయి. ఎపిజెఎసి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తూ, వినతిపత్రాలు అందజేయడంతోపాటు చర్చలు, సమావేశాలు నిర్వహించినప్పటికీ నిర్ణయాలు తీసుకోవడంలో ప్రభుత్వం తీవ్రమైన జాప్యం చేస్తున్నందున ఉద్యమ బాట పట్టక తప్పడం లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్‌పై ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర స్థాయి సదస్సులో చర్చించి జిల్లా నాయకత్వాల అభిప్రాయాలతోనే ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్ణయాలు తీసుకున్నామని, 13 లక్షల మంది ఉద్యోగుల భవిష్యత్‌దృష్టిలో ఉంచుకొని జిల్లాల నిర్ణయం మేరకు ఉద్యమ కార్యాచరణను చేపట్టామన్నారు. ఎన్నికల ముందు కూటమి మేనిఫెస్టో లో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నదే ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యమని, ఈ ఉద్యమం ద్వారా ప్రజలకు వచ్చే ఇబ్బందులను ప్రభుత్వమే భాధ్యత వహించాల్సి వస్తుందని ఎపిజెఎసి అమరావతి స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు తెలిపారు. తొలి దశ ఉద్యమంలో భాగంగా ఉద్యమకార్యాచరణ, డిమాండ్లను తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని శుక్రవారం కలిసి నోటీసు చేశారు. ఈ నెల 31 నుంచి సెప్టెంబరు 11వరకు తొలిదశ ఉద్యమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 31న జిల్లా కలెక్టర్లను కలిసి ఉద్యమ కార్యాచరణ నోటీసులు అందజేయడంతో పాటు సెప్టెంబర్ 15 నుంచి వర్క్ టూ రూల్ ప్రారంబిస్తున్నట్లు జిల్లా కలెక్టర్లకు తెలియజేస్తామన్నారు.

వార్త


నీ వద్ద ఉన్న వస్తువులను మార్చవచ్చు, సరిదిద్దవచ్చు, కాని ఒక్క పర్యాయం పలికిన మాటను మాత్రం తిరిగి రాబట్టుకోలేము.

న- రాస్‌కామన్

# చక్కెర చేదెక్కింది !

దేశంలో చక్కెర ధరలు అమాంతం ఒక్కసారిగా భారీగా పెరిగాయంటే ఏమనుకోవాలి? ఎవరిని అనుకోవాలి. పోనీలే తీపి చేదయ్యిందని సరిపెటుకోవాలా? నెల రోజుల్లో దాదాపు రూ.20 వరకు పెరిగినట్లు అంచనా. రాఖీ, వినాయక చవితి, దసరా, దీపావళి వంటి పండుగల సమయంలో స్వీట్లు, బేకరీ ఉత్పత్తులు, పానీయాలు తదితరాల తయారీలో చక్కెర డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో ఈ అదనపు డిమాండ్‌ను మార్కెట్ సులభంగా గ్రహించ గలదు. ఇప్పటికే అంచనాల కంటే ఉత్పత్తి తక్కువగా ఉన్నప్పుడు, పండుగల డిమాండ్ ధరలపై మరింత ఒత్తిడి తెస్తుంది. ప్రస్తుతం అదే జరుగుతోంది. ప్రస్తుతం దేశంలో చక్కెర ధరల పెరుగుదలకు. చక్కెర ఉత్పత్తి తగ్గిపోవడం, పండుగల సీజన్ కావడంతో డిమాండ్ భారీగా పెరగడం, వాతావరణ సమస్యలు పంట నష్ట పోవడం, అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థ కఠినంగా మారడం వంటి కారణాలే కళ్లెదుట కన్పిస్తాయి. దేశీయ ఉత్పత్తి అంచనాల కంటే తగ్గడం. 2026 సీజన్‌లో తొలుత సుమారు 343 లక్షల టన్నుల ఉత్పత్తి ఉంటుందని అంచనా వేయగా, తాజా అంచనాలు దాన్ని సుమారు 306 లక్షల టన్నులకు తగ్గించాయి. చెరకులో రెడ్ రాట్, టాప్ బోరర్ వంటి వ్యాధులు, అధిక వర్షాలతో నీటిమునక వంటి పరిస్థితులు ఉత్పత్తిపై ప్రభావం చూపాయి. గత జూలై 20న కిలో చక్కెర ధర సగటున కేజీకి రూ.48.18 పైసలు ఉండగా, ప్రస్తుతం కేజీ ధర రూ.55.70గా ఉంది. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2026 జూలై 20న కిలో చక్కెర సగటు రిటైల్ ధర రూ.48.18 ఉండగా, ఆగస్టు 20 నాటికి అది రూ.55.70కు చేరింది. అంటే ఒక్క నెలలోనే సుమారు 15.6 శాతం పెరుగుదల నమోదైంది. ఆ తర్వాత కూడా ధరల ఒత్తిడి కొనసాగి, ఆగస్టు 26న సగటు రిటైల్ ధర రూ.65.06కు చేరింది. మళ్లీ వెనుక చూపు చూసే పరిస్థితి కనుచూపు మేరలో కాన రాదు. వాతావరణ మార్పులు వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్‌ను ఎంత అస్థిరంగా మారుస్తున్నాయో చక్కెర ధరే మరోసారి గుర్తుచేస్తోంది. చెరకు సాగుకు నీరు అధికంగా అవసరం. ఒకవైపు అధిక వర్షాలు పంటను దెబ్బ తీయవచ్చు. కేంద్ర ప్రభుత్వ వివరణ ప్రకారం, దేశీయ అవసరాలను తీర్చడానికి తగినంత నిల్వలు ఇంకా ఉన్నాయి. కొత్త చెరకు క్రషింగ్ సీజన్ అక్టోబర్‌లో ప్రారంభం కానుంది. కాబట్టి ప్రస్తుతం కనిపిస్తున్న ధరల పెరుగుదలను పూర్తిస్థాయి కొరతగా మాత్రమే చూడలేము. చెరకు నుంచి చక్కెరతో పాటు ఇథనాల్ తయారీకి కూడా ముడి సరుకు మళ్లుతోంది. అందువల్ల వినియోగానికి అందుబాటులో ఉండే చక్కెర పరిమాణం తగ్గుతోందనే వాదన వినిపిస్తోంది. చక్కెర ధరల పెంపునకు, ఇథనాల్ ఉత్పత్తికి సంబంధం లేదని కేంద్ర వినియోగదారులు వ్యవహారాలు, ఆహారం, సరఫరా శాఖ తెలిపింది. 2022-23లో ఇథనాల్ కోసం మళ్లించిన చక్కెర వాటా సుమారు 12 శాతం ఉండగా, 2025-26లో అది సుమారు 9 శాతానికి తగ్గిందని ప్రభుత్వం పేర్కొంది. అలాగే దేశంలో ఉత్పత్తి అవుతున్న ఇథనాల్‌లో దాదాపు మూడు వంతులు ధాన్యాల నుంచి, ముఖ్యంగా మొక్కజొన్న నుంచి వస్తోందని తెలిసిందే. భారతదేశం ప్రపంచంలో అతిపెద్ద చక్కెర ఉత్పత్తి దారుల్లో ఒకటి. 2026-27లో ప్రపంచ చక్కెర లోటు సుమారు 33 లక్షల టన్నులుగా అని వేయబడు తోందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. అంతర్జాతీయ చక్కెర ధర కూడా జూన్ 30న టన్నుకు 474 డాలర్ల నుంచి ఆగస్టు 20 నాటికి 552 డాలర్లకు పెరిగింది అంటే రెండు నెలల్లో 16 శాతానికి పైగా పెరుగుదల. 2026-27 సీజన్‌కు చెరకు రైతులకు 'ఫెయిర్ అండ్ రెమ్యునరేటివ్ ప్రైస్' ను కేంద్ర ప్రభుత్వం ప్రాథమిక రికవరీ రేటు 10.25 శాతానికి క్వింటాల్‌కు రూ.365గా నిర్ణయించింది. రికవరీ పెరిగితే అదనపు ప్రీమియం, తగ్గితే అనుపాత తగ్గింపు విధానం కూడా ఉంది. రైతుకు గిట్టుబాటు ధర లభించాలి. మిల్లులకు ఆర్థిక స్థిరత్వం ఉండాలి. వినియోగదారుడికి సరసమైన ధర ఉండాలి. ఈ మూడు లక్ష్యాలను ఒకేసారి సాధించడమే మంటే జరిగే పని కాదు. చక్కెర విధానానికి అసలు పరీక్ష. చక్కెర ధరల విషయంలో మరో కీలక అంశం హోర్డింగ్ లేదా నిల్వచేసి ధర పెంచే ప్రయత్నాలు, డిమాండ్-సరఫరా మధ్య చిన్న అంతరం ఉన్న సమయంలో పెద్ద మొత్తంలో చక్కెరను మార్కెట్ నుంచి తాత్కాలికంగా వెనక్కి తీసుకోవడం ధరలను వేగంగా పెంచవచ్చు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆగస్టు 1 నుంచి నవంబర్ 30 వరకు చక్కెర వ్యాపారుల నిల్వలపై పరిమితులు విధించింది. అధిక నిల్వలు, కృత్రిమ కొరతను నిరోధించడమే ఈ చర్య ఉద్దేశమని ప్రభుత్వం తెలిపింది.. ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు తీసుకుంది. నిల్వల పరిమితులు విధించడం, ఎగుమతులపై నియంత్రణ, మార్కెట్‌నుపర్యవేక్షించడం, అదనపు దిగుమతులకు అనుమతి ఇవ్వడం వంటి చర్యలు తీసుకుంది. తాజాగా ఒక మిలియన్ టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునేం దుకు ప్రభుత్వం అనుమతించింది. దీని తర్వాత రిటైల్ ధర ఆగస్టు 27న స్వల్పంగా తగ్గినట్లు నివేదికలు చెబుతున్నాయి.. కానీ ఆహార వినియోగానికి అవసరమైన చక్కెర సరఫరాపై ప్రతికూల ప్రభావం పడకుండా విధానాలను సమన్వయం చేయగలితేనే చక్కెర ధర అదుపులో ఉంటుంది.

మాటల ద్వారా నీ శత్రువుని మిత్రునిగా మార్చుకోలేకపోవచ్చు కానీ మిత్రుడిని శత్రువుగా మార్చుకోవచ్చు.



బెంజమిన్ ఫ్రాంక్లిన్

మానవత్వమే మానవుని అసలైన మతం. దయగల హృదయమే భగవన్నిలయం.



స్వామి వివేకానంద

## ప్రజావాక్కు



### వందేమాతరంపై రాద్ధాంతమెందుకు?

ఒకనెల నుండి పత్రికల్లో వందేమాతరంపై బీజేపీ వాళ్ళు, వందేమాతరం పూర్తిగాపాడకపోతే జైలే అని బెదిరిస్తున్నారు. చట్టం కూడా చేశారు. మూకబలం ఉందని దేవుళ్లను దెయ్యాలను కీర్తిస్తూపాడాలని చట్టం చెయ్యడం ఏమిటి? ఇది నియంతృత్వ పాలనా? మొన్న ఒక చోట కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఖర్గే గారూ,సోనియా గాంధీ గారు వందే మాతరం పాడేటప్పుడు ఎప్పటి లాగా మొదటి రెండు చరణాలుపాడిన తరువాత ఇకచాలు అని సోనియాగాంధీ గారు అన్నారు. అందుకు బీజేపీ మూక వందేమాతరం పూర్తిగా పాడక పోతే జైలే గతి అని తెగ బెదిరిస్తున్నారు. చాలా దుర్మార్గం.మిగిలిన చరణాలలో దుర్గాదేవిని స్తుతిస్తూ ఉన్నాయి. వంద సంవత్సరాల క్రితమే ఈ వివాదం ఉన్నది. కానీ అదే ఆనవాయితీ కొనసాగుతుంది. వంద సంవత్సరాల నుండి లేని ఈ వివాదం ఇప్పుడెందుకు? సెక్యులర్ విదానం వైపు ఆలోచిస్తే బాగుంటుంది.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### హోమ్‌స్టేలను ప్రోత్సహించాలి

తెలంగాణలో హోమ్‌స్టేలను ప్రోత్సహించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన పర్యాటక రంగంలో స్థానిక కుటుంబాలకు కొత్త అవకాశాలను అందించగలదు. చారిత్రక కట్టడాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి సోయగాలు, జానపద సంస్కృతి, గ్రామీణ జీవనశైలితో తెలంగాణకు ప్రత్యేక పర్యాటక ఆకర్షణ ఉంది. అయితే పర్యాటకాభివృద్ధి కొద్ది ప్రముఖ ప్రాంతాలకేపరిమితం కాకుండా,గుర్తింపు పొందని ప్రాంతాలకూ విస్తరించాల్సిన అవసరం ఉంది.ఈ విషయంలో హోమ్‌స్టేలు కీలకపాత్ర పోషించవచ్చు. హోమ్‌స్టేల్లో బస చేసే పర్యాటకులకు స్థానిక జీవన విధానం, ఆహారపు అలవాట్లు, సంప్రదాయాలు, సంస్కృతిని దగ్గరగా తెలుసుకునే అవకాశం లభిస్తుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఎస్సీ,ఎస్టీ ఉద్యోగులపై వివక్షత ?

వికలాంగుల హక్కుల చట్టం వచ్చి 10 సంవత్సరాలు అవుతున్న కూడా ఆఫీసులలో, విద్యాసంస్థలలో వికలాంగులపై అధికారులు వివక్ష చూపుతున్నారు. 1989 ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం వచ్చి 37సంవత్సరాలు అవుతున్న కూడా వికలాంగులపై ఈసడింపులు, దూషణలు, దుర్భాషలాడుతున్నారు. వికలాంగుల చట్టంపై చైతన్య కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### భారీ విధ్వంసం అల్పదేశాలకు అపార నష్టం

వర్షాలు లేవు కాని వరదలు ముంచెత్తడం విడ్డూరం.ప్రకృతి వైపరీత్యాల వలనభూకంపాలు, తుఫానులు, వరదలు వంటి మానవ నియంత్రణకు అందనిసహజ సిద్ధమైన ప్రమాదాలు. ఇవి సమాజంపై, ప్రాణ, ఆస్తుల, పర్యావరణంపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతాయి. భూగర్భంలో పలకల కదలికల వల్ల భూమి కంపించడం భూ కంపాలు,సముద్రాలపై ఏర్పడే తీవ్రమైన గాలులు, భారీ అలలు, తుఫానులు, సునామీలు, అతివృష్టి వల్ల ముంపు లేదా వర్షాలు లేక నీటి ఎద్దడి ఏర్పడటం వరదలు, కరవు, వర్షాలు లేదా భూకంపాల కారణంగా కొండలు కూలడం, కొండచరియలు విరిగి పడటం, వేలాది మంది ప్రజలు మూగజీవాలు మరణించి ప్రాణ నష్టం, ఇళ్లు, రోడ్లు, విద్యుత్ వ్యవస్థలు పూర్తిగా ధ్వంసమై ఆస్తి నష్టం, ఉపాధి కోల్పోవడం, వ్యవసాయం నాశనం కావడం ఇవన్నీ మన కళ్లముందే నేపాల్ టిబెట్‌లలో జరిగాయి.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

### సరైన నిర్ణయం తీసుకోవాలి

కొన్ని వేల ఏళ్ల క్రితం మనిషి జీవనంలో ప్రకృతి విస్తృతంగా ఉండేది. దానిమీదే దినం గడిపే వారు. కాయాకష్టం వల్ల శరీరాలు ధారుద్యం, పూర్తి రోగనిరోధక శక్తి ఉండేది. ఆకులు, గింజల వైద్యం వారికి శరణ్యం. అది అప్పటి పరిస్థితి. గానీ ఇప్పుడు వైద్యశాస్త్రం విస్తృతంగా పెరిగి రోగ నిర్ధారణతో వైద్యం ఫలితం ఇస్తుంది. కొందరి దేహస్థితి కొన్ని పదార్థాలకు వికృతంగా కనిపిస్తుంది.అందుకు శరీర లక్షణాలు చూడకుండా అల్లోపతి వైద్యం చేయరాదు. అలానే పాత ఆకుల రసం అందరికీ పనిచేయదు. అది గుర్తెరిగి గ్రామాల వైద్యులు రోగి స్థితి బట్టి దగ్గరి వైద్యశాలకు పంపాలి.

- బొల్లోజు మేజ్ఞాధం, విశాఖపట్నం

### పాకిస్థాన్‌కు మానవత్వం ఉందా?

మనుషుల గురించి వారి హక్కుల గురించి ప్రస్థావిస్తున్న నేటి కాలంలో పాకిస్థాన్ అనుసరిస్తున్న వైఖరి మూదావాహం. ఇమ్రాన్ రాజకీయంగా ఎన్ని తప్పులు చేసారు అనేది పక్కన పెడితే ఇమ్రాన్ ముందు ఒక మనిషి అని గుర్తించండి. అతను పాకిస్థాన్ క్రీడా పతాకాన్ని ప్రపంచం ముందట ఎగరావేసినవాడు. ప్రపంచం మెచ్చిన మేటి ఆల్రౌండర్స్‌లో ఒకడు. అందుకే 20కి పైగా ప్రపంచ మాజీ సారథులు ఆయనకు మంచి వైద్యం అందించాలని బహిరంగ లేఖ రాశారు.మాకు మానవత్వం ఉందని పాకిస్థాన్ ప్రపంచానికి చాటుతుందా?

-భారత అవినాష్, జనగామ

# మాటలకందని విషాదమిది !

ఏటా లక్షలాది మంది ఉపద్రవాలతో ప్రాణాలు వదులుతుంటే కోట్ల సంఖ్యలో బాధితులుగా మారుతున్నారు. మరెందరో రోగ పీడితులవుతున్నారు. ఇక ఆస్తుల నష్టం గురించి చెప్పాల్సిన పనిలేదు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత సంపాదించినా ఆధునికంగా ఎంత పురోభివృద్ధిలో పయనించినా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితులనుండి మానవుడు బయట పడలేకపోతున్నారు. మరొక పక్క తుపానుల బారి నుంచి తీరప్రాంతాలు తప్పించుకో లేకపోతున్నాయి. గతంలో దివి సీమలో సంభవించిన తుపాను సిరిధాన్యాలతో తులతూగే దివిసీమను శవాలసీమగా మార్చివేసింది. ఇప్పటికీ ఆ భీభత్సం గురించి కథలుకథలుగా చెప్పుకుంటారు. ఇక మహా రాష్ట్ర లోని లాతూరులో సంభవించిన భూకంపం ఎన్నో కుటుం బాలను చిదిమేసింది. సునామిల గురించి చెప్పాల్సిన పని లేదు. ఇలా ఎన్నో వైపరీత్యాలు అతలాకుతలం చేస్తున్నాయి.

తమలపాకుతో నువ్వొట్లంటె తలుపుచెక్కతో నేనిట్లంటా అన్నట్లుగా వ్యవహరిస్తున్నది మానవాళితో ప్రకృతి. విశ్వవ్యాప్తంగా మానవతప్పిదాలవల్లనే విపత్తులు ఒకదాని వెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణఆస్తి నష్టాలకు కారణం అవుతున్నాయి. వాతావరణంలో తలెత్తు తున్న అనూహ్య మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారి తీస్తున్నాయి. ఇందుకు ప్రధానంగా తప్పుపట్టాల్సింది నిందించాల్సింది మానవుని పర్యావరణ విధ్వంసక చర్యలే. భీభత్సాలకు విపత్తులకు కారణం అవుతున్నాయని ఎన్నో అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణాన్ని కాపాడు కోలేకపోతే మానవుని మనుగడే భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు దశాబ్దాల తరబడి పదేపదే ఆందోళన వ్యక్తంచేస్తున్నా పట్టించుకున్న నాధుడే లేకుండా పోతున్నాడు. పర్యావరణాన్ని కాపాడటం అటుంచి తూట్లు పొడవడం దురదృష్టకరం. అభివృద్ధి పేరు తో ఆయా దేశాల ప్రభుత్వాలు చేస్తున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటుచేస్తున్నాయి. తాజాగా ప్రకృతి ధాటికి బుధవారం నేపాల్ చివురుటాకులాగా వణికిపోయింది. రాజ ధాని ఖాట్మండు సమీపంలోని రాసువా, దాడింగ్ జిల్లాల ఎగువ ప్రాంతాల్లో సంభవించిన ప్రకృతి ప్రకోపంతో మంచు కొండ విరిగి పడటంతో అనూహ్యరీతిలో నది ప్రవాహం నీటిమట్టాలు పెరిగాయి. ఒక్కసారిగా మెరుపు వరదలు సంభవించి లోతట్టుప్రాంతాలను ముంచెత్తివేసాయి. నదీ పరివాహక ప్రాంతాలు మట్టిదిబ్బలుగా మారిపోయాయి. టిబెట్‌లో మొదలయిన వరద, బురద ఉప్పెన ఉరుముల్లేని మెరుపుల్లా వచ్చి నేపాల్‌మధ్యప్రాంతాన్ని దాదాపు తుడిచి పెట్టేసిందనే చెప్పొచ్చు. గ్రామాలు, పట్టణాలు జలసమాధి అయ్యాయి. ఇప్పటివరకూ అందిన సమాచారం ప్రకారం దాదాపు వేయి మందికి పైగా మృతి చెందినట్లు చెపుతున్నారు. మరో రెండువేల మందికి పైగా గల్లంతయి నట్లు సమాచారం. ఇందులో భారతీయులు మూడు వందల మందికి పైగా ఉన్నారంటున్నారు. వాస్తవంగా నేపాల్, టిబెట్ సరి హద్దుల్లోని బోటికోశి నది బుధవారం ఉదయం ఒక్కసారిగా ఉప్పొంగింది. అమెరికా, మలేసియా, దక్షిణాఫ్రికా, బ్రిటన్, నెదర్లాండ్స్, దక్షిణకొరియా తదితర దేశాలనుంచి వచ్చిన పర్యాటకుల జాడ తెలియడంలేదని చెపుతున్నారు. ఆ వరద ధాటికి నేపాల్ చైనా రోడ్డు మార్గంపూర్తిగా ధ్వంసం అయింది. ఎటుచూసినా అడుగుల ఎత్తులో పేరుకుపోయిన బురద సాయం కోసం అర్థిస్తున్న జనం హాహాకారాలతో ఆ ప్రాంతం విషాద వాతావరణం రాజ్యమేలింది. బురదలో కురుకు పోయిన మృత దేహాలను బయిటికి తీస్తున్నారు. సమాచారం అందుకున్న నేపాల్ సైన్యం సాయుధ పోలీస్ బలగాలు, నేపాల్ పోలీసులు జాతీయ విపత్తు విభాగ బలగాలు హుటాహుటిన

దామెర్ల సాయిబాబ

రంగంలోకి దిగి బాధితులను కాపాడేందుకు సహాయక చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టారు. రోడ్లు బురదతో కప్పుకు పోవడంతో వాయు మార్గంలో తప్ప ఆ పన్నులకు చేయూత నివ్వలేకపోతున్నారు.. వాతావరణంలో వేగంగా వస్తున్న మార్పులు హిమాలయ పర్వతాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వాతావరణ నిపుణుల హెచ్చరికలు పట్టించుకొనే నాధుడే లేకుండా పోయారు. ఫలితంగా హిమాలయాలు వరదలు, భూప్రకంపనాలు, మంచుకొండలు విరిగి పడడంలాంటి ఉపద్రవాలు తోసుకవస్తున్నాయి. 2013లో

## ఒక్క మాట

ఉత్తరాఖండ్ జలవిలయం 5వేల నాలుగు వందల మందిని పొట్టను పెట్టుకున్నది. ప్రస్తుతం జరిగిన ప్రకృతి భీవత్సం ఎంతమందిని బలి తీసుకొన్నదో మరికొంత సమయం అయితే తప్ప తెలియదు. పర్యావరణానికి మానవుడు చేస్తున్న హానికి రెట్టింపు స్థాయిలో ప్రకృతి మానవుడిపై విరుచుకు పడుతున్నదనేందుకు ఇవి సజీవ సాక్ష్యాలు. ఇష్టానుసారంగా రోడ్లనిర్మాణాలు మొదలు పెడితే కొండలను తొలిచి ప్రాజెక్టులు నగరీకరణ పేరుతో ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంటపొలాలను జనావాసాలుగా మార్చడం ఒకటేమిటి ఎన్నివిధాలుగా పర్యావరణానికి నష్టం చేయ గలుగుతారో అన్ని మార్గాల్లోచేసే నిరంతర అన్వేషణ కొనసాగుతూనే ఉంది. ఐక్యరాజ్యసమితి అంచనా ప్రకారం భారత జనాభా వచ్చే పదేళ్లలో 150 కోట్లకు చేరుతుందని, అందుకు తగినట్లుగా సహజవనరులపై ఒత్తిడి పెరుగుతున్నదని, ప్రధానంగా అటవీ సంపద హారించుకు పోతున్నదని స్పష్టంచేసింది. దాదాపు 330 ఎకరాలకుపైగా అటవీ సం పద అదృశ్యం అయిపోతున్నదని ఐక్యరాజ్య సమితి నివేదిక వెల్లడించింది. బొగ్గు గనులు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు నదీలోయ ప్రాజెక్టులకోసం యథేచ్ఛగా అడవులు నరికివేస్తున్నారు. ఇలాంటి కారణాలెన్నో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించలేక పోతున్నారు. ఇందువల్ల పర్యావరణానికి ఎదుర వుతున్న నష్టం అంతా ఇంతా కాదు. ప్లాస్టిక్ సంచి మట్టిలో కలిసిపోవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతున్నది. కొన్ని ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినా అవి కాగితాలకే పరిమితం అవుతున్నాయి. పర్యాటకులు పెరగడంతో హిమాలయాల్లో కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగి వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. ఇక పెట్రోలు, డీజిల్ లాంటి ఇంధన వాడకం పెరిగి పర్యావరణానికి చేటుచేస్తున్నాయి. వాహన కాలుష్యంతోపాటు పరిశ్రమలు వదులుతున్న పొగ అన్నీ కలిపి వాయుకాలుష్యాన్ని పెంచుతున్నాయి. ఇలాంటి రకరకాల కారణాలతో భూమి ఉష్ణోగ్రత పెరిగిపోక తప్పదు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రపంచ వ్యాప్తంగా కూడా ఉష్ణోగ్రతలు పెరిగి దీవులతో సహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఏనాటి నుంచే పర్యా వరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.ఇలా మనిషి ప్రకృతితో ఆటలాడుకుంటుంటే అందుకు ప్రతిగా ప్రకృతి తీవ్రంగానే స్పందిస్తున్నది. పర్యా వరణ సమతుల్యం దెబ్బ తిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురవకపోవడం కురిస్తే ఒకేసారి ప్రాంతంలో కుంభ వృష్టి కురవడం, ఎల్‌నినోలు ఏర్పడటం లాంటివి ఇటీవలి కాలంలో పెరిగి పోతున్నది. ప్రస్తుతం భారత్ సూపర్ ఎల్‌నినోను ఎదుర్కొంటున్నది. వ్యవసాయ రంగం కోలుకోలేకపోతున్నది. అంతేకాదు వరదలు తుఫానులతోపాటు భూకంపాలు లాంటి ఉపద్రవాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ఏటా దాదాపు మూడు వందలఎనభైకి పైగా ప్రపంచ వ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార రికార్డులు వెల్లడిస్తున్నాయి. లక్షలాది మంది ఉపద్రవాలతో ప్రాణాలు వదులుతుంటే కోట్ల సంఖ్యలో బాధితులుగా మారుతు న్నారు. మరెందరో రోగ పీడితులవుతున్నారు. ఇక ఆస్తుల నష్టం గురించి చెప్పాల్సిన పనిలేదు. సాంకేతిక పరిజ్ఞానం ఎంత సంపాదిం చినా ఆధునికంగా ఎంత పురోభివృద్ధిలో పయనించినా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితులనుండి బయట పడలేకపోతున్నారు. మరొక పక్క తుపానుల బారి నుంచి తీరప్రాంతాలు తప్పించు కోలేకపోతున్నాయి. గతంలో దివి సీమలో సంభవించిన తుపాను సిరిధాన్యాలతో తులతూగే దివిసీమను శవాలసీమగా మార్చి వేసింది. ఇప్పటికీ ఆ భీభత్సం గురించి కథలుకథలుగా చెప్పుకుంటారు. ఇక మహా రాష్ట్రలోని లాతూరులో సంభ వించిన భూకంపం ఎన్నో కుటుంబాల ను చిదిమేసింది. సునామిల గురించి చెప్పాల్సిన పని లేదు. ఇలా ఎన్నో వైపరీత్యాలు అతలాకు తలం చేస్తున్నా యి. వెనుకబడిన ప్రాంతాల్లో నిర్మితమవు తున్న రైల్వే ప్రాజెక్టుల వల్ల ఆర్థిక కార్యకలా పాలు ఊపందుకుని అభివృద్ధి చెందు తాయనే మాట వాస్తవమే అయినా అందు వల్ల జరుగుతున్న నష్టం తక్కు వేమీ కాదని వ్యతిరేకించే వారు కూడా తక్కువ సంఖ్యలో లేరు. నిరంతరం రైళ్ల రాకపోకల వల్ల పెళుసుగా ఉండే కొండలు మరింత బల హీనపడతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరదల్లో సర్వం కోల్పయిన వారికి ఆపన్న హస్తం అందివ్వాలసిన తరుణమిది. ఏదిఏమైనా ఈ ఉపద్రవాల నియంత్రణ పర్యావరణాన్ని కాపాడుకునేం దుకు త్రికరణ శుద్ధిగా కృషి చేయాల్సి ఉంది. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ఇలాంటి ఇంకెన్నో ఉపద్రవాలతో భారీ మూల్యం చెల్లించక తప్పదు. ●

# పరీక్షా వ్యవస్థకు ప్రక్షాళన అవసరం!

ఒక పరీక్ష వెనుక ఒక విద్యార్థి భవిష్యత్తు మాత్రమే కాదు ఒక కుటుంబం ఆశలు, తల్లిదండ్రుల త్యాగం, ఎన్నో ఏళ్ల కష్టం ఉంటాయి. అందుకే పోటీ పరీక్షల నిర్వహణలో చిన్న లోపం జరిగినా దాని ప్రభావం వేలాది మంది జీవితాలపై పడుతుంది. ఇటీవల పరీక్షలకు సంబంధించిన ఆరోపణలు, దర్యాప్తులు, న్యాయపరమైన పరిణామాలు పరీక్షా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరోసారి ప్రశ్నార్థకంగా మార్చాయి. పోటీ పెరుగుతున్న కొద్దీపరీక్షల నిర్వహణలో ప్రభుత్వాల బాధ్యత కూడా అంతే పెరగాలి. ప్రశ్నపత్ర భద్రత నుంచి ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశలో స్పష్టమైన ప్రమాణాలు అవసరం. పరీక్ష రద్దు, పునఃపరీక్ష వంటి నిర్ణయాలు అనివార్యమైన సందర్భాల్లో తీసుకోవాల్సి వచ్చినా, వాటి భారాన్ని మోయాల్సింది విద్యార్థులే కాకూడదు. న్యాయబద్ధత,సమాన అవకాశాలు, పారదర్శకత పరీక్షా వ్యవస్థకు మూల సూత్రాలుగా ఉండాలి. ఈ అంశాల ప్రాధాన్యాన్ని న్యాయస్థానాలు కూడా వివిధ సందర్భాల్లో గుర్తించాయి. పరీక్షా సంస్కరణల కోసం కేంద్ర ప్రభుత్వం మాజీ ఇస్రో ఛైర్మన్ డాక్టర్ కె.

ఎన్.సీతారామయ్య

రాధాకృష్ణన్ అధ్యక్షతన నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి పరీక్షా ప్రక్రియ, డేటా భద్రత, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పని తీరుపై సిఫారసులు కోరింది. అక్రమాలను అరికట్టేందుకు పబ్లిక్ ఎగ్జామినేషన్స్ చట్టాన్ని కూడాఅమల్లోకి తీసుకువచ్చింది. ప్రశ్నపత్రం లేదా సమాధాన కీకి సంబంధించిన అక్రమాలు, కంప్యూటర్ వ్యవస్థల్లో అనధికార జోక్యంపై చర్యలకు ఇందులో నిబంధనలున్నాయి. అయితే చట్టం ఉండటమే కాదు దాని అమలువేగంగా, కచ్చితంగా ఉండాలి. సాంకేతిక భద్రతపై కూడా ప్రత్యేక దృష్టిఅవసరం. ప్రశ్నపత్రం తయారీ, ముద్రణ, రవాణా, నిల్వ,పరీక్షనిర్వహణ, మూల్యాంకనం వరకు బహుళస్థాయి భద్రతావ్యవస్థ ఉండాలి. అవసరమైన చోట బయోమెట్రిక్ ధ్రువీకరణ, సీసీటీవీ పర్యవేక్షణ, స్వతంత్ర సాంకేతిక ఆడిట్లను బలోపేతం చేయాలి. ఒకసారి జరిగిన తప్పిదాన్ని గుర్తించడం కంటే, అది మళ్లీజరగకుండా వ్యవస్థను మార్చడమే అసలుసంస్కరణ. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే పేద, మధ్యతరగతి కుటుంబాల యువత ఎన్నో ఏళ్లకష్టం, ఆర్థిక భారంతో ఉద్యోగాల కోసం పోరాడుతున్నారు. పరీక్షలపై అనుమానాలు, నియామకాల ఆలస్యం వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీయడమేకాక కుటుంబాల ఆశలపైనా ప్రభావం చూపుతుంది. ప్రతిపరీక్షా సంస్థకు స్పష్టమైన జవాబుదారీతనం ఉండాలి. పరీక్ష రద్దు, పునఃపరీక్ష లేదా ఇతర మార్పులపై విద్యార్థులకు సమయానికి సమాచారం ఇవ్వాలి.ఫిర్యాదుల పరిష్కారానికి కాలపరిమితి కూడా ఉండాలి. ఈ వ్యవహారంలో మీడియా, ప్రజాచర్చల బాధ్యత కూడా కీలకం. ఆరోపణను తీర్పుగా, దర్యాప్తును తుదినిర్ణయంగా చూపకూడదు. అదేసమయంలో వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించడం, పారదర్శకతను కోరడం ప్రజాస్వామ్య సమాజంలో అవసరమైన బాధ్యత. యువత చేతుల్లో దేశ భవిష్యత్తు ఉందని చెబుతున్నప్పుడు, వారి కష్టానికి న్యాయం చేసే వ్యవస్థను నిర్మించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వాలదే. పరీక్షా మందిరంలోకి వెళ్లే ప్రతి విద్యార్థికి నా కష్టానికి న్యాయం జరుగుతుంది అనే నమ్మకం ఉండాలి. ఆ నమ్మకమే పోటీ పరీక్షల అసలు బలం. ●

# సామాన్యుడికి భారంగా మారిన ధరలు

వంటింటి పొయ్యి వెలిగితేనే కుటుంబ జీవితం సజావుగా సాగుతుంది. కానీ ఆ పొయ్యి మీద గిన్నె పెట్టే ప్రతి కుటుంబానికీ ఇప్పుడు ధరల మంట తప్పడం లేదు. పేదవాడి పళ్లెం నుంచి మధ్యతరగతి కుటుంబం నెలవారీ బడ్జెట్ వరకు ద్రవ్యోల్బణం ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. జీతం పెరగకముందే కిరాణా బిల్లు పెరగడం, ఆదాయం పెరుగుదల కంటే ఖర్చులు వేగంగా పరుగెత్తడం సామాన్యుడి ఆందోళనకు కారణమవుతోంది. ఒకవైపు బియ్యం, పప్పులు, నూనెలు, చక్కెర వంటి నిత్యావసరాలు మరోవైపు కూరగాయలు, ఉల్లి, వెల్లుల్లి, మిరప వంటి వంటింటి సరుకుల ధరలు కుటుంబ ఆర్థిక లెక్కలను తలకిందులు చేస్తున్నాయి. ఇది కేవలం మార్కెట్‌లో ధరల మార్పు మాత్రమే కాదు. ఆహార ధరలు పెరిగితే కుటుంబాలు ముందుగా తగ్గించేది పోషకాహారాన్నే. పండ్లు, పాలు, కూరగాయలు, పప్పుల వినియోగం తగ్గితే దాని ప్రభావం ప్రజల ఆరోగ్యంపైనా పడుతుంది. అందుకే నిత్యావసరాల ధరల నియంత్రణ అనేది కేవలం ఆర్థిక అంశం కాదు.ప్రజా సంక్షేమానికి సంబంధించిన అత్యంత కీలకమైన బాధ్యత. కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ ధరల పర్యవేక్షణ గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా సుమారు సగటు చిల్లర ధర బియ్యం కిలోకు రూ.45.70,కందిపప్పు,రూ.122.12, మినపప్పు రూ.121.76, పెసరపప్పు రూ.110.76, చక్కెర రూ.62.47, బెల్లం రూ.64.79గా నమోదైంది.వంటనూనెల ధరలు కూడా సాధారణ కుటుంబాలపై భారాన్ని పెంచుతున్నాయి. కూరగాయల్లో ఉల్లి ధరలు ప్రత్యేకంగాఆందోళన కలిగిస్తున్నాయి. ఆగస్టు 23 నాటికి దేశ సగటు చిల్లర ధర కిలోకు రూ.42.04గా ఉండగా, కొన్ని ప్రాంతాల్లో స్థానిక సరఫరా పరిస్థితుల కారణంగా ధరలు మరింత ఎక్కువగా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఉల్లి ధరలు జూన్‌లో కిలోకు సుమారు రూ.25 ఉండగా ఆగస్టులో కొన్ని మార్కెట్లలో రూ.60 వరకు చేరినట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి. చక్కెర ధరల పెరుగుదల కూడా ప్రత్యేకంగా గమనించాల్సిన పరిణామం. పండుగలు, శుభకార్యాల సీజన్ సమీపిస్తున్న వేళ చక్కెరకు డిమాండ్ పెరుగుతోంది. దేశీయ చక్కెర ధరలు రెండు నెలల్లో దాదాపు 40శాతం పెరిగిన నేపథ్యంలో, ధరలను అదుపులోకి తెచ్చేందుకు కేంద్రం ఒక మిలియన్ టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకునేందుకు అనుమతించింది. ఈ పరిస్థితుల్లో శుభకార్యాలు, పండుగలు నిర్వహించే కుటుంబాలపై అదనపు

మేకిరి దామోదర్

భారం పడుతోంది. పిండి వంటలకు చక్కెర, బెల్లం,నూనె, పప్పులు, నెయ్యి, పూజలకు పూలు,పండ్లు,అన్నింటి ధరలు పెరిగితే ఒక చిన్న కుటుంబ కార్యక్రమం కూడా మధ్యతరగతి కుటుంబానికి పెద్ద ఆర్థిక భారంగా మారుతుంది. ధరల పెరుగుదలకు ఒక్క కారణాన్నే చూపడం సరికాదు. ఉత్పత్తి తగ్గడం, వాతావరణ మార్పులు,అకాల వర్షాలు,పంట నష్టాలు, నిల్వల వ్యయం, రవాణా ఖర్చులు, సరఫరా అంతరాయాలు, మార్కెట్‌లో మధ్యవర్తుల ప్రభావం వంటి అనేక



అంశాలు ధరలపై ప్రభావం చూపుతాయి. ముఖ్యంగా కూరగాయలు, ఉల్లి వంటి త్వరగా పాడయ్యే ఉత్పత్తుల్లో ధరల హెచ్చుతగ్గులు ఎక్కువగా ఉంటాయి. క్రిసిల్ తాజా రోటీ రైస్ రేట్ నివేదిక ప్రకారం 2026 జూలైలో ఇంట్లోతయారు చేసే శాఖాహార భోజనం ఖర్చు ఏడాది ప్రాతిపదికన 4 శాతం, మాంసాహార భోజనం ఖర్చు 9శాతం పెరిగింది. ఉల్లి, వంటనూనె, ఎల్పీజీ ధరలు దీనికి ప్రధాన కారణాలుగా పేర్కొంది. ఉల్లిధర ఏడాది కాలంలో 20శాతం పెరిగినట్లు కూడా నివేదిక తెలిపింది. ఇక జూలై 2026లో దేశ రిటైల్ ద్రవ్యోల్బణం 4.45 శాతానికి, ఆహార ద్రవ్యోల్బణం 5.52 శాతానికి పెరిగింది. మొత్తంగా రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్బీఐ లక్ష్యమైన 4శాతాన్ని వరుసగా రెండో నెల అధిగమించింది. ధరలు పెరిగిన ప్రతిసారీ ప్రభుత్వాలు వాతావరణ పరిస్థితులను, ఉత్పత్తి తగ్గుదలను కారణాలుగా చూపడం సహజమే. అవి వాస్తవ కారణాలే అయినా వినియోగదారుడికి మాత్రం కారణం కంటే ఉపశమనం ముఖ్యం. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు ధరల పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. రైతుకు గిట్టుబాటు ధర లభించేలా చూడడంతో పాటు వినియోగదారుడిపై అనవసర భారాన్ని పడకుండా సరఫరా గొలుసులోని లోపాలను సరిదిద్దాలి. నిల్వ సదుపాయాలుపెంచడం, పంటల ముందస్తు అంచనాలు రూపొందించడం, అవసరమైన చోట బఫర్ స్టాక్‌లను విడుదల చేయడం, అక్రమ నిల్వలు కృత్రిమ కొరతపై కఠిన చర్యలు తీసుకోవడం, రైతు నుంచి వినియోగదారుడి వరకు మధ్యవర్తిత్వ వ్యయాన్ని తగ్గించడం వంటి చర్యలు అత్యవసరం. ఉల్లి ధరల పెరుగుదలను అరికట్టేందుకు బఫర్ స్టాక్‌ను వినియోగించి ప్రత్యేక రవాణా చర్యలు చేపట్టడం వంటి నిర్ణయాలు కూడా ప్రభుత్వం తీసుకుంది. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగితే దాని ప్రభావం కేవలం వంటింటితో ఆగదు. ఆహారం, విద్య, వైద్యం, రవాణా, ఇల్లు వంటి ప్రతి అవసరంపై కుటుంబాల ఖర్చు పెరుగుతుంది. ఆదాయం పరిమితంగా ఉన్న పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలు పొదుపును తగ్గించుకోవాల్సి వస్తుంది. చివరకు అప్పులపై ఆధారపడే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉంది. మధ్యతరగతి కుటుంబాలకూ నెలవారీ బడ్జెట్‌లో అత్యవసర ఖర్చుల వాటా పెరుగుతుంది. అందువల్ల ధరల పెరుగుదలను కేవలం గణాంకాలుగా కాకుండా ప్రజల జీవన వ్యయంగా ప్రభుత్వాలు చూడాలి. మార్కెట్‌లో సరఫరా డిమాండ్ సమతుల్యత దెబ్బతినకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి. రైతు ఉత్పత్తికి సరైన మార్కెట్ కల్పిస్తూనే వినియోగదారుడికి అందుబాటు ధరలో వస్తువులు లభించేలా విధానాలను రూపొందించాలి. రైతు, వ్యాపారి, వినియోగదారుడు ఈ మూడు వర్గాల ప్రయోజనాల మధ్య సమతుల్యతే స్థిరమైన పరిష్కారం. ధరల మంటను ఆర్పడం ఒక్కరోజులో సాధ్యమయ్యే పని కాదు. కానీ సమర్థవంతమైన పర్యవేక్షణ, సరఫరా నిర్వహణ, నిల్వల నియంత్రణ, రైతుకు ప్రోత్సాహం, వినియోగదారుడికి రక్షణ వంటి చర్యలను సమన్వయంతో అమలు చేస్తే ధరల ఒత్తిడిని గణనీయంగా తగ్గించవచ్చు. వంటింటి పొయ్యిమీద మంట ఆహారాన్నివండాలి. కుటుంబాల ఆర్థిక భవిష్యత్తును కాల్చకూడదు. నిత్యావసరాల ధరలు సామాన్యుడి అందుబాటుకు దూరమైతే అభివృద్ధి గణాంకాలన్నీ అర్థరహితమే. అందుకే ప్రభుత్వాలు ధరల నియంత్రణను తాత్కాలిక చర్యగా కాకుండా నిరంతర ప్రజా విధానంగా చేపట్టాలి. పేదవాడి పళ్లెంలో అన్నం, మధ్యతరగతి ఇంట్లో ప్రశాంతత ఉండేలా అందుబాటు ధర- అందరికీ ఆహారం అనే లక్ష్యంతో పాలన సాగినప్పుడే సంక్షేమ రాజ్యానికి నిజమైన అర్థంచేకూరుతుంది. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# గూడు లేదు.. నిలువ నీడలేదు!



## సర్వం కోల్పోయామంటూ నేపాల్ బాధితుల ఆవేదన

## ఇంతటి విధ్వంసం ఎప్పుడూ చూడలేదంటున్న సహాయక బృందాలు

## చైనా నుంచి వస్తున్న ప్రవాహాలతో మరింతగా పెరుగుతున్న నీటిమట్టాలు

**నువాకోట్ (నేపాల్), ఆగస్టు 28:** నేపాల్‌లో సంభవించిన భారీ ఆకస్మిక వరదల కారణంగా ఇప్పటివరకు 538 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 1477 మంది ఆచూకీ తెలియకుండా పోయింది. ఈ నేపథ్యంలో, 'అన్నీ ఒక్కసారిగా కొట్టుకుపోయాయి' అని ఆ హిమాలయ దేశ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. నిలువ నీడ లేదు. తిన డానికి తిండి లేదు. కట్టుబట్టలతో బయటపడ్డాం అని వరద బాధితులు వాపోతున్నారు. ప్రభుత్వం సహాయం అందడం లేదు, మళ్లీ వరద అంటున్నారు. ఏం చేయాలో, ఎక్కడికి పోవాలో తెలియడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నువాకోట్‌లో సహాయక చర్యల్లో పాల్గొంటున్న ఒక స్వచ్ఛంద కార్యకర్త మీడియాతో మాట్లాడుతూ, 'బాధితులకు ఆహారం, తాగునీరు, రాత్రి పూట బస వంటి తక్షణ అవసరాలను అంచనా వేయడానికి తాము కాఠ్మండు నుండి ఇప్పుడే చేరుకున్నాము. ఈ విపత్తు ఎలా జరిగిందో నాకు తెలియదు. అన్నీ ఒక్కసారిగా కొట్టుకుపోయాయి. ఆకస్మిక వరదల గురించి ప్రజలకు ఎటువంటి ముందస్తు హెచ్చరిక అందలేదు' అని ఆయన పేర్కొన్నారు. 'ప్రజలు ఇంతటి భారీ వరద ఉధృతిని అస్సలు ఊహించలేదు. ఇక్కడి ప్రధాన రహదారి, ఇక్కడి నుండి 30-35 కిలోమీటర్ల మేర ఉన్న ప్రాంతం అంతా కొట్టుకుపోయింది' అని ఆయన చెప్పారు.

రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ ఎంపీ ధనేంద్ర కార్కీ మాట్లాడుతూ 'కేవలం నా నియోజకవర్గమైన సింధులి నుండే సుమారు 50 నుండి 60 మంది వరకు ఇప్పటికీ కనిపించకుండా పోయారు. వారి ఆచూకీని తాము ఇంకా కనుగొనలేకపోయాము. ఇప్పుడు మళ్లీ ఆనకట్ట (డ్యామ్) తెగిపోయిందని మాకు సమాచారం అందింది. అయినప్పటికీ, నా ప్రాంతానికి చెందిన వారిని ఎవరినైనా గుర్తించగలనేమోనని తాను ముందుకు వెళ్లి చూస్తాను. వారి కోసం వెతకడానికే నేను ఇక్కడికి వచ్చాను' అని అన్నారు. ప్రస్తుతం సహాయక చర్యల్లో నేపాల్ ప్రభుత్వం 20-22 హెలికాప్టర్లను ఉపయోగిస్తోందని ఆయన తెలిపారు. ' మరణించిన వారిని ఇంకా గుర్తించలేకపోయాము. వాస్తవానికి, కైలాష్ మానసరోవర్‌కు ఎంతమంది యాత్రికులు వెళ్తున్నారు. వారిలో ఎంతమంది ప్రాణాలు కోల్పోయారో అనే దానిపై ఇప్పటివరకు ఎటువంటి స్పష్టత లేదు' అని చెప్పారు. వరదలతో అతలాకుతలమైన తమ దేశానికి సకాలంలో సహాయం అందించినందుకు నేపాల్ ఎంపీ ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. 'ప్రధాని మోడీ అపారమైన సహాయం అందించారు. ఈసంక్షోభ సమయంలో నేపాల్‌కు అండగా నిలిచిన భారత ప్రభుత్వానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని ఆయన అన్నారు.

నేపాల్ మాజీ ఆర్థిక మంత్రి బర్షమాన్ పున్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 'అవును, ఒకనిజమైన పొరుగు దేశంగా, ప్రధాన మంత్రి మోడీ నుండి వచ్చిన తక్షణ మద్దతు సందేశం. భారత ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని తాము ఎంతగానో అభినంది స్తున్నాము. నేపాల్ ప్రజల తరపున మా రాజకీయ పార్టీల తరపున, మా హృదయపూర్వక కృతజ్ఞత లు, ధన్యవాదాలు తెలియజేస్తున్నాను' అని తెలిపారు. వరద బాధితులకు సహాయం అందిస్తున్న కోరస్ ఇంటర్నేషనల్ సంస్థ ముఖ్య మానవతా అధికారి తమరా డెమురియా మాట్లాడుతూ, 'తీవ్రమైన విధ్వంసం చూసి మేము చాలా ఆందోళన చెందుతున్నాము. నష్టం ఎంత జరిగిందో చూడటానికి నదీ గర్భం వెంబడి ఉత్తరం వైపు వెళ్ళాను. తాను స్వయంగా తీయగలిగిన దృశ్యాలు చాలా ఆందోళనకరంగా ఉన్నాయి, ఎందుకంటే కొట్టుకుపోయిన ఇళ్లు, నీటిలో పూర్తిగా మునిగిపోయిన సోలార్ ప్యానెళ్లు, ఎన్నో జీవనోపాధులు కోల్పోయారు. ఇది త్వరలో శాంతించే లేదా సాధారణ స్థితికి వచ్చే సూచనలు ఏమాత్రం కనిపించడం లేదు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇదిలా ఉండగా, సరిహద్దుకు టిబెట్ వైపున ఉన్న గిరాంగ్ సరిహద్దు పోర్టుకు ఎగువన ఉన్న ఒక కట్ట తెగిపోయిందని, మరిన్ని వరదల ముప్పు మళ్లీ తలెత్తిన నేపథ్యంలో సహాయక బృందాలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని భద్రతా దళాలు హెచ్చరించారు. నేపాల్ పోలీస్ అధికారి పి. చౌదరి మాట్లాడుతూ, 'ఎగువన ఉన్న చైనా సరిహద్దు నుంచి వస్తున్న నీటిమట్టాలు వేగంగా పెరుగుతున్నాయని మాకు హెచ్చరికలు అందాయి. అందువల్ల, ప్రతి ఒక్కరూ సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లి తమ ప్రాణాలను కాపాడుకోవాలని సాధారణ హెచ్చరిక జారీ చేశాం. ఈ నేపథ్యంలో సహాయక చర్యలు తాత్కాలికంగా నిలిపివేశాం' అని వివరించారు.



# మంటగలిసిన మానవత్వం

## వరదల్లో ఓ మృతురాలిని బయటకు లాగి చెవి కమ్మలు కాజేసిన వైనం

## నదుల్లో కొట్టుకు వస్తున్న మృతదేహాలు

**కాట్మాండు, ఆగస్టు 28:** నేపాల్ ఆకస్మిక వరదలో ప్రాణాలు కోల్పోయిన వారి గురించిన సమాచారం అందరి గుండెనూ బరువెక్కేలా చేస్తోంది. నేపాల్‌లో వరద బాధితులు కోలుకోవాలని, వీలైనంత మంది ప్రాణాలతో బయటపడాలని అందరూ కోరుకుంటున్నారు. ఇలాంటి విషాద సమయంలో మానవత్వం చూపాల్సిన కొందరు.. ఆ మానవత్వానికి మచ్చగా నిలిచారు. వరదల్లో మరణించిన ఒక మహిళ మృతదేహాన్ని జుట్టుతో లాగి, ఆమె చెవి కమ్మలు తీసుకున్నారు. ఇద్దరు వ్యక్తులు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఈ ఘటన నేపాల్‌లోని నారాయణి నది ప్రాంతంలో జరిగింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో పోలీసులు స్పందించారు. నిందితులు ఇద్దరినీ అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. బుధవారం నేపాల్‌లో సంభవించిన వరదల్లో పలువురు గల్లంతైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా అనేక మృతదేహాలు ఇతర ప్రాంతాలకూ కొట్టుకుపోయాయి. తాజాగా నారాయణి నదలోకి పలు మృతదేహాలు కొట్టుకువచ్చాయి. వాటిలో ఒక మహిళ మృతదేహం కూడా ఉంది. అయితే, స్థానికుల్లో 25 యేళ్ల మదన్ గురుంగ్, 38 యేళ్ల ఉమేశ్ చౌదరి అనే ఇద్దరు వ్యక్తులు ఆ మహిళ మృతదేహాన్ని నీళ్ల నుంచి ఒడ్డుకులాగారు. అనంతరం ఆమె చెవులకు ఉన్న బంగారు కమ్మలు తీసుకున్నారు. ఈ ఘటనను అక్కడి వారెవరో రికార్డు చేసి, సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా వైరల్ అయింది. ఈ ఘటనపై నెటిజన్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ విషాద సమయంలో మృతదేహాల విషయంలో సానుభూతి, గౌరవప్రదమైన వైఖరి ప్రదర్శించాల్సింది పోయి అవకాశవాదుల్లాగా, వారి ఒంటిపై బంగారు ఆభరణాల్ని కొట్టేయడం, జుట్టుపట్టి మృతదేహాల్ని లాగడంపై విమర్శలు చేస్తున్నారు. ఇలాంటి సమయంలో ఇదేనా మానవత్వం అంటూ ప్రశ్నిస్తున్నారు. దీంతో ఈ ఘటనపై స్థానిక చిట్వాన్ పోలీసులు స్పందించారు. నిందితులు మదన్, ఉమేశ్‌లను పోఖారా బస్‌పార్క్ వద్ద అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఆభరణాలు స్వాధీం చేసుకున్నారు. ఇలా మృతదేహాలపై నగలు తీసుకోవడ లేదా ఎలాంటి అమానవీయ చర్యలకు పాల్పడ్డా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.



## చైనాలో ఘోర విపత్తుగా మిగిలిన బాంకియావో డ్యామ్

**బీజింగ్, ఆగస్టు 28:** నేపాల్‌లో సంభవించిన తాజ వరదల నేపథ్యంలో, ప్రకృతి ప్రకోపానికి మానవ నిర్మిత కట్టడాలు చిక్కితే జరిగే విధ్వంసానికి చైనాలోని బాంకియావో డ్యామ్ ఉదంతమే ఒక ప్రబల నిదర్శనం. ప్రపంచ చరిత్రలోనే అత్యంత దారుణమైన డ్యామ్ వైఫల్యంగా ఇది మిగిలిపోయింది. ఈ ఘోర విపత్తులో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2.30లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. 1975 ఆగస్టులో వచ్చిన నీనా టైఫూన్ ప్రభావంతో చైనాలోని హెనాన్ ప్రావిన్స్‌లో రికార్డు స్థాయి వర్షాలు కురిశాయి. కేవలం 24గంటల వ్యవధిలోనే 1,000 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో బాంకియావో డ్యామ్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఆగస్టు 7వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత డ్యామ్ పైనుంచి నీరు పొంగిపొర్లి, కేవలం ఆరు గంటల వ్యవధిలోనే అది కుప్పకూలిపోయింది. దీని ఫలితంగా సుమారు 701 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో జనావాసాలపై విరుచుకుపడింది. ఈ ఉద్ధృతికి సమీపంలోని సిమన్‌తాన్ డ్యామ్‌తో పాటు మొత్తం 62 ఆనకట్టలు ఒకదాని తర్వాత ఒకటి పేకమేడల్లా కూలిపోయాయి. ఈ జల ప్రళయానికి తక్షణమే సుమారు 26 వేల మంది బలవ్వగా, అనంతరం ఏర్పడిన కరవు, అంటు వ్యాధుల కారణంగా మొత్తం మృతుల సంఖ్య 2.30 లక్షలకు చేరిందని అంతర్జాతీయ నివేదికలు అంచనా వేశాయి.

అయితే, చైనా ప్రభుత్వం ఈ మహా విషాదం తాలూకు వివరాలను దాదాపు రెండు దశాబ్దాల పాటు ప్రపంచానికి తెలియ కుండా అత్యంత గోప్యంగా ఉంచింది. 1951-52 మధ్య కాలంలో నిర్మించిన ఈ డ్యామ్‌ను ఒకప్పుడు ఐరన్ డ్యామ్ అని పిలిచేవారు. కానీ నిర్మాణ లోపాలు, అధికారుల వైఫల్యాలు, సరైన సమయంలో హెచ్చరికలు జారీ చేయకపోవడం వంటివి ఈ ఘోర విషాదానికి ప్రధాన కారణాలని విశ్లేషణలు వెల్లడించాయి. ఈ ఘటన జరిగిన సుదీర్ఘ కాలం తర్వాత, పాత డ్యామ్ స్థానంలో 1993లో నూతన ఆనకట్టను నిర్మించారు.

## విదేశీ సాయం వద్దేవద్దు..నేపాల్ తిరస్కరణ

**ఖాట్మండు, ఆగస్టు 28:** భారీ వరదలతో అతలాకుతలమైన నేపాల్ కీలక నిర్ణయం తీసుకుంది. గల్లంతైనవారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యల్లో విదేశీ రెస్క్యూ బృందాల సాయం తీసుకోకూడదని నిర్ణయించింది. తమ భద్రతా బలగాలే సహాయక చర్యలు చేపట్టగలవని స్పష్టం చేసింది. భారత్, చైనా సహా పలు దేశాలు పంపిన సహాయ ప్రతిపాదనలను తిరస్కరించింది. బుధవారం భోటేకోషి, త్రిశూలి నదీ వ్యవస్థల పరిధిలో భారీ వరదలు సంభవించిన విషయం తెలిసిందే. నేపాల్‌చైనా సరిహద్దు ప్రాంతాల్లో మట్టి, శిథిలాల కింద చిక్కుకున్నవారి కోసం గాలింపు కొనసాగుతోంది. ఈ విపత్తులో ఇప్పటివరకు 469మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు వెయ్యి మంది గల్లంతైనట్లు అధికారులు చెబుతున్నారు. భారత్, చైనా, అమెరికా, బ్రిటన్, జపాన్, దక్షిణ కొరియా, శ్రీలంక, బంగ్లాదేశ్ సహా పలు దేశాలు రెస్క్యూ సిబ్బందిని పంపేందుకు ముందు కొచ్చాయి. వందలాది మంది భారతీయులు గల్లంతైన నేపథ్యంలో భారత్ జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్)ను పంపేందుకు అనుమతి కోరింది. నేపాల్ ఆ ప్రతిపాదనను కూడా తిరస్కరించింది. 2015 భూకంపం సమయంలో పెద్ద సంఖ్యలో విదేశీ రెస్క్యూ బృందాలు రావడంతో సమన్వయం, నిర్వహణలో ఇబ్బందులు ఎదురైన అనుభవం ఈ నిర్ణయానికి కారణమని అధికారులు తెలిపారు. ప్రస్తుతం విదేశీ బృందాల బదులు ఆర్థిక సాయాన్ని ఒకే వ్యవస్థ ద్వారా అందించాలని నేపాల్ కోరుతోంది. నేపాల్ పోలీసులు 4,348 మందిని సహాయక చర్యల్లో మోహరించారు. రసువా నుంచి 644 మంది, నువాకోట్ నుంచి 898 మంది, ధాదింగ్ నుంచి ముగ్గురిని రక్షించారు. గల్లంతైన వారిలో విదేశీయులు కూడా ఉన్నారు. 178 మంది భారతీయులు, 65 మంది అమెరికన్లు, 51 మంది మలేషి యన్లు, 53 మంది ఉక్రెయిన్ వాసులు, 33 మంది బ్రిటన్ పౌరులు, 35 మంది ఆస్ట్రేలియన్లు, 25 మంది కెనడా పౌరుల ఆచూకీ తెలియడం లేదు. అయితే ఆర్థిక, మానవతా సాయాన్ని నేపాల్ స్వీకరిస్తోంది. అమెరికా 5 లక్షల డాలర్ల సాయం ప్రకటించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ అత్యవసర వైద్య సామగ్రిని పంపింది. విదేశీ పౌరుల సమాచారం, సహాయక చర్యల కోసం నేపాల్ విదేశాంగ శాఖ అత్యవసర నియంత్రణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది.



## భారత్‌కు రానున్న 'జావెలిన్'



### భుజంపై నుంచే శత్రువుకు గురి

**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** భారత అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరనుంది. అధునాతన జావెలిన్ క్షిపణులను కొనుగోలు చేసేందుకు అమెరికాతో భారత్‌కు ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని మన దేశంలోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ శుక్రవారం వెల్లడించారు. ఇరు దేశాల మధ్య సమర్థవంతమైన ద్వైపాక్షిక రక్షణ భాగస్వామ్యాన్ని ఈ ఒప్పందం ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. యుఎస్ ఫారిన్ మిలిటరీ సేల్స్ ప్రక్రియలో భాగంగా ఈ క్షిపణుల కొనుగోలుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఆఫర్ అండ్ యాక్సెప్టెన్స్‌పై భారత సైన్యం తాజాగా సంతకం చేసింది. అయితే, ఒప్పందంలో భాగంగా ఎన్ని క్షిపణులను మన దేశం కొనుగోలు చేస్తోంది? మొత్తం ఖర్చెంత? అన్న వివరాలు ఇంకా తెలియరాలేదు.

**జావెలిన్** ట్యాంక్ విధ్వంసకర క్షిపణి (ఎటిజిఎం-యాంటీ ట్యాంక్ గైడెడ్ మిసైల్). దీనిని భుజంపై నుంచి శత్రు ట్యాంకుల పైకి గురిపెట్టి ప్రయోగించవచ్చు. దీనిలో 3.7 అడుగుల క్షిపణి, డిస్పోజబుల్ లాంఛ్ ట్యూబ్, కమాండ్ కంట్రోల్ యూనిట్ ఉంటాయి. వాస్తవానికి ట్యాంక్‌పైకి విధ్వంసకర ఆయుధాలను ప్రయోగించినప్పుడు ఆ ప్రదేశం నుంచి పొగ, వేడి వెలువడతాయి. ప్రత్యర్థులు హీట్ సెన్సర్లతో వాటిని గుర్తిస్తారు. కానీ, జావెలిన్‌లో తొలుత ట్యూబ్ నుంచి ఓ మోటార్ పనిచేయడం మొదలుపెట్టి లక్ష్యం వైపు దూసుకెళుతుంది. దీనిని కంప్యూటర్‌తో నియంత్రిస్తారు. దీంతో కచ్చితంగా జావెలిన్‌ను ఎక్కడి నుంచి ప్రయోగించారో శత్రువుకు అర్థం కాదు. ఈలోపు ప్రయోగించిన వారు సురక్షిత ప్రదేశంలో దాక్కోవచ్చు. ట్యాంకును ధ్వంసం చేసేలా దీనిలో రెండు దశల్లో పేలుడు పదార్థాలను అమర్చారు. తొలిదశలో కవచాన్ని ఛేదించి ఆ తర్వాత దశలో వార్‌హెడ్ ట్యాంకును ధ్వంసం చేస్తుంది.



## భారత్‌కు రానున్న నేపాల్ ప్రధాని బాలేన్‌షా

**ఖాట్మండు, ఆగస్టు 28:** నేపాల్ ప్రధాని బాలెన్ షా తొలి విదేశీ పర్యటన భారత్‌లోనే ఉండనుంది. ఈ ఏడాది చివర్లోగా భారత్‌కు వచ్చే అవకాశం ఉందని నేపాల్ ఆర్థిక మంత్రి స్వర్ణిమ్ వాగ్లే తెలిపారు. కాఠ్‌మాండులో జరిగిన ఎన్డీటీవీ అన్విక్షా సదస్సులో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. బాలెన్ షా బాధ్యతలు చేపట్టిన తొలి 100 రోజులు దేశీయ అంశాలపైనే దృష్టి పెట్టారని వాగ్లే చెప్పారు. ప్రభుత్వం రూపొందించిన 100 అంశాల కార్యాచరణలో 87.2 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు. ఇప్పుడు విదేశీ పర్యటనలపై చర్చ మొదలైందన్నారు. తొలి పర్యటన భారత్‌కే ఉంటుందని స్పష్టం చేశారు. బాలెన్ షా భారత పర్యటన ప్రకటన ప్రాధాన్యం కలిగినదని బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ అన్నారు. భారత్ నేపాల్ సంబంధాలు ఎంతో బలమైనవని చెప్పారు. సరిహద్దులు, పాస్‌పోర్టులు ఈ బంధాన్ని విడదీయలేవని పేర్కొన్నారు. భారత రూపాయితో నేపాల్ రూపాయి మారకం విలువ 1.6:1గా ఉంది. ఈ అనుసంధానాన్ని వెంటనే మార్చే ఆలోచన లేదని వాగ్లే తెలిపారు. దీనిపై అధ్యయనం మాత్రమే చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం నేపాల్ వాణిజ్యంలో 70 శాతం భారత్‌తోనే జరుగుతోందని వెల్లడించారు. నేపాల్ ఆర్థిక వ్యవస్థను వచ్చే ఐదేళ్ల నుంచి ఏడేళ్లలో 100 బిలియన్ డాలర్లకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు కనీసం 7 శాతం వృద్ధి అవసరమని వాగ్లే చెప్పారు. స్వచ్ఛ ఇంధనం, పర్యాటకం, తయారీ, అధిక విలువైన వ్యవసాయం, డిజిటలైజేషన్‌పై దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. బాలెన్ షా సంప్రదాయ రాజకీయ నేతలకు భిన్నంగా పనిచేస్తున్నారని వాగ్లే అన్నారు. ప్రసంగాల కంటే పనులు, ఫలితాలకే ప్రాధాన్యం ఇస్తారని చెప్పారు. నిర్ణయాల విషయంలో చట్టపరమైన అంశాలను కూడా జాగ్రత్తగా పరిశీలిస్తారని తెలిపారు.

## టిబెట్ సరస్సు ముప్పుపై మరోసారి హెచ్చరించిన చైనా..



**ఖాట్మండు, ఆగస్టు 28:** భారీ వరదలతో అతలాకుతలమైన నేపాల్‌ను మరో ముప్పు ఆందోళనకు గురిచేస్తోంది. నేపాల్‌టిబెట్ సరిహద్దులోని భోటే కోశి నది జన్మస్థానం వద్ద నూతనంగా ఒక భారీ సరస్సు ఏర్పడిందని, దీనివల్ల రాబోయే రెండు మూడు రోజుల్లో తీవ్రస్థాయిలో వరదలు సంభవించే ప్రమాదం ఉందని చైనా అధికారులు హెచ్చరించారు. ఈ సమాచారంతో నేపాల్ ప్రభుత్వం అప్రమత్తమైంది. టిబెట్‌లో జన్మించే చోచెన్ ఖోలా, పురేపు సంగ్పో నదుల సంగమ ప్రాంతంలో ఈ కొత్త సరస్సు ఆవిర్భవించింది. నిన్నటి ఉదయం సమయానికే ఇందులో సుమారు 20 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు చేరిందని, రాబోయే మూడు రోజుల్లో మరో 30 లక్షల క్యూబిక్ మీటర్ల నీరు వచ్చి చేరే అవకాశం ఉందని చైనా వెల్లడించింది. దీనివల్ల సరస్సు కట్ట తెగిపోయి దిగువ ప్రాంతాలు జలమయమయ్యే ప్రమాదం ఉందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం అక్కడి పరిస్థితిని చైనా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ సమాచారాన్ని చైనా ప్రభుత్వం నేపాల్ విదేశాంగ శాఖకు అధికారికంగా తెలియజేసింది. దీంతో నేపాల్ జల, వాతావరణ శాఖ అప్రమత్తమైంది. భోటే కోశి, త్రిశూలి నదులకు మళ్లీ వరద ముప్పు పొంచి ఉన్నందున, ప్రజలు నదీ తీరాలకు దూరంగా, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. సహాయక బృందాలు, ప్రయాణికులు, భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇదిలా ఉండగా ఇటీవల సంభవించిన వరదల కారణంగా నేపాల్‌లో మృతుల సంఖ్య 500 దాటినట్లు నేపాల్ పోలీసులు వెల్లడించారు. ఒక్క చిత్వాన్ జిల్లాలోనే ఇప్పటివరకు 132 మృతదేహాలను వెలికితీసినట్లు సమాచారం.

## చిత్వాన్ జిల్లాలోనే 132 మంది మృతదేహాలు లభ్యం



**ఖాట్మండు, ఆగస్టు 28:** నేపాల్ వరదల్లో వందల మంది చనిపోయారు. వారి మృతదేహాలను సహాయక సిబ్బంది వెలికితీస్తున్నారు. భారతదేశంతో సరిహద్దు పంచుకునే నేపాల్‌లోని చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 132 మృతదేహాలు లభ్యమయ్యాయి. భారత్‌లోని ఉత్తరప్రదేశ్‌లోని మహరాజ్‌గంజ్ వద్ద గండక్ నదిలో మూడు మృతదేహాలను వెలికితీశారు. భారత సరిహద్దు భద్రతా దళం సశస్త్ర సీమా బల్ వీటిని గుర్తించి మోటార్ బోట్ల సహాయంతో వెలికితీశారు. ఈ మృతదేహాల్లో ఇద్దరు మహిళలు, ఒక పురుషుడివి ఉన్నాయని ఎస్ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ అరుణ్ పాండే తెలిపారు. వారి వివరాలు ఇంకా తెలియలేదు. ఇవి అక్కడి మృతదేహాలే అయితే సుమారు 200 కిలోమీటర్ల దూరం కొట్టుకొచ్చాయని భావిస్తున్నారు.నేపాల్‌లో హిమపాతం, భారీ వర్షాల వల్ల నారాయణి నది ఉప్పొంగి ప్రవహిస్తుంది. అక్కడి భోటెకోశి, త్రిశూలి నదులు కలిసి నారాయణి నదిగా మారుతాయి. దీన్నే కాళీ గండకీ అని కూడా పిలుస్తారు. ఈ నది భారత్‌లోకి ప్రవహిస్తుంది. దీన్ని ఇక్కడ గండక్ అని పిలుస్తారు. ఇది భారత్‌లోని ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల గుండా ప్రవహించి పట్నా సమీపంలోని హాజీపూర్‌సోనేపూర్ వద్ద గంగా నదిలో కలుస్తుంది. నేపాల్ వరదల కారణంగా ఉత్త రప్రదేశ్, బిహార్ రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. గండక్ నది పరీవాహక ప్రాంతాల్లోని పలు లోతట్టు గ్రామాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలిస్తున్నారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

## అసోం వరద బాధితులకు శతాధిక వృద్ధురాలి ఆపన్న హస్తం




**గువాహతి,ఆగస్టు 28:** అసోంలో 10 జిల్లాల్లో వరద ఉధృతి కొనసాగుతుండటంతో, మృతుల సంఖ్య 107కు చేరింది. ఈ సంక్షోభం కారణంగా నదులు ప్రమాద స్థాయి దాటి ప్రవహిస్తుండగా, వేలాది మంది ప్రజలు సహాయక శిబిరాలకు తరలించబడగా సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. అస్సాం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ నివేదికల ప్రకారం, 10 జిల్లాల్లో 1.37 లక్షల మందికి పైగా ప్రజలు వరదల బారిన పడ్డారు. వీరిలో ఒక్కో కుటుంబానికి రూ. 15,000 చొప్పున ఆర్థిక సహాయం అందించేందుకు దాదాపు 97,000 కుటుంబాలను గుర్తించారు. లబ్ధిదారుల జాబితా తయారీ ఇంకా కొనసాగుతోందని, తదుపరి దశలో మరో 3,000 కుటుంబాలకు ఈ సహాయం అందే అవకాశం ఉందని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తెలిపారు. ఇది కాకుండా, అరుణోదోయ్ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు రూ.2,500 అందించినట్లు, వరదల తర్వాత ఇళ్లకు తిరిగి వస్తున్న కుటుంబాలకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం ప్రత్యక్ష ఆర్థిక సహాయాన్ని ఉపయోగిస్తోందని ఆయన పేర్కొన్నారు.

వరద బాధితులకు శతాధిక వృద్ధురాలి చేయూత: అస్సాం వరద బాధితుల సహాయార్థం సామాన్య పౌరులు సహా పలువురు ప్రముఖులు, సంస్థలు మరియు ప్రభుత్వాలు ఆర్థిక చేయూతను అందించాయి. అస్సాంలో ఇటీవల సంభవించిన వరదల కారణంగా తీవ్రంగా వరద ప్రభావితమైన శివసాగర్ జిల్లాలోని అమ్గురి గార్డెన్ ప్రాంత నివాసితులు కష్టాల గురించి తెలుసుకుని సోనిత్‌పూర్ జిల్లా మజ్రోయిమరి గ్రామంలో నివసించే శతాధిక వృద్ధురాలు, 103 ఏళ్ల కనకలత దాస్ మనసు ద్రవించిపోయింది. ఆమె తన వయస్సును కూడా లెక్కచేయకుండా 264 కిలోమీటర్ల దూరం ప్రయాణించి శివసాగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని ఆమె ప్రదర్శించిన ఉదారత రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది హృదయాలను తాకింది. ఆమె నేరుగా శివసాగర్ జిల్లా కమిషనర్ కార్యాలయానికి వెళ్లి, 77 వరద బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2,000 చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అయితే ఎన్నో ఏళ్లుగా తాను పొదుపు చేసుకున్న సొమ్ము నుండి ఆమె ఈ విరాళాన్ని అందించడం అందరినీ ఆలోచింపచేసింది.

# సంక్షిప్త వార్తలు

## నార్వే రాజు హెరాల్డ్ వి కన్నుమూత



**ఓస్లో, ఆగస్టు 28:** నార్వే దేశ రాజు హరాల్డ్ కన్నుమూశారు. ఆయన వయసు 89 యేళ్లు. అయిదో హెరాల్డ్ చక్రవర్తి కన్నుమూసినట్లు రాయల్ ప్యాలెస్ శుక్రవారం ప్రకటన చేసింది. నార్వే రాజధాని ఓస్లోలో ఆయన శాంతియుతంగా ప్రాణాలు విడిచినట్లు ప్యాలెస్ తన ప్రకటనలో పేర్కొన్నది. రక్త సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కింగ్ హారాల్డ్‌ను ఆగస్టు 17వ తేదీన ఆస్పత్రిలో చేర్పించారు. అయితే చికిత్స సమయంలో ఆయన ఆరోగ్యం మరింత క్షీణించింది. ఆయన ఆరోగ్యం చాలా సీరియస్‌గా ఉన్నట్లు తెలిపారు. అయితే నార్వే కిరీటాన్ని ఇప్పుడు హరాల్డ్ కుమారుడిని వరించనున్నది. 53 ఏళ్ల హాకన్ 8 నార్వే రాజుగా బాధ్యతలు చేపడుతారు.

## ఆర్ఎస్ఎస్ చీఫ్ పర్యటన నేపథ్యంలో ఎక్స్ ఖాతా నిలిపివేత



**న్యూయార్కు, ఆగస్టు 28:** ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ న్యూయార్క్ పర్యటనవేళ కీలక పరిణామంచోటుచేసుకుంది. న్యూయార్క్‌లో మోహన్ భగవత్ పాల్గొననున్న కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు, విమర్శలు కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలో ఈ కార్యక్రమ నిర్వాహక సంస్థ అమెరికన్ హిందూస్ ఫర్ ఎంగేజ్‌మెంట్ అండ్ డైలాగ్ ఫోరమ్‌కు చెందిన ఎక్స్ ఖాతాను సోషల్ మీడియా వేదిక సస్పెండ్ చేసింది. ప్రస్తుతం ఆ ఖాతా యూజర్లకు ఖాళీగా కనిపిస్తోంది.

## కంగనా రామ్‌దేవ్ వివాదానికి ఫుల్‌స్టాప్




**న్యూఢిల్లీ,ఆగస్టు 28:** బీజేపీ ఎంపీ కంగనా రనౌత్, యోగా గురువు రామ్ దేవ్ బాబా తమ మధ్య వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టేశారు. రాక్షా బంధన్ పండుగను పురస్కరించుకుని ఇద్దరూ రాజీపడ్డారు. వివాదాలకంటే చర్చలే బెటరని తీర్మానించారు. జెన్ జీని విమర్శిస్తూ కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలపై రామ్ దేవ్ బాబా విమర్శలతో ఇరువురి మధ్య వివాదం మొదలైన విషయం తెలిసిందే.బాబా రామ్‌దేవ్ విమర్శలపై ఎంపీ కంగన పలు ఇంటర్వ్యూల్లో ఘాటువ్యాఖ్యలు చేయడంతో వివాదంముదిరింది. ఈ నేపథ్యంలో శుక్రవారం మీడియాతో రామ్‌దేవ్‌బాబా మాట్లాడుతూ భారత్‌లో ద్వేషానికి, శత్రుత్వానికి స్థానంలేదని అన్నారు.

## ఒంటారియో లేక్‌ను లేక్ అమెరికాగా పేరు మార్చిన ట్రంప్



**వాషింగ్టన్,ఆగస్టు 28:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. అమెరికా, కెనడా సరిహద్దుల్లో ఉన్న గ్రేట్ లేక్స్‌లో ఒకటైన లేక్‌ఒంటారియో పేరును లేక్ అమెరికాగా మారుస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వులపై సంతకం చేశారు. అమెరికా ఆర్థికవ్యవస్థకు ఈసరస్సు అత్యంత కీలకమని, దాని ప్రాధాన్యతను గుర్తించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. 30రోజుల్లోగా ఈ పేరు మార్పు ప్రక్రియను పూర్తి చే యాలని అమెరికా అంతర్గత వ్యవహారాలకార్యదర్శిని, భౌగోళిక నామకరణాల బోర్డును ఆదేశించారు.

## ఉక్రెయిన్‌కు బ్రిటన్ సాయంపై రష్యా ఆగ్రహం



**మాస్కో, ఆగస్టు 28:** ఉక్రెయిన్‌కు బ్రిటన్ అందిస్తున్న సైనిక సాయం మరింత పెరగడంపై రష్యా తీవ్రంగా స్పందించింది. బ్రిటన్, ఫ్రాన్స్ తీరు ప్రమాదకరంగా మారుతోందని హెచ్చరించింది. తమ దేశానికి చెందిన స్టార్మ్ షాడో క్షిపణులను ఉక్రెయిన్‌లోనే తయారు చేసుకునేలా బ్రిటన్ సాంకేతిక పరిజ్ఞానం అందించనుంది.ఈ నిర్ణయం యుద్ధాన్ని మరింత తీవ్రం చేసే అవకాశముం దని రష్యా ఆందోళన వ్యక్తంచేసింది. రష్యావిదేశాంగశాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా బ్రిటన్, ఫ్రాన్స్‌పై తీవ్ర వ్యాఖ్యలుచేశారు. రెండుదేశాలు నిప్పుతో చెలగాటం ఆడుతున్నాయని హెచ్చరించారు.

## సోనియా పుస్తకాన్ని మేం ప్రచురించడంలేదు:పెంగ్విన్




**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** కాంగ్రెస్ నేత సోనియా గాంధీ రాయనున్న బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్ పుస్తకంపై పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా కీలక ప్రకటన చేసింది. ఈ పుస్తకానికి భారత్‌లో తాము ప్రచురణకర్తలం కాదని స్పష్టం చేసింది. పెంగ్విన్ ర్యాండమ్ హౌస్ ఇండియా నుంచి పుస్తకం విషయంలో వెనక్కి తగ్గిందని, సోనియా గాంధీ ఎడిటోరియల్ మార్పులకు అంగీకరించకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకుందని ఇటీవల వార్తలు వచ్చాయి. అయితే ఈ ప్రచారంలో వాస్తవం లేదని సంస్థ తెలిపింది. బిలాంగింగ్ పుస్తకాన్ని ప్రచురించేందుకు తాము ఆసక్తిగా ఉన్నామని పెంగ్విన్ వెల్లడించింది.

# పిజి వైద్యులను 24 గంటలకు మించి డ్యూటీ చేయించకూడదు

**• నైట్ డ్యూటీ తర్వాత మరుసటి రోజు సెలవు తప్పనిసరి • వారానికి ఒక రోజు పూర్తి సెలవు ఇవ్వాలి • పూర్వ ఉత్తర్వులను ఖచ్చితంగా అమలు చేయాలి • డిఎంఇ డాక్టర్ విష్ణువర్ధన్ ఆదేశాలు • లేకుంటే ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్లపై చర్యలు**

విజయవాడ, ఆగస్టు 28 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో పిజి వైద్య విద్యార్థుల విధుల నిర్వహణ, డ్యూటీ రోస్టర్లు, సెలవుల విషయంలో ఇప్పటికే అమలులో ఉన్న ఉత్తర్వులను కచ్చితంగా పాటించాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఇ) డాక్టర్ విష్ణువర్ధన్ స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధనాసుపత్రుల సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేశారు. పిజి వైద్య విద్యార్థులతో వరుసగా 24 గంటలకు మించి డ్యూటీ చేయించకూడదని, వారానికి 74 గంటలకు మించి విధులు కేటాయించరాదని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ప్రతి పిజి విద్యార్థికి వారానికి ఒక పూర్తి రోజు సెలవు తప్పనిసరిగా ఇవ్వాలని పేర్కొన్నారు. పిజి వైద్య విద్యార్థుల పని గంటలు, డ్యూటీ రోస్టర్లు, సెలవులు, ఆరోగ్యం, సంక్షేమానికి సంబంధించి పలు మార్గదర్శకాలను జారీ చేశారు. ఇందులో ఎన్ఎంసి మార్గదర్శకాలు, టాస్క్ ఫోర్స్ సిఫార్సుల అమలు, ప్రాధాన్యం గురించి వివరించారు. నైట్ డ్యూటీ తర్వాత మరుసటి రోజు సెలవు రాత్రి డ్యూటీ చేసిన పిజి విద్యార్థికి మరుసటి రోజు తప్పనిసరిగా సెలవు ఇవ్వాలని డిఎంఇ డాక్టర్ విష్ణువర్ధన్ స్పష్టం చేశారు. ఈ వివరాలను డ్యూటీ రోస్టర్‌లో నమోదు చేయాలి. అవసరాన్ని బట్టి 24 గంటలు లేదా 10 గంటల షిఫ్టుల్లో డ్యూటీ రోస్టర్లను రూపొందించవచ్చు. సాధారణ పని దినాల్లో కనీసం 30 నిమిషాల లంచ్ బ్రేక్, నైట్ డ్యూటీలో కనీసం 30 నిమిషాల డిన్నర్ బ్రేక్ ఇవ్వాలి. భోజన విరామ సమయాన్ని డ్యూటీ గంటల్లో కలపకూడదని ఆదేశించారు. పిజిలకు 7-8 గంటల నిద్రకు అవకాశం పిజి వైద్య విద్యార్థుల డ్యూటీ రోస్టర్లను రూపొందించేటప్పుడు ప్రతి విద్యార్థికి రోజుకు 7-8 గంటల నిద్రకు అవకాశం ఉండేలా చూడాలని సూచించారు. విద్యార్థుల కోసం కౌన్సెలింగ్, టైమ్ మేనేజ్‌మెంట్, స్ట్రెస్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. ఏడాదికి 20 రోజులు క్యాజువల్ లీవులు.. 5 రోజులు అకడమిక్ లీవులు: ప్రతి పిజి విద్యార్థికి సంవత్సరానికి 20 రోజుల పెయిడ్ క్యాజువల్ లీవులు, 5 రోజుల అకడమిక్ లీవులు, 52 వారాంతపు సెలవులు ఉంటాయని స్పష్టం చేశారు. వారాంతపు సెలవులను ఇతర సెలవులతో సర్దుబాటు చేయకూడదని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ప్రతి విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ లేదా అంతకంటే పైస్థాయి అధికారిని పిజి రిజిస్ట్రార్‌గా నియమించాలని ఆదేశించారు. డ్యూటీ రోస్టర్లను హెచ్‌ఓడి, పిజి రిజిస్ట్రార్, ఫ్యాకల్టీ, సీనియర్ రెసిడెంట్లు, జూనియర్ రెసిడెంట్లు సమన్వయంతో రూపొందించాలి. ప్రతి కళాశాలలో నోడల్ అధికారిని నియమించి, నెలవారీ కంప్లయన్స్ రిపోర్టును తదుపరి నెల 10వ తేదీలోపు వైద్య విద్యా సంచాలకుల కార్యాలయానికి పంపాలి. ప్రతి నెల సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పిజి వైద్య విద్యార్థులకు సంబంధించిన అంశాలను సమీక్షి ంచాలి. సమీక్ష సమావేశాలు నిర్వహించకపోయినా, కంప్లయన్స్ రిపోర్టులు సమర్పించకపోయినా సంబంధిత ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, హెచ్‌ఓడిలపై తగిన చర్యలు తీసుకుంటామని డిఎంఇ డాక్టర్ విష్ణువర్ధన్ స్పష్టం చేశారు. డ్యూటీ గంటలు, వారపు సెలవులు, డ్యూటీ రోస్టర్లు, హాజరు, సెలవులు, డిసర్టేషన్ పురోగతి, లాగ్‌బుక్‌లు, కౌన్సెలింగ్, గ్రీవెన్స్ తదితర అంశాలను నెలవారీ సమీక్షలో చర్చించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూనియర్ డాక్టర్లకు మంచినీటి సౌకర్యం జూనియర్ డాక్టర్ల విధుల నిర్వహణకు అనుగుణంగా ఆయా ప్రాంతాల్లో నెలలోగా మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలని ఆదేశించారు. వాష్‌రూమ్‌లలోనూ నీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంచినీటి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన నిధులను సిఎస్ఆర్, హెచ్‌డిఎస్, సిడిఎస్ నిధుల నుంచి సర్దుబాటు చేసుకోవచ్చని తెలిపారు. నిర్దేశించిన సమయంలోగా అవసరమైన సౌకర్యాలను కల్పించని పక్షంలో చర్యలు తీసుకుంటామని వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి జి. వీరపాండియన్ ఆదేశించారని డిఎంఇ పేర్కొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కళింగ వైశ్యులకు తగిన ప్రాధాన్యత కల్పించాలి




శ్రీకాకుళం, ఆగస్టు 28 ప్రభాతవార్త : శుక్రవారం సాయంత్రం విశాఖపట్నం ప్రెస్ క్లబ్‌లో రాష్ట్ర కళింగ కోమటి సంఘం ప్రధాన కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు అధ్యక్షతన రాష్ట్ర కళింగ కోమటి సంఘం, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు మరియు కోశాధికారులతో కలిసి ఆయన ఒక పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న బోయిన గోవిందరాజులు మాట్లాడుతూ రాష్ట్రంలో 24 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచిన రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర కళింగ కోమటి సంఘం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు కళింగ వైశ్యులకు అత్యధిక స్థానాలు కేటాయించి, రాజకీయంగా ఎదిగేందుకు తగిన అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ప్రతి గ్రామంలోనూ, పట్టణంలోనూ కళింగ వైశ్యులు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలుగా, మున్సిపల్ చైర్మన్‌గా కౌన్సిలర్లుగా భారీ సంఖ్యలో ఎన్నికయ్యే వారని గుర్తు చేశారు. అయితే, కాలక్రమేణా మారిన రిజర్వేషన్ల పరిస్థితుల కారణంగా తమ కులానికి చెందిన నాయకులు రాజకీయంగా వెనుకబడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, 2014లో టిడిపి ప్రభుత్వం కళింగ వైశ్యులను బీసీ డి లో చేర్చి తమ కులానికి ఎంతో న్యాయం చేశారని కొనియాడారు. అదే స్ఫూర్తితో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పట్టణాలు మరియు గ్రామాల్లో నివసించే కళింగ వైశ్యులకు రాజకీయ చైతన్యం కలిగిన వ్యక్తులకు ఆయా పార్టీల్లో ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన మరోసారి అన్ని రాజకీయ పార్టీలను కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి కోరాడ శ్రీనివాసరావు, శ్రీకాకుళం జిల్లా కళింగ కోమటి సంఘం అధ్యక్షులు సానా షణ్ముఖరావు, శ్రీకాకుళం పట్టణ సంఘం అధ్యక్షులు కోరాడ హరగోపాల్, సాగర్‌నగర్ సంఘం అధ్యక్షులు తంగుడు సంతోష్, అక్కయ్యపాలేం సంఘం అధ్యక్షులు కలివరపు దాలిరాజు, పెందుర్తి సంఘం అధ్యక్షులు మల్లా శ్రీనివాసరావు, పొట్నూరు అప్పారావు, అల్లిపురం సంఘం అధ్యక్షులు పూనా మోహనరావు, గోపాలపట్నం సంఘం సెక్రెటరీ సింహాద్రి శంకరరావు, పిఎం పాలేం సంఘం సంకా విష్ణుమూర్తితో, మద్రిపాలేం సంఘం అధ్యక్షులు జామి వెంకటరమణ, కంచరపాలేం సంఘం అధ్యక్షులతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వివాదాల్లో ఇరుముడి చిత్రం

### విద్యామంత్రి లోకేష్‌కు ఉపాధ్యాయ సంఘాల ఫిర్యాదు

**విజయవాడ,ఆగస్టు28,ప్రభాతవార్తప్రతినిధి:** రవితేజ నటించిన "ఇరుముడి " తీవ్ర వివాదాల్లో చిక్కుకుంది. , సినిమాలో ప్రభుత్వ పాఠశాలలు, ఉపాధ్యాయులను కించపరిచేలా సన్నివేశాలు ఉన్నాయంటూ తెలుగు రాష్ట్రాల్లోని ఉపాధ్యాయ సంఘాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏకంగా విద్యాశాఖ మంత్రికి లేఖ రాయడంతో వివాదం మరింత ముదిరింది. ఇరుముడి చిత్రంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థను, ఉపాధ్యాయులను చులకన చేసేలా పలు సన్నివేశాలు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య (ఏపీటీఎఫ్), యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (యూటీఎఫ్) వంటి సంఘాలు ఆరోపిస్తున్నాయి. సినిమా అనేది శక్తిమంతమైన మాధ్యమం అని, దాని ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో తప్పుడు అభిప్రాయాలు కలిగించడం సరికాదని ఏపీటీఎఫ్ నేతలు చెన్నుపాటి మంజుల, బసవలింగారావు పేర్కొన్నారు. ప్రభుత్వ బడుల పట్ల అపోహలు పెంచేలా ఉన్న ఆయా సన్నివేశాలను వెంటనే సినిమా నుంచి తొలగించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు.ఈ వివాదం తాజాగా రాజకీయ రంగు పులుముకుంది. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీ మూర్తి ఈ విషయంపై ఘాటుగా స్పందించారు. భీమవరంలోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్న ఈ సన్నివేశాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని, చిత్రబృందంతో మాట్లాడి వివాదాస్పద దృశ్యాలను శాశ్వతంగా తొలగించేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

**• తిరుపతిలో అమరావతి ఛాంపియన్ షిప్ క్రీడాకారుల అవగాహన ర్యాలీ**




**తిరుపతి,ఆగస్టు 28ప్రభాతవార్తప్రతినిధి:** యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచి, వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో బాటు ఆరోగ్యకరమైన జీవన విధానం వైపు నడిపించాలనే లక్ష్యంతో తిరుపతిలో యాంటీ డ్రగ్స్ అవగాహన ర్యాలీని శాప్ చైర్మన్ రవి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం ఉదయం తిరుపతి ఎస్ వి విశ్వవిద్యాలయంలోని తారకరామా క్రీడా మైదానం నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ఈ అవగాహన ర్యాలీ చేపట్టారు. యువతను క్రీడల వైపు నడిపించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో బాటు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ ఫ్రీ ఏపీ" లక్ష్యంతో తిరుపతిలో క్రీడాకారులు, విద్యార్థులు, యువతతో కలిసి ఈ భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పారు. డ్రగ్స్‌కు బానిసై జీవితాన్ని, భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని యువతకు సూచించారు.క్రీడలు యువతలో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని రవినాయుడు తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే యువతకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తుందని చెప్పారు. డ్రగ్స్ వద్దు.. క్రీడలు ముద్దు" అనే సందేశాన్ని ప్రతి యువకుడికి చేరేలా అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. అమరావతి ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీలు ఊహించని రీతిలో విజయవంతమయ్యాయని, రాష్ట్రవ్యాప్తంగా క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని శాప్స్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే అనర్థాలపై యువతకు అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి జిల్లాలో ఇప్పటివరకు సుమారు 12 వేల గంజాయి రాపిడ్ టెస్టులు నిర్వహించగా, సుమారు 450 మందికి పాజిటివ్ వచ్చినట్లు వెల్లడించారు. వారిలో సుమారు 350 మంది ఇతర రాష్ట్రాలకు చెందినవారిగా గుర్తించినట్లు తెలిపారు. జిల్లాలో గంజాయి ఎక్కడి నుంచి వస్తోంది, ఎక్కడికి తరలిస్తున్నారు అనే అంశాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ మాట్లాడుతూ అమరావతి ఛాంపియన్‌షిప్ పోటీలను 12 రకాల క్రీడల్లో, అండర్ 17, అండర్23 విభాగాల్లో విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. శాప్ ఆధ్వర్యంలో తిరుపతికి వచ్చిన సుమారు 14,700 మంది క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. ప్రభుత్వ కళాశాలల నుంచి సుమారు 65 శాతం మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని, సుమారు 80 శాతం మంది క్రీడాకారులు గ్రామీణ ప్రాంతాలకు చెందినవారేనని తెలిపారు. అమరావతి ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ కనబరిచిన విజేతలకు మెరుగైన శిక్షణ అందించి, వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శాప్స్ ఎండి ఎస్. భరణి, పద్మావతి మహిళా యూనివర్సిటీ విద్యార్థినులు, ఎన్‌సిసి సిబ్బంది, క్రీడాకారులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మాయమాటలతో మహిళపై అత్యాచారం

**తిరుపతి,ఆగస్టు 28ప్రభాతవార్తప్రతినిధి:** మాయామటలతో నమ్మించి పెళ్లి చేసుకుంటానని పలుసార్లు కామ వాంఛన తీర్చుకున్న యువకుడి ఉదంతం వెలుగుచూసింది. అంతేగాక బాధిత మహిళకు సంబంధించిన నగదు నగలు కాజేసి పరారవడంతో పోలీసులకు ఫిర్యాదు అందింది. తిరుపతిలో ఉంటున్న మహమ్మద్‌షారుక్ ఓ యువతితో పెళ్ళికి ముందే సంబంధం కలిగి ఉన్నాడు.ఇదీ కాస్త కుటుంబ బంధంగా మారింది.గత ఏడేళ్ళు గా వారి మధ్య బంధం కొనసాగింది. చివరకు అతను పెళ్ళిచేసుకోవడానికి కుదరదనడంతో బాదితురాలు పోలీసులను ఆశ్రయించింది. అయినా పది రోజుల్లో వివాహం చేసుకుంటానని పెద్ద మనుషులకు ఒప్పించిన మహమ్మద్ షారుక్. యువతిని తిరుపతి, గూడూరు, నెల్లూరు, బెంగళూరు ప్రాంతాలకు తీసుకెళ్లి మహిళతో శారీరక సంబంధం పెట్టుకున్నాడనేది ఆరోపణలు. దీంతో ఆమె గర్భవతి కావడంతో అబార్షన్ చేయించి పరారయ్యాడు. మహమ్మద్ షారుక్ పై చర్యలు తీసుకోవాలని బాధితుకాలు తిరుపతి తూర్పుపోలీసులకు ఫిర్యాదు చేసింది.

# తిరుమల సమాచారం


## విజయవంతంగా గరుడసేవ



**తిరుమల,ఆగస్టు 28ప్రభాతవార్తప్రతినిధి:** రానున్న సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ముందు శ్రావణపౌర్ణమిన శుక్రవారం రాత్రి జరిగిన మాదిరి గరుడసేవ విజయవంతమైంది. ప్రతిఏడాది బ్రహ్మోత్సవాలకు ముందు పౌర్ణమిరోజు మాదిర గరుడసేవ తిరుమలలో శాస్త్రోక్తంగా నిర్వహించడం జరుగుతుంది. శుక్రవారం శ్రావణమాస పౌర్ణమి గరుడసేవను వేడుకగా చేపట్టారు.సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగించుకున్న మలయప్పస్వామి సహస్రదీపాలంకరణసేవలో వయ్యారంగా పూజలందుకున్నారు. అక్కడ నుండి బయలుదేరి వాహనమండపం చేరుకున్నారు. పున్నమివెలుగుల్లో శుక్రవారం రాత్రి మలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. వాహనమండపం వద్ద ఆలయ అర్చకులు విశేషఅలంకారభూషితుడైన మలయప్పను కొలువుదీర్చి వేదమంత్రాల నడుమ కర్పూర హారతులిచ్చారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడవాహనం మెల్లగా ఆలయం ముందునుంచి కదులుతూ మాఢవీధుల్లో ఊరేగారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## వారాంతం... భక్తులతో కొండ కిటకిట


### వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు



**తిరుమల,ఆగస్టు 28ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం లక్షమందికిపైగాభక్తులు తిరుమలకు చేరుకోవడంతో కొండ కిటకిటలాడుతోంది. వారాంతం శని,ఆదివారాలు కలసి రావడంతో శుక్రవారం ఉదయం 6గంటలకే తిరుమలలో భక్తులు పోటెత్తారు. ఉదయానికే తిరుమలలో వైకుంఠం-1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఆలయం వెలుపల శిలాతోరణం వరకు చేరాయి. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 24గంటలు సమయం పడుతోంది. వెలుపల క్యూలైన్లలో ఉన్న భక్తులకు మరో 10గంటలు అదనపు సమయం దర్శనానికి పట్టవచ్చు. దీంతో టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం వరకు 41వేలమంది భక్తులకు సర్వదర్శనంలో మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 20వేలమంది భక్తులు అర్ధరాత్రివరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. తిరుమలకు చేరుకునే సామాన్యభక్తుల సంఖ్య అనూహ్యంగా పెరగడంతో గదుల కోసం నిరీక్షణ తప్పడంలేదు. గురువారం రాత్రివరకు 66,437 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీవారి హుండీ ద్వారా 4.45 కోట్ల రూపాయలు ఆదాయం సమకూరింది.

# సాలకట్ల బ్రహ్మోత్సవాలకు ఏడుకొండలు సన్నద్ధం!

- సెప్టెంబర్ 8న కోయిల్ ఆళ్వార్‌తిరుమంజనం
- 14న అంకురార్పణ, 15న ధ్వజారోహణం



**తిరుమల,ఆగస్టు 28ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ వైకుంఠవాసుడు ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు తిరుమల తిరుపతి దేవస్థానం సిద్ధమైంది. ఇప్పటికే తిరుమలలో ఆలయం పరిసరాలు గ్యాలరీలు ఏర్పాటు, అదనపు కొళాయిలు, షెడ్లు, భక్తులు తోపులాటకు గురికాకుండా ఇనుపకంచెలు ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈపనులన్నీ సెప్టెంబర్ 13వతేదీ లోపు పూర్తికావాలని టిటిడి అధికారులు భావిస్తున్నారు. తిరుమలలో ప్రతిరోజూ ఉత్సవాలు, సేవలే. ఏడాదికోసారితొమ్మిదిరోజులు జరిగే బ్రహ్మోత్సవాలకు దేశవిదేశాల నుంచి భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు తొమ్మిదిరోజులు జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాలకు తిరుమలకొండసర్వాంగ సుందరంగాముస్తాబవుతోంది. బ్రహ్మోత్సవాలకు తొలిఘట్టంగా ఆలయం శుద్ది చేయడం (కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం) సెప్టెంబర్ 8వతేదీ మంగళవారం నిర్వహిస్తారు. ఆరోజు ఆలయంలో జరిగే అష్టదళపా దపద్మారాధన సేవ రద్దయ్యింది. ఆ తరువాత ఆరురోజులకు 14వతేదీ సోమవారం సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవ ఘట్టాలు మొదలవుతాయి. మరుసటిరోజు 15వతేదీ మంగళవారం సాయంత్రం జరిగే ధ్వజారోహణంతో ఉత్సవాల వేడుకలకు శ్రీకారం చుడతారు. శ్రీదేవిభూదేవి ఉభయదేవేరులతో కలసి శ్రీమలయప్పస్వామికి మంగళవారం ఉదయం బంగారువాకిలిలో విశేష సమర్పణ చేస్తారు. యాగశాలలో సంప్రదాయ కార్యక్రమాల అనంతరం ఉత్సవర్లతో బాటు అనంత,గరుడ, చక్రత్తాళ్వార్, సేనాధిపతి ధ్వజపటం తదితరాలను తిరుచ్చిలో నాలుగుమాఢవీధుల్లో ప్రదక్షిణగా ఆలయానికి వేంచేపుచేస్తారు. సాయంత్రం మీనలగ్నంలో ధ్వజస్తంభంపైకి గరుడపటాన్ని అధిరోహిస్తారు. ఆ తరువాత రాష్ట్రప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఈ కార్యక్రమం అనంతరం ఏడుకొండలవాని వాహనసేవలు ఆరంభమవుతాయి. తొలివాహనంగా మంగళవారం రాత్రి 9గంటలకు కలియుగప్రత్యక్షదైవం శ్రీమన్నారాయణుడు అలంకారంలో ఏడుతలల పెద్దశేషవాహనంపై అధిరోహించి ఆలయమాఢవీధుల్లో ఊరేగుతారు. బ్రహ్మోత్సవాలలో ఐదవరోజురాత్రి జరిగే గరుడసేవకు సిఎం పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. ఈ ఆనవాయితీని 2004 నుంచి బ్రహ్మోత్సవాల ప్రారంభంరోజే సమర్పించడం జరుగుతుంది. అనంతరం రంగనాయకుల మండపంలో 2027కు సంబంధించిన నూతన సంవత్సర క్యాలండర్లు, డైరీలు ఆవిష్కరిస్తారు. 15వతేదీ మంగళవారం తెల్లవారుజామున సుప్రభాతం మినహా మిగిలిన తోమాల, అర్చన, వారపుసేవలైన కల్యాణోత్సవం, డోలోత్సవం, ఆర్జితబ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకరణ సేవలు రద్దుచేశారు. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిదిరోజుల సమయంలో సర్వదర్శనం మాత్రమే అనుమతించనున్నారు. మిగిలిన సేవలన్నీ టిటిడి రద్దుచేసింది. శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో అతిథిగృహాల వద్ద భద్రత మరింత పటిష్టం రాబోయే శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమల పోలీసులు, టిటిడి విజిలెన్స్ విభాగం సంయుక్తంగా తిరుమలలో ప్రముఖులు, వివిఐపిలు బసచేసే అతిథి గృహాల వద్ద మరింత భద్రత పటిష్టం చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం అతిథిగృహాల నిర్వాహకులతో పోలీసులు సమావేశం నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఈ సమావేశం జరిగింది. గదుల్లో బసచేసే అతిథుల వివరాల నమోదు, అనుమతి లేని వ్యక్తుల ప్రవేశ నియంత్రణ, అతిథిగృహాల సిబ్బంది పూర్తి వివరాల సేకరణ, వారి నేరచరిత్ర పరిశీలన, వాహనాల పార్కింగ్ నిర్వహణ, అనుమానాస్పద వ్యక్తులు వస్తువుల గుర్తింపు తదితర భద్రతా అంశాలపై సమగ్రంగా చర్చించారు. బ్రహ్మోత్సవాల సమయంలో పోలీస్, విజిలెన్స్ అధికారులు జారీ చేసే భద్రతా సూచనలను తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తించిన వెంటనే పోలీస్ ,విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించాలని, గెస్ట్ హౌస్‌ల వద్ద ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా పార్కింగ్‌ను క్రమబద్ధంగా నిర్వహించాలని తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు, విఐపి/వివిఐపీ అతిథుల భద్రతకు ఎటువంటి ఆటంకం కలగకుండా పోలీస్, విజిలెన్స్ గెస్ట్ హౌస్ నిర్వాహకులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను ప్రశాంతంగా, సురక్షి తంగా విజయవంతంగా నిర్వహిం చేందుకు ప్రతి ఒక్కరూ పోలీస్, విజిలెన్స్ విభాగాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బ్రహ్మోత్సవాలకు ముందు తిరుమలలో పోలీసుల జల్లెడ అనధికార, అసాంఘిక శక్తుల కోసం వేట పవిత్రపుణ్యక్షేత్రం తిరుమలలో భక్తుల భద్రత, స్వామివారి ఆలయానికి మరింత రక్షణ కోసం అసాంఘిక ,అనధికార వ్యక్తులపై మరింత నిఘా ఉంచడానికి పోలీసులు, విజిలెన్స్ సెక్యూరిటీ విభాగం జల్లెడపట్టింది. తిరుమలలో స్థానికులు ,వ్యాపారులు నివాసముంటున్న బాలాజీనగర్‌ప్రాంతంతో బాటు హెచ్‌టి కాంప్లెక్స్, ఆర్‌బి సెంటర్ బాలాజీనగర్‌వెనుక కార్మికుల గుడారాలపై శుక్రవారం ఉదయం నుండి దాదాపు నాలుగుగంటలపైగా వేట ప్రారంభించారు. సహజంగానే ప్రతిరోజూ లక్షమంది వరకు భక్తులు తిరుమలకు వస్తున్నారు. అంతేగాక తిరుమలలో పలు రకాల కాటేజీలు, అతిథిగృహాలు ఆధునీకరణ పనులకు బయటి రాష్ట్రాలనుండి కార్మికులను తీసుకువచ్చారు. హోటళ్ళు, చిన్నచిన్న వ్యాపారాల్లో కార్మికులు బయటి రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన వారే ఉంటున్నారు. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాలకు ముందు తిరుమలలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు, అసాంఘిక ,అనధికార వ్యక్తులు తిష్టవేయకుండా ఉండేందుకు తనిఖీలు చేపట్టారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ కెవి మురళీకృష్ణ ఆదేశాలతో తిరుమల ఎఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, సిఐలు ,టిటిడి విజిలెన్స్ విఎస్ఒ అల్లంసురేంద్ర విజిలెన్స్ సిబ్బందితో బాలాజీనగర్‌లో నిశితంగా పరిశీలించారు.ఇక్కడ ఉంటున్న వారి ఆధార్‌కార్డులు తనిఖీ చేసి, జాబితాను తయారుచేసి ఇంజనీరింగ్ విభాగంకు పంపారు. అనధికారికంగా తిరుమలలో తిష్టవేసిన వారిని బయటకు పంపేందుకు ఇలాంటి దాడులు తరచూ చేపట్టాలని ,సరైన ధృవీకరణ పత్రాలు లేని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని టిటిడి విజిలెన్స్ హెచ్చరించింది. తనిఖీల్లో భాగంగా 670 ఇళ్లను తనిఖీ చేసి సరైన గుర్తింపు కార్డులు లేని 27 మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు. 160 వాహనాలను తనిఖీ చేసి 41,380 రూపాయలు విలువైన పాత చలానాలను రికవరీ చేయడం,గుర్తింపు లేని మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

### శ్రీకాళహస్తిలో మొదటి అయ్యప్ప దేవాలయం

## కుంభాభిషేకంతో పునీతం

**శ్రీకాళహస్తి,ఆగస్టు 28 ప్రభాతవార్త:** ఆధ్యాత్మిక దివ్యక్షేత్రంగాను, ధార్మిక కార్యక్రమాలకు నిలయంగా విరాలజి ల్లుతున్న దక్షిణ కైలాసంలో మొదటి అయ్యప్ప ఆలయాన్ని శబరిమల అయ్యప్పస్వామి వారి తత్వమసి సేవా సమితి సారధ్యంలో నిర్మించారు. పట్టణంలోని భక్తుల భాగస్వామ్యంతో యుద్ధ ప్రాతిపదికపై కొత్త ఆలయాన్ని శ్రీకాళహస్తీశ్వ రాలయానికి దక్షిణాన కైలాసగిరుల్లోని నంది హిల్స్ వద్ద నిర్మించారు. ఈ ఆలయ కుం బాభిషేకం శుక్రవారం నిర్వహించారు. ఆలయాన్ని శబరిమలలోని ఆలయ ఆకారంలో నిర్మించారు. శుక్రవారం జరిగిన కుంబాభిషేకం కార్యక్రమాలకుముఖ్యఅ తిధులుగా శబరిమల మందల రాజ వంశస్తులు సురేష్‌వర్మ, శబరిమల మాజీ మేల్ శాంతి బ్రహ్మశ్రీ శంకరం నంబూద్రిలు హాజరయ్యారు. మూడు రోజుల పాటు ఆలయ ఆవరణలో




నిర్వహించిన పూజలతో పునీతమైన కలశాల నీటితో ఆలయంపై భాగంలో ఏర్పాటు చేసిన కలశాన్నికి అభిషేకించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్యఅతిధులుగా హాజరైన శబరిమల వాసులు ఆలయ ప్రాధాన్యత గురించి వివరించారు. ఆలయంలో ప్రతిష్టించిన విగ్రహానికి భక్తి శ్రద్దలతో శబరిమల ఆచారం మేరకు పూజలుమొదటి అభిషేకం నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ ఆవరణలో అయ్యప్పభక్తుల భజనలు, పాటలతో కైలాసగిరులు దద్దరిల్లాయి.ఈ సందర్బంగా వచ్చిన భక్తులకు అన్న ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ శాసన సభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి దంపతులు, శ్రీకాళహస్తీశ్వరాలయ మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, పట్టణ వైకాపా నాయకులు పగడాల రాజు, పసల కృష్ణయ్య, మాజీ కౌన్సిలర్ కంఠా ఉదయ్‌కుమార్, పొట్టి రాజశేఖర్, యువ దంపతులు పఠాన్ ఫరీద్,జి వియకుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## టిటిడి ఆలయాల్లో వైభవంగా శ్రావణ ఉపకర్మ



**తిరుమల,ఆగస్టు 28ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఆలయాల్లో వైఖానస ఆగమోక్తంగా శుక్రవారం శ్రావణ ఉపకర్మ జరిగింది. తిరుమల శ్రీవారి ఆలయంతోబాటు తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రావణ ఉపకర్మ వేడుకలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటలకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల సేవ, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం ఉదయం 6.30 గంటలకు గోవింద రాజస్వామి, శ్రీకృష్ణస్వామిని మంగళవాయిద్యాల నడుమ కపిలతీర్థంలోని ఆళ్వార్ తీర్థానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ స్నపన తిరుమంజనం, ఆస్థానం శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం స్వామివారిని ఆలయానికి వైభవంగా తీసుకువచ్చారు. సాయంత్రం 4.30 నుంచి 6.30 గంటల వరకు అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలి



**శ్రీకాళహస్తి,ఆగస్టు 28 ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాలు ఎపోటీ పడి అభివృద్ధి చెందాలని శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు జరిపించుకున్న మాజీ తెంగాణ ఎన్‌జీవో కేంద్ర సంఘం అధ్యక్షులు, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌మాజీ సభ్యుడు కారం రవీంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కుటుంబ సమేతంగా శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని సేవలో పాల్గొని పూజలు జరిపించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతోమాట్లాడుతూ విభజన తరువాత రెండు రాష్ట్రాల్లో ప్రగతి సమతౌల్యంగా సాగుతుందని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో కేవలం హైదరాబాద్ కేంద్రంగానే పెట్టుబడులు వ్యాపారాలు సాగేవని విభజన తరువాత అమరావతి, విజయవాడ, విశాఖ పట్టణం, గుంటూరుతో పాటు రాష్ట్రంలోని ఇతర జిల్లా కేంద్రాలు ప్రగతి పథంలో దూసుకుపో తున్నాయని కొనియాడారు.

## శ్రీశైలం నుంచి విద్యుత్ ఉత్పత్తి పేరుతో
# నీళ్లు తరలిస్తే సీమ ప్రాజెక్టులకు నీళ్లెలా?

- వైసిపి అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్

**అనంతపురం, ఆగస్టు 28 ప్రభాతవార్త బ్యూరో:** రాయలసీమలో సాగు తీవ్ర సంక్షోభం నెలకొందని, శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేసి సాగునీటి ప్రాజెక్టులకు నీళ్లు ఇవ్వాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. శ్రీశైలం నుంచి రాయలసీమ ప్రాజెక్టులకు నీళ్లు తరలించకుండా నిర్లక్ష్యం చేస్తే రైతులతో కలిసి శ్రీశైలం ప్రాజెక్ట్ వద్ద ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. శుక్రవారం వైసిపి జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా కరువు పరిస్థితులున్నాయని, మరీ ముఖ్యంగా రాయలసీమలో దుర్భిక్ష పరిస్థితి నెలకొందన్నారు. రాయలసీమలోని అన్ని ప్రాజెక్టులు శ్రీశైలం మీదే ఆధారపడి ఉన్నాయని తెలిపారు. కరువు పరిస్థితులను ఎదుర్కొనే విషయంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రాయలసీమలో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయిందన్నారు. రాయలసీమ వ్యాప్తంగా 47శాతం లోటు వర్షపాతం నెలకొందన్నారు. ఇక భూగర్భ జలాలు గత ఏడాదితో పోల్చితే అడుగంటిపోయాయని తెలిపారు. తాగు, సాగునీటికే కాకుండా పశుగ్రాసం కొరత ప్రారంభమైందని చెప్పారు. శ్రీశైలంలో పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 874.30 అడుగులు ఉన్నాయన్నారు. ఇలాంటి తరుణంలో శ్రైశైలం నుంచి తెలంగాణ ఎడాపెడా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నా సిఎం చంద్రబాబు పట్టించుకోవడం లేదన్నారు. శ్రీశైలానికి ఇన్‌ఫ్లో 13,171 క్యూసెక్కులు ఉంటే విద్యుత్ ఉత్పత్తికి తెలంగాణకు ఔట్‌ఫ్లో 26,114 క్యూసెక్కులుగా వెళ్తోందని, ఇదే పరిస్థితి కొనసాగితే మరో రెండు వారాల్లోనే శ్రీశైలం నీటిమట్టం 854 అడుగులకు పడిపోతుందన్నారు. అదే పరిస్థితి వస్తే పోతిరెడ్డిపాడు ద్వారా నీళ్లు ఇచ్చే అవకాశం ఉండదని తెలియజేశారు. 834 అడుగులకు పైన ఉంటేనే అనంతపురం జిల్లాకు హంద్రీ-నీవా నుంచి నీళ్లు కూడా వచ్చే పరిస్థితి ఉంటుందన్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో నీటిమట్టం 874 అడుగులే ఉన్న విషయాన్ని పరిగణలోకి తీసుకుని విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలన్నారు. అదేవిధంగా తుంగభద్ర డ్యాం పరిధిలోని హెచ్ఎల్ఎంసి, నార్త్, సౌత్ కెనాల్, జిబిసి పరిధిలో ఆరుతడి పంటలకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణం ఉన్నతాధికారులతో కలిసి విజయవాడలో ఐఎబి (ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డ్) సమావేశం నిర్వహించాలన్నారు. ఈనెల 30వ తేదీన అనంతపురం వస్తున్న చంద్రబాబుకు ఇక్కడి పరిస్థితులు వివరించి ఆయన సమక్షంలోనే సమావేశం పెట్టుకోవాలని జిల్లా ప్రజాప్రతినిధులకు సూచించారు.

**కరెంట్ కొనొచ్చు..నీళ్లు కొనలేం: శైలజానాథ్**

రాయలసీమ పట్ల ప్రభుత్వ పెద్దలు కక్షపూరితంగా వ్యవహరించొద్దని మాజీ మంత్రి శైలజానాథ్ సూచించారు. శ్రీశైలం నుంచి నీటిని తరలించే విషయంలో ప్రాంతాల మధ్య విభేదాలు పెట్టే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. గోదావరి నీటిని పట్టిసీమ ద్వారా తరలించుకోండని, అదే సమయంలో రాయలసీమకు హక్కుగా ఉన్న నీటి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరెంట్ కొనొచ్చు.. నీళ్లను కొనలేం... ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని నీటిని విద్యుత్ ఉత్పత్తి కోసం తరలించొద్దని సూచించారు. తక్షణం శ్రీశైలం నుంచి రాయలసీమ ప్రాంతానికి నీరు విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. సమావేశంలో గ్రేటర్ రాయలసీమ ప్రాజెక్టుల సాధన టాస్క్ ఫోర్స్ కమిటీ అనంతపురం జిల్లా కోఆర్డినేటర్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణ రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వెన్నం శివారెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి తరిమెల గోకుల్ రెడ్డి, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి జానీ, సాంస్కృతిక విభాగం నగర అధ్యక్షులు కొసిరెడ్డి కేశవ్ రెడ్డి, ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి కల్లు రమేష్ గౌడ్, రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి బోనాల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పిఎం కుసుమ్ పథకం కింద ఎస్‌పిడిసిఎల్ పరిధిలో సోలార్ ప్లాంట్లు

- గ్రిడ్ కు అనుసంధాన ప్రక్రియ వేగవంతం
- సిఎండి శివశంకర్ లోతేటి



**తిరుపతి,ఆగస్టు 28ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పిఎం కుసుమ్ పథకంలో భాగంగా ఎస్పిడిసిఎల్ పరిధిలో సౌర విద్యుత్ ప్లాంట్లను గ్రిడ్ కు అనుసంధానం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి ఆదేశించారు. తిరుపతిలో శుక్రవారం సాయంత్రం పిఎంకుసుమ్ పథకం కింద జరుగుతున్న సోలార్ ప్లాంట్ల పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి మాట్లాడుతూ వ్యవసాయ రంగానికి నాణ్యమైన, నమ్మకమైన పగటిపూట 9 గంటల విద్యుత్తును అందించడంతో పాటు పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. చిత్తూరు జిల్లా కుప్పం, కడప, అనంతపురం జిల్లాల్లో ఏర్పాటు చేసిన నాలుగు సౌర విద్యుత్ ప్లాంట్ల నిర్మాణం పూర్తయిందని, వాటిని సమీపంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు అనుసంధానం చేసేందుకు అవసరమైన పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. సౌర విద్యుత్ ఉత్పత్తి పెరగడం ద్వారా పునరుత్పాదక ఇంధన వినియోగం విస్తరించడంతో పాటు భవిష్యత్ విద్యుత్ అవసరాలను సమర్థవంతంగా తీర్చేందుకు దోహదపడుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (టెక్నికల్) కె. గురవయ్య, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్, చీఫ్ జనరల్ మేనేజర్లు జె. రమణా దేవి, కే. సంపత్ కుమార్, జనరల్ మేనేజర్ టి. రాజశేఖర్ రెడ్డి, మెగా ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## లారీని ఢీకొన్న కర్ణాటక ఆర్టీసీ బస్సు
### 15 మంది ప్రయాణికులకుగాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం




**పెళ్లకూరు(తిరుపతి జిల్లా),ఆగస్టు 28, ప్రభాతవార్త :** తిరుపతి జిల్లా పెళ్లకూరు వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డుప్రమాదంలో ఆగివున్న కట్టెల లోడ్డులారీని కర్నాటక ఆర్టీసి బస్సు ఢీ కొంది. ఈ సంఘటనలో కర్నాటక ఆర్టీసి బస్సు డ్రైవర్‌తోబాటు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. పెళ్లకూరు గుర్రప్ప తోట సమీపంలో 71 వ నెంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. రోడ్డుపక్కన ఆగి ఉన్న లారీని వెనుక వైపు నుండి వస్తున్న కర్నాటక ఆర్టీసి బస్సు ఢీకొనడంతో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం సుమారు ఐదు గంటల ప్రాంతంలో కట్టెల రోడ్డుతో నాయుడుపేటవెళ్తున్న లారీ సాంకేతిక కారణాలవల్ల రోడ్డుపై ఆగి ఉండడంతో బెంగళూరు నుండి నెల్లూరు వైపు వెళ్తున్న కర్నాటక ఆర్టీసి బస్సుకు చెందిన అంబారి బస్సు లారీని వెనక వైపున ఢీకొనడంతో ఘోర ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న సుమారు 15 మంది ప్రయాణికులకు గాయాలు కాగా క్షతగాత్రులను 108,1033, అంబులెన్స్ ద్వారా నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇద్దరు పరిస్థితి విషమించడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ప్రమాద సంఘటన గురించి తెలుసుకున్న వెంటనే నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, పెళ్లకూరు ఎస్ ఐ ఆదిలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద పరిస్థితిని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పోలీసులు సీజ్ చేసిన వాహనాలు దగ్ధం



**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 28 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలీసులు వివిధ కేసుల్లో సీజ్ చేసిన రెండు వాహనాలకు నిప్పు అంటుకొని పాక్షికంగా దగ్ధమైన సంఘటన చోటుచేసుకుంది. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పోలీస్ స్టేషన్ సమీపంలో పార్కింగ్ చేసి ఉంచారు. గురువారం పెద్దపప్పూరు పోలీస్ స్టేషన్ సమీపంలో సంత నిర్వహిస్తారు. సంతకు వచ్చినవారు సిగరెట్లు గాని బీడీలు కానీ తాగి వాహనాలు పార్కింగ్ చేసిన ప్రాంతంలో వేయడంతో నిప్పురవ్వలు ఎగిరి పడి వాహనాలు అంటుకున్నాయి. మంటలు వ్యాపించడాన్ని గమనించిన పోలీసులు వెంటనే అప్రమత్తమై వాటిని ఆర్పి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఎపి అంతర్‌జిల్లాల ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ ప్రారంభం

**విజయవాడ,ఆగస్టు 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్-2026 సీనియర్ పురుషుల విభాగం పోటీలు శుక్రవారం ఎన్‌టీఆర్ జిల్లా మైలవరంలోని ఎల్‌బీఆర్‌సీఈ మైదానంలో ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ లీగ్ కమ్ నాకౌట్ టోర్నమెంట్ ఆగస్టు 28 నుంచి 31 వరకు జరగనుంది. రాష్ట్రంలోని 25 జిల్లాలకు చెందిన జట్లు ఈ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటున్నాయి. లీగ్ దశలో జట్లను ఎనిమిది గ్రూపులుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నారు. తొలిరోజు మ్యాచ్‌ల్లో తిరుపతి జట్టు అనకాపల్లిపై 9-0తో ఘన విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో అనంతపురం 3-0తో అనకాపల్లిని ఓడించింది. నెల్లూరు జట్టు 4-1తో కోనసీమపై విజయం సాధించగా, ప్రకాశం జట్టు కోనసీమపై 2-1 తేడాతో గెలుపొందింది. నెల్లూరు-ప్రకాశం మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ప్రతిభావంతులైన ఫుట్‌బాల్ క్రీడాకారులకు ఈ పోటీలు మంచి వేదికగా నిలుస్తున్నాయి. లీగ్ దశతో పాటు నాకౌట్ పోటీలు కూడా ఉత్కంఠభరితంగా సాగనున్నాయి.

## ఆర్టీసి ఇన్‌చార్జి యండిగా శివప్రసాద్ నియామకం



**విజయవాడ, ఆగష్టు 28, ప్రభాతవార్త :** ఆర్టీసిలో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న యం.శివప్రసాద్‌ను ఆర్టీసియండిగానూ, ఏపిప్రజారవాణా కమీషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు రవాణా రహదారులు మరియు భవనాలశాఖ కార్యదర్శి కోన శశిధర్ శుక్రవారం నియామక ఉత్తర్వులు జారీ చేసారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు శివప్రసాద్ అదనపు బాధ్యతల్లో కొనసాగుతారని ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. ఏపిపిటిడి కార్మికపరషత్ రాష్ట్రఅధ్యక్షులు ఎస్.వి.శేషగిరిరావు, ప్రధానకార్యదర్శి వై.శ్రీనివాసరావు, రాష్ట్రకోశాధికారి కోసూరి సురేంద్ర తదితరులు శివప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను బహుకరించారు.

## ఈ నెల 31న సీనియర్ ఐపిఎస్ పదవీ విరమణ

**విజయవాడ,ఆగస్టు28, ప్రభాతవార్తప్రతినిధి:** సీనియర్ ఐపీఎస్ అధికారి ఎన్. బాలసుబ్రహ్మణ్యం ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్నారు. ప్రస్తుతం ఆర్టీసీ వీసీఎండీ, జైళ్ల శాఖ డీజీగా ఎన్.బాలసుబ్రహ్మణ్యం ఉన్నారు. తదుపరి నియామకం చేపట్టే వరకు కోన శశిధర్‌కు ఆర్టీసీ వీసీఎండీ బాధ్యతలు అప్పగించారు. జైళ్ల శాఖ డీజీ అదనపు బాధ్యతలను హరీశ్‌కుమార్ గుప్తా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేశారు.

# నీళ్లిచ్చే అవకాశం ఉన్నా రైతులకు కన్నీళ్లు మిగుల్చుతున్నారు!

- నీళ్లివ్వకపోతే తామే నీళ్లు విడుదల చేస్తాం మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి
- హెచ్ఎల్‌సి, జిబిసి, హంద్రీనీవా సాగునీటిపై రైతులతో కలిసి రాస్తారోకో
- ఎండుతున్న వేరుశెనగ చెట్లు, పురుగుల మందు డబ్బాలతో రైతుల నిరసన


చిన్నముష్టూరు గ్రామంవద్ద అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిలోని హంద్రీనీవా బ్రిడ్జిపై రైతులతో కలిసి రాస్తారోకో నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

**ఉరవకొండ, ఆగస్టు 28 ప్రభాతవార్త:** పంటలకు నీళ్లిచ్చే అవకాశాలు ఉన్నా లేనిపోని ఆంక్షలు పెట్టి కూటమి ప్రభుత్వం రైతులను కష్టనష్టాలపాలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సిపి ఉరవకొండ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కళ్లముందరే నీరు పారుతున్నా ఎండతున్న పంటలను కాపాడుకోలేక చంద్రబాబు పాలనలో రైతులకు కన్నీళ్లే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఎల్‌సి, జిబిసి, హంద్రీనీవా ద్వారా సాగుకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సిపి ఆధ్వర్యంలో రైతులతో కలిసి శుక్రవారం ఉరవకొండ మండలం చిన్నముష్టూరు గ్రామంవద్ద అనంతపురం- బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిలో హంద్రీ-నీవా బ్రిడ్జిపై బైటాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ జలాశయాల్లో ఉన్న నీరు, కాలువల ద్వారా పారుతున్న నీటిని సరైన పద్దతిలో వినియోగించి ఆరుతడి పంటలకు నీరిచ్చే అవకాశం ఉన్నా ప్రభుత్వం మాత్రం తాగునీటికే తొలి ప్రాధాన్యం అంటూ ఏకపక్ష నిర్ణయంతో ముందుకెళుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. సాగుకు ఎన్ని నీళ్లు, తాగడానికి ఎన్ని నీళ్లు ఇవ్వాలన్న విషయమై చర్చించడానికి ఐఎబి మీటింగ్ పెట్టి చర్చించకుండా ఎలా గుడ్డిగా నిర్ణయం తీసుకుంటారని ప్రశ్నించారు. రెండు మూడు రోజుల్లో ఐఎబి మీటింగ్ పెట్టి సాగుకు నీళ్లివ్వడంపై నిర్ణయం తీసుకోకపోతే తామే కాలువల షెట్టర్లు ఎత్తి నీటిని విడుదల చేస్తామని అల్టిమేటం జారీ చేశారు. రాస్తారోకోలో పాల్గొన్న పలువురు రైతులు ఎండుతున్న వేరుశెనగ తదితర పంటల చెట్లతోపాటు నీరివ్వకపోతే ఆత్మహత్యలే శరణ్యమని పురుగుల మందుల డబ్బాలతో నిరసన తెలిపారు. రాస్తారోకో అనంతరం రోడ్డుపైనే భోంచేశారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ ఎంపిపి యం.నరసింహులు, వైఎస్సార్‌సిపి నాయకులు ఎం.అశోక్‌కుమార్, సి.పి.వీరన్న, మేకల సిద్దప్ప, ఈడిగ ప్రసాద్, జి.ఎర్రిస్వామిరెడ్డి, మూలగిరిపల్లి ఓబన్న, ఎం.బసవరాజు, ఏ.సి.ఎర్రిస్వామి, కురుబ రమేష్, కరణం భీమిరెడ్డి, హావళిగి భరత్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, జోగి వెంకటేష్, కొడికి గోవిందు, డిష్ సురేష్, బి.యోగేంద్రరెడ్డి, మల్లెల జగదీష్, ఉస్మాన్, కరూరు వెంకటేశులు, కణేకల్లు రైతు సంఘం అధ్యక్షులు జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అనంతకు రేపే సిఎం చంద్రబాబు రాక

- టిడిపి జిల్లా అధ్యక్షుడు పూల నాగరాజు కుమారుని వివాహానికి హాజరు సీఎం పర్యటించనున్న ప్రదేశాలలో ఏర్పాట్లను పరివేక్షించిన జిల్లా ఎస్పీ, కలెక్టర్


సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ ఆనంద్, జిల్లా ఎస్పీ జగదీష్, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ పూల నాగరాజు తదితరులు

**అనంతపురం, ఆగస్టు 28 ,(ప్రభాతవార్త బ్యూరో)** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 30వ తేదీన అనంతపురం నగరానికి రానున్నారు. నగర శివారులోని ఎం .వై .ఆర్ కళ్యాణమండపంలో టిడిపి జిల్లా అధ్యక్షులు, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు కుమారుడు కు , గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమార్తెతో వివాహం జరగనుంది. ఇద్దరు టీడీపీ నేతల కుటుంబాల మధ్య వివాహం ప్రాధాన్యత సంతరించుకుంది.ఆ ఇద్దరు ముఖ్య నేతల ఆహ్వానం మేరకు సీఎం చంద్రబాబు నాయుడు వివాహానికి హాజరై నూతన దంపతులను ఆశీర్వదించరున్నారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో సీఎం చంద్రబాబు ఇక్కడికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఇదిలా ఉండగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించే ప్రాంతాలలో అధికారులు అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) నిర్వహించి ఏర్పాట్లను పరిశీలించారు. శుక్రవారం సాయంత్రం అనంతపురం నగరంలోని శిల్పారామం, బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ కళ్యాణ మండపం వద్ద జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా ఎస్పీ పి.జగదీష్ , ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, ఎస్టీ కమిషన్ సభ్యులు వెంకటప్ప, ఎడిసిసి బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి తదితరులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ఏఎస్ఎల్) నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం కాన్వాయ్ కి సంబంధించిన రూట్ ను పరిశీలించారు. హెలిప్యాడ్, ఎంవైఆర్ కళ్యాణ మండపం ప్రాంతాన్ని, పార్కింగ్ స్థలాలు వద్ద బందోబస్తు మరియు భద్రత ఏర్పాట్లను సమీక్షించి అధికారులకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండరాదన్నారు. అవసరమైన చోట బ్యారికేడ్ లను ఏర్పాటు చేయించాలన్నారు. హెలిప్యాడ్ లో విఐపీలు కూర్చునేందుకు వీలుగా ఏర్పాట్లు చేపట్టాలని, సంబంధిత శాఖల అధికారులు వారికి కేటాయించిన విధులను వ్యక్తిగతంగా పరిశీలన చేయాలని, అన్ని ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలన్నారు. ఎలాంటి ఇబ్బంది, లోటుపాట్లు లేకుండా ద్వారా సీఎం పర్యటనను విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హెలిప్యాడ్, ఎంవైఆర్ కళ్యాణ మండపం, తదితర ప్రాంతాలో ఏఎస్ఎల్(అడ్వాన్సుడ్ సెక్యూరిటీ లైయిజన్) నిర్వహించి అధికారులు చేపట్టవలసిన ముందస్తు ఏర్పాట్లు, భద్రతా చర్యల్కపై దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ సీఎం పర్యటించనున్న ప్రదేశాలలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్, ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ ఏ.బాలకొండయ్య, ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రిశేఖర్, డిపిఓ నాగరాజ నాయుడు, డిఎస్పిలు, ఆయా శాఖల జిల్లా అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేటు పాఠశాలల సమస్యల సాధనకు కృషి ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



**బుచ్చి (నెల్లూరు) ఆగస్టు 28 ప్రభాతవార్త:** ప్రవేటు పాఠశాలల సమస్యల సాదనకు కృషి చేస్తానని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీవివేకానంద ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో అపస్మా నేతృత్వంలో జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు ప్రవేటు పాఠశాలు,ప్రభుత్వ పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామి ఇచ్చారు. ప్రవేటు పాఠశాలల బస్సులకు ఫిట్నెస్ 15 సంవత్సరాలు ఉండగా తాను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్ళడంతో మరో మూడు సంవత్సరాలు పెంచడానికి సానుకూలంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న 500 కోట్ల బసు బకాయిలపై మండలిలో అడగడం జరిగిందన్నారు. ప్రవేటు టీచర్లకు ఇళ్ళ స్థలాలు, హెల్త్‌కార్డులు, తక్కువ వడ్డికి రుణాలు ఇవ్వాలని విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ దృష్టికి తీసుకొని వెళ్లినట్లు ఆయన చెప్పారు, రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ఇస్తుంటే అపస్మా ప్రవేటు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాద్యాయులకు ఉత్తమ అవార్డు ఇస్తుందన్నారు. జిల్లాలో అపస్మా ఆధ్వర్యంలో టాలెంట్ టెస్టులు,ఆటలపోటీలు నిర్వహిస్తు అపస్మా సభ్యులు చక్కగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఈకార్యక్రమంలో అపస్మా రాష్ట్ర అధ్యక్షులు తులసి విష్ణు ప్రసాద్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమణారెడ్డి, స్టేట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నేతాజి సుబ్బారెడ్డి, జోనల్ ప్రెసిడెంట్ సుబ్బారావు, స్టేట్‌వైస్ ప్రెసిడెంట్ రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి,జిల్లా ట్రెజరర్ కృష్ణారావు, కోవూరు నియోజకర్గం అధ్యక్షులు దయాకర్‌రెడ్డి,కార్యదర్శి మల్లేశ్వర్‌రెడ్డి, ట్రెజరర్ రాధికారెడ్డి, రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన కరస్పాండెంట్‌లు, ఈకార్యక్రమంలో అపస్మానాయకులు బ్రోచర్ విడుదల చేశారు.

## అంబటి రాంబాబుకు అస్వస్థత అస్పత్రిలో చికిత్స

**హైదరాబాద్, అగస్టు 28 ప్రభాతవార్త:** వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను హుటాహుటిన హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వైద్యులు ఆయనకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, స్టెంట్ అమర్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం అంబటి రాంబాబు అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం వెంటనే హైదరాబాద్‌కు తరలించారు. నగరంలోని హైదర్‌గూడలోని అపోలో ఆసుపత్రిలో చేరిన వెంటనే వైద్య బృందం ఆయనకు పలు వైద్య పరీక్షలు నిర్వహించింది. యాంజియోగ్రామ్ చేసి, ఆయనకు స్టెంట్ వేయాలని నిర్ణయించారు. ఆ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ప్రస్తుతం అంబటి రాంబాబు వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రమాదం ఏమీ లేదని డాక్టర్లు వెల్లడించారు. ఈ వార్త తెలియగానే వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే, ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు ప్రకటించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## నాలుగేళ్ల బాలిక కిడ్నాప్ పోలీసుల చొరవతో సుఖాంతం

**విశాఖపట్నం ఆగస్టు 28 ప్రభాతవార్త:** విశాఖ రైల్వే స్టేషన్ బస్టాప్ ఎదురుగా ఉన్న ఫుట్ పాత్ పై నిద్రిస్తున్న నాలుగేళ్ల మైనర్ బాలికను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారని బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలో దిగిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టి, ఘటన జరిగిన తొమ్మిది గంటల్లోనే బాలిక ఆచూకీని గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. అన్నమయ్య జిల్లా రాజంపేట మండలానికి చెందిన సయ్యద్, శివపార్వతి దంపతులు ఈ నెల 23న విజయవాడ నుంచి విశాఖపట్నానికి వచ్చారు. వారి బంధువుల కుమారుడు చైల్డ్ హోమ్ కేర్ లో ఉండటంతో అతడిని చూసేందుకు నగరానికి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. రాత్రి సమయంలో ఉండేందుకు సరైన వసతి లేకపోవడంతో రైల్వేస్టేషన్ బస్టాప్ వద్ద ఫుట్పాత్ పై కుటుంబ సభ్యులు నిద్రించారు. అర్ధరాత్రి 1.40 గంటల సమయంలో పక్కనే నిద్రిస్తున్న నాలుగేళ్ల కుమార్తె కనిపించకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురై 112కు కాల్ చేసి సమాచారం అందించారు.వెంటనే స్పందించిన నైట్ రౌండ్స్ లోని పోలీసులు శ్రీను, రమేష్ తదితరులు రైల్వేస్టేషన్ వద్దకు చేరుకుని బాలిక వివరాలను సేకరించి కేసు నమోదు చేశారు. పోలీసులు రైల్వేస్టేషన్ పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించగా, ఓ యువతి, యువకుడు ద్విచక్రవాహనంపై వచ్చి బాలికను తీసుకెళ్లిన దృశ్యాలు కనిపించాయి. వాటి ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు బాలికను ఎస్.రాయవరం ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించి, అక్కడి నుంచి విశాఖకు తీసుకొచ్చారు. ఈ కేసు వివరాలను శుక్రవారం మధ్యాహ్నం టూటౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కె. లక్ష్మణమూర్తి వెల్లడించారు. బాలికను ఎస్.రాయవరం వరకు తీసుకెళ్లి అక్కడ ఓ మహిళకు అప్పగించినట్లు తెలిపారు. వారి వివరాలతో పాటు గతంలో వారిపై ఏమైనా కేసులు నమోదయ్యాయా అనే కోణంలోనూ విచారణ చేపడుతున్నామని చెప్పారు. ఘటన జరిగిన తొమ్మిది గంటల్లోనే బాలిక ఆచూకీని గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు. బాలికను సురక్షితంగా తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించడంలో కీలకంగా వ్యవహరించిన టూటౌన్ సీఐ బి. అప్పలనాయుడు, ఎస్ఐ మన్మధరావు, ఇతర పోలీసు సిబ్బందిని సీపీ శంఖబ్రత బాగ్చి, ఉన్నతాధికారులు అభినందించారు.

## ఐఆర్‌సిఎస్ వార్షిక సర్వసభ్య సమావేశంలో జిల్లా కలెక్టర్లకు గవర్నర్ గోల్డ్ మెడల్స్

**విజయవాడ, ఆగస్టు 28,ప్రభాతవార్తప్రతినిధి:** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్)లో చేసిన సేవలకు గుర్తింపుగా ఆంధ్రప్రదేశ్‌లోని ఏడుగురు జిల్లా కలెక్టర్లు గవర్నర్ గోల్డ్ మెడల్స్ అందుకోనున్నారు. సెప్టెంబర్ 1న ఉదయం 11 గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనున్న ఐఆర్‌సీఎస్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ పతకాలను ప్రదానం చేయనున్నారు. గోల్డ్ మెడల్స్ స్వీకరించేందుకు ఏడుగురు కలెక్టర్లు వార్షిక సర్వసభ్య సమావేశానికి హాజరయ్యేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. పతకాలు అందుకోనున్న వారిలో పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చాడలవాడ నాగరాణి, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్, కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె. బాలాజీ, కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంద్ర ప్రసాద్, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఉన్నారు. గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నుంచి అందిన సమాచారాన్ని అనుసరించి ఈ అనుమతులు జారీ చేశారు. కలెక్టర్లు సమావేశానికి హాజరయ్యే సమయంలో ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్లు, అదనపు జిల్లా మేజిస్ట్రేట్లు కలెక్టర్ల ప్రస్తుత విధులను నిర్వహించనున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

# దుర్గమ్మ ఆలయంలో వైభవంగా గిరి ప్రదక్షిణ


**ఇంద్రకీలాద్రి, ఆగస్టు 28 ప్రభాతవార్త:** దుర్గమ్మ వెంచేసియున్న పవిత్ర ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షణ శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం ఘాట్ రోడ్డు ఎంట్రెన్స్ వద్ద గల శ్రీ కామధేను అమ్మవారి సన్నిధి వద్ద ఇఒ వికె శీనానాయక్ ప్రత్యేక పూజలు నిర్వహించి, కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. దేవస్థానం స్థానాచార్య వి.శివ ప్రసాద్ శర్మ తదితరులు పూజా కార్యక్రమం నిర్వహించారు. ధర్మ ప్రచారం నిమిత్తం దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంప్రదాయ తప్పెట్లు, కోలాట నృత్యప్రదర్శనలు, భజన సంకీర్తనా గానం వంటి కళా బృందాల కళా ప్రదర్శనలు, మంగళ వాయిద్యముల, వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ గిరి ప్రదక్షిణ ఘాట్ రోడ్ శ్రీ అమ్మవారి గుడి, కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, పాలప్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి నుండి తిరిగి ఇంద్రకీలాద్రి వరకు గిరిప్రదక్షిణ చేరుకుంది. శ్రీ దుర్గా మల్లేశ్వరులు కొలువైన వాహనం ముందు రహదారులను వివిధ ప్రాంతాల్లో స్థానిక మహిళలు పసుపు నీళ్లతో శుద్ధి చేసి, హారతులు, కొబ్బరికాయలు సమర్పించి, జయ జయధ్వానాలు చేస్తుండగా గిరి ప్రదక్షిణ మార్గమంతా భక్తులకు శ్రీ అమ్మవారి కుంకుమ, ప్రసాదంను భక్తులకు దేవస్థానం నుండి అందజేశారు. వేలాది మంది భక్తులు విశేషముగా ఈ కార్యక్రమంలో పాల్గొని, అమ్మవారిని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు అవ్వారు శ్రీనివాసరావు, మన్నే కళావతి తదితరులు పాల్గొన్నారు.

**దుర్గమ్మకి వెండి నివేదన గిన్నెలు**

దుర్గమ్మకి విజయవాడకు చెందిన యలమంచిలి రవేంద్రరావు సుమారు రూ. 4.77 లక్షలు విలువ చేసే 1 కేజీ 835 గ్రాముల బరువు గల వెండి నివేదన గిన్నెలను మొక్కుబడిగా శుక్రవారం చైర్మన్ బొర్రా రాధాకృష్ణకు అందించారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు.

**పంచ హారతుల సేవలో ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి**

దుర్గమ్మకి సాయంసంధ్యాకాలంలో నిర్వహించే పంచహారతుల కార్యక్రమంలో ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ హరీష్ టాండన్ పాల్గొన్నారు. చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఒ వికె శీనా నాయక్ వారికి ప్రసాదములు, శేషవస్త్రం, దుర్గమ్మవారి చిత్రపటం అందించగా పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు.



**దుర్గమ్మ సేవలో మారిషస్ మంత్రి**

దుర్గమ్మని శుక్రవారం మారిషస్ పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేషన్ రిఫార్మ్స్ మంత్రి లక్ష్మణ పెంటయ్య దర్శించుకున్నారు.

# శ్రీలంక మ్యాచ్ చేజార్చుకున్న భారత్




## బెడిసి కొట్టిన ఫాలోఆన్ వ్యూహం

**కొలంబో:** శ్రీలంక మ్యాచ్‌ను టీమిండియా చేజేతులారా చేజార్చుకుంది. టెస్ట్ క్రికెట్‌లో ప్రధాన బ్యాటర్లను ఔట్ చేయడం ఎంత ముఖ్యమో చివర్లో వచ్చే టెయిలెండర్లను ఔట్ చేయడం అంతే కీలకమనే విషయం భారత్‌కు ఇప్పుడు బాగా తెలిసొచ్చింది. కొలంబో రెండోటెస్ట్‌లో నాలుగు రోజులు పూర్తి ఆధిపత్యం చెలాయించిన టీమిండియా శ్రీలంక తోకను కత్తిరించలేక విజయాన్ని వదులుకుంది. లంక టెయిలెండర్ల అద్వితీయమైన పోరాటంతో డ్రాతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ముఖ్యంగా సోనాల్ దినుష 2 శతకాలతో భారత్ విజయానికి అడ్డుగా నిలిచాడు. అలాగే ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 503/9 భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. అనంతరం లంకను 290 పరుగులకు ఆలౌట్ చేసింది. వర్ష పరిస్థితులతో ఆ జట్టు ఫాలోఆన్ ఆడించి ఆ తర్వాత లక్ష్యాన్ని ఛేదించాలనుకుంది. కానీ ఈ వ్యూహం బెడిసి కొట్టింది.

ఫాలో ఆన్ ఆడించకుండా టీమిండియా ఓ సెషన్ పాటు దూకుడుగా బ్యాటింగ్ చేసి శ్రీలంక ముందు 350+ టార్గెట్ పెట్టి ఉంటే ఫలితం మరోలా ఉండేది. టార్గెట్ ఛేజ్ చేయాలని ఒత్తిడిలో శ్రీలంక బ్యాటర్లు తప్పులు చేసే అవకాశం ఉండేది. నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్లు పడగొట్టింది. ఆఖరి రోజు తొలి సెషన్‌లోనే చివరి నాలుగు వికెట్లు తీయడం భారత్‌కు కష్టం కాదనుకున్నారు. కానీ ఫామ్‌లో ఉన్న సోనాల్ దినుషాతో పాటు కేశర నువాంత అద్భుతంగా పోరాడారు. బౌలింగ్‌కు అనుకూలంగా ఉండే తొలి సెషన్‌లో ఇద్దరూ 30 ఓవర్లకు పైగా ఆడి 100 పరుగులు జోడించారు. ఇక్కడే భారత్ విజయవకాశాలు దెబ్బతిన్నాయి. ఈ సెషన్ ఆరంభంలోనే కేశరను ఔట్ చేసి ఉంటే ఫలితం మరోలా ఉండేది. చివరకు రెండో సెషన్ ఆరంభంలో కేశర నువాంతను ఔట్ చేశారు. ఆ వెంటే ప్రభాత్ జయసూర్య కూడా ఔటవ్వడంతో లంక ఇన్నింగ్స్ ముగుస్తుందని అంతా అనుకున్నా, సోనాల్‌కు తోడుగా లాహిరు ఉడానా నిలబడ్డాడు.

90 బంతులు ఆడి భారత బౌలర్ల సహనాన్ని పరీక్షించాడు. సోనాల్‌తో కలిసి 28 ఓవర్ల పాటు క్రీజులో నిల్చొని 47 పరుగుల భాగస్వామ్యాన్ని అందించడంతో భారత్ విజయవకాశాలు నీరుగారాయి. కనీసం ఉడానాను ఔట్ చేసినా ఫలితం ఇంకోలా ఉండేది. ఇక ఆఖరి వికెట్‌ను భారత్ త్వరగా తీయలేకపోయింది. అసితా ఫెర్నాండో 24 బంతులు ఎదుర్కొని దినుషకు అండగా నిలవడంతో మ్యాచ్ డ్రా కావాల్సి వచ్చింది. 18 ఓవర్ల ఆట మాత్రమే మిగిలి ఉండటం, మ్యాచ్ ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో గత్యంతరం లేక భారత్ డ్రాకు అంగీకరించింది.



## గ్రాండ్ చెస్ ఛాంపియన్‌గా ప్రజ్ఞానంద

### టైటిల్ సాధించిన తొలి భారతీయుడిగా రికార్డు

**సెయింట్ లూయిస్:** గ్రాండ్ చెస్ 2026 ఛాంపియన్‌గా రమేష్‌బాబు ప్రజ్ఞానంద నిలిచాడు. అమెరికాలోని సెయింట్ లూయిస్ చెస్ క్లబ్‌లో శుక్రవారం జరిగిన ఫైనల్‌లో ఫాబియానో కరువానాను 15-13తో ఓడించి, గ్రాండ్ చెస్ టూర్ టైటిల్ గెలుచుకున్న తొలి భారతీయుడిగా ప్రజ్ఞానంద చరిత్ర సృష్టించాడు. ఈ సీజన్ ముగింపు ఈవెంట్‌లో, క్లాసికల్ విభాగంలో వెనుకబడిన తర్వాత 21 యేళ్ల ప్రజ్ఞానంద అద్భుతంగా పుంజుకుని ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నాడు. ప్రజ్ఞ ఫైనల్‌ను క్లాసికల్ చెస్‌లో చరువానా చేతిలో 3-9 తేడాతో ఓటమితో ప్రారంభించినప్పటికీ, ర్యాపిడ్ విభాగంలో ఆధిపత్యం ప్రదర్శించి 8-0 తేడాతో గెలిచాడు. ఆ తర్వాత ఈ భారత ఆటగాడు బ్లిట్జ్ విభాగంలో చరువానాను 4-4తో నిలువరించి, మొత్తంగా 15-13 తేడాతో విజయాన్ని కైవసం చేసుకున్నాడు. స్కోరింగ్ విధానం ప్రకారం, సాంప్రదాయ పద్ధతిలో గెలిస్తే ఆరు పాయింట్లు, డ్రా అయితే మూడు పాయింట్లు లభిస్తాయి. అదేవిధంగా, ర్యాపిడ్ పద్ధతిలో గెలిస్తే నాలుగు పాయింట్లు, డ్రా అయితే రెండు పాయింట్లు లభిస్తాయి. బ్లిట్జ్‌లో, గెలిస్తే రెండు పాయింట్లు, డ్రా అయితే ఒక పాయింట్ లభిస్తుంది. కాగా తొలి సెమీఫైనల్‌లో కీమర్‌ను 19-9 తేడాతో ఓడించి ప్రజ్ఞానంద ఫైనల్‌లో స్థానం ఖాయం చేసుకున్నాడు. మరో సెమీఫైనల్‌లో కరువానా, వెస్లీ సోపై 18-12 తేడాతో విజయం సాధించాడు.



## డైమండ్ లీగ్.. ఫైనల్స్‌కు నీరజ్ చోప్రా

**స్విట్జర్లాండ్:** డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు నీరజ్ చోప్రా అర్హత సాధించాడు. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత నీరజ్ చోప్రా, సెప్టెంబర్ 4, 5 తేదీలలో బ్రస్సెల్స్‌లో జరగనున్న డైమండ్ లీగ్ ఫైనల్స్‌లోకి అనూహ్యంగా ప్రవేశించాడు. జ్యూరిచ్ డైమండ్ లీగ్‌తో సహా, మొత్తం ఐదు మీటింగ్‌లలో మూడింటిలో పోటీపడకపోయినప్పటికీ, నీరజ్ ఆరుగురు సభ్యుల ఫైనల్‌కు చేరుకున్నాడు. కామన్వెల్త్ గేమ్స్ ఛాంపియన్, శ్రీలంకకు చెందిన రుమేష్ తరంగ పతిరాగే, 92.07 మీటర్ల భారీ త్రోతో జూరిచ్ డైమండ్ లీగ్‌ను గెలుచుకున్నాడు. ఈ యేడాది జూన్‌లో రోమ్ డైమండ్ లీగ్‌లో అతను ప్రదర్శించిన 92.62 మీటర్ల ప్రదర్శన కంటే ఇది కొద్దిగా తక్కువ కాగా, ఇది అతని రెండవ అత్యుత్తమ త్రో. తాజాగా జరిగిన లౌసాన్ డైమండ్ లీగ్‌లో నీరజ్ 88.05 మీటర్ల త్రోతో రెండవ స్థానంలో నిలిచాడు, ఇది ఈ సీజన్‌లో అతని అత్యుత్తమ ప్రదర్శన. అతను దోహా డైమండ్ లీగ్‌లో 85.69 మీటర్ల అత్యుత్తమ ప్రదర్శనతో నాల్గవ స్థానంతో తన సీజన్‌ను ప్రారంభించాడు. జూలైలో కామన్వెల్త్ గేమ్స్‌లో రజతం గెలుచుకున్న ఈ భారత జావెలిన్ త్రోయర్, మొత్తం 12 పాయింట్లతో ఆరవ స్థానంలో నిలిచాడు. ప్రతి డైమండ్ లీగ్ మీటింగ్‌లో, పురుషుల జావెలిన్ త్రోలో మొదటి ఎనిమిది స్థానాల్లో నిలిచిన వారికి, మొదటి స్థానానికి ఎనిమిది పాయింట్ల నుండి ఎనిమిదో స్థానానికి ఒక పాయింట్ వరకు, ఒక స్లైడింగ్ స్కేల్ పద్ధతిలో పాయింట్లు కేటాయించబడతాయి.



## వెస్టిండీస్ గడ్డపై పాక్ ఓపెనర్ విధ్వంసం

### జమైకా కింగ్స్‌మెన్ గెలుపు

**న్యూఢిల్లీ:** కరేబియన్ ప్రీమియర్ లీగ్-2026లో జమైకా కింగ్స్‌మెన్ తిరిగి గెలుపు బాట పట్టింది. వార్నర్ పార్క్ వేదికగా సెయింట్ కిడ్స్ అండ్ నెవిస్ పేట్రియాట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 11 పరుగుల తేడాతో జమైకా విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన జమైకా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు నష్టానికి 182 పరుగుల స్కోర్ సాధించింది. జమైకా ఇన్నింగ్స్‌లో పాక్ స్టార్ ఓపెనర్ సైమ్ అయూబ్ విధ్వంసకర సెంచరీతో చెలరేగాడు. మిగిలిన బ్యాటర్లు పెద్దగా ఆకట్టుకోలేకపోయినప్పటికీ అయూబ్ మాత్రం ప్రత్యర్థి బౌలర్లను ఉతికారేశాడు. 58 బంగుల్లో 6 ఫోర్లు, 8 సిక్స్‌లతో 102 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. సెయింట్ కిడ్స్ బౌటర్లలో నసీం షా, హాసరంగా, మెకాయ్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్య ఛేదనలో సెయింట్ కిడ్స్ 6 వికెట్లు నష్టానికి 171 పరుగులకే పరిమితమైంది. అండ్రి ఫ్లెచర్ 55 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలువగా, జాసన్ హోల్డర్ 34 పరులు, దసన్ శునక 35 పరుగులు చేసి చివర్లో మెరుపులు మెరిపించారు. అయినప్పటికీ మిగిలిన ప్లేయర్లు నుండి పెద్దగా సహకారం లేకపోవడంతో పేట్రియాట్స్ ఓటమి చవిచూసింది.

## బుడాపెస్ట్ ఓపెన్.. ఫైనల్‌కు వేలవన్



**హంగేరి:** బుడాపెస్ట్ ఓపెన్ స్క్వాష్ సెమీఫైనల్ పోరులో, భారత ఆటగాడు వేలవన్ సెంథిల్‌కుమార్ తన స్వదేశీయుడైన వీర్ చోత్రానిపై విజయం సాధించి ఫైనల్‌కు చేరుకున్నాడు. ఫైనల్‌లో సెంథిల్‌కుమార్, స్థానిక అభిమానుల ఫేవరెట్ అయిన బాలాజ్ ఫార్కాస్‌తో తలపడనున్నాడు.

హంగేరి రాజధానిలో శుక్రవారం జరిగిన సెమీ ఫైనల్స్‌లో, ప్రపంచ ర్యాంకింగ్‌లో 54వ స్థానంలో ఉన్న ఎనిమిదో సీడ్ సెంథిల్‌కుమార్, మూడో సీడ్ చోత్రానీని 91-1, 11-8, 11-7, 1-11, 12-10 తేడాతో ఓడించి తన 15వ పిఎస్ఎ టూర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. క్వార్టర్ ఫైనల్‌లో, సెంథిల్‌కుమార్ మలేషియాకు చెందిన ప్రపంచ 18వ ర్యాంకర్ మరియు టాప్ సీడ్ అయిన ఈన్ యోవ్ ఎన్‌జిని 11-2, 11-9, 11-8 తేడాతో ఓడించి, చోత్రానితో సెమీఫైనల్ పోరుకు సిద్ధమయ్యాడు. ఈ పర్యటనలో సెంథిల్‌కుమార్, ఫార్కాస్‌లకు ఇది మూడో ముఖాముఖి కానుంది. 2019లో జరిగిన పోరులో హంగేరి ఆటగాడు విజయం సాధించగా, 2024లో జరిగిన పోరులో సెంథిల్‌కుమార్ గెలుపొందాడు.

# భారీగా పుంజుకున్న వెండి ధరలు



## బంగారం కూడా పైపైకి

**ముంబయి, ఆగస్టు 28:** దేశీయ మార్కెట్లో వెండి ధరలు శుక్రవారం రోజు కనిష్ఠ స్థాయి నుంచి భారీగా పుంజుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో వెండి ధరలు బలంగా పెరగడం, కొనుగోళ్ల జోరు కొనసాగడం ఇందుకు ప్రధాన కారణాలుగా ఉన్నాయి. ఎంసిఎక్స్‌లో వెండి ధర కిలోకు రూ.2,699 పెరిగి రూ.2,43,350కి చేరింది. ఇంట్రాడేలో రూ.2,44,950 గరిష్ఠాన్ని తాకింది. ఇది గత ముగింపు ధరతో పోలిస్తే 1.78 శాతం వరకు పెరిగింది. అదే సమయంలో రోజువారీ కనిష్ఠ స్థాయి రూ.2,39,049 నుంచి వెండి ధర రూ.5,901 మేర ఎగబాకింది.మరోవైపు ఎంసిఎక్స్‌లో బంగారం ధర 10 గ్రాములకు రూ.324 పెరిగి రూ.1,59,320కి చేరింది. ఇంట్రాడేలో రూ.1,59,741 గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది.బులియన్‌కు సానుకూల పరిస్థితులుబంగారం, వెండి ధరలపై భవిష్యత్తు అంచనాలు ఇప్పటికీ బుల్లిష్‌గా ఉన్నాయని ట్రేడర్ల అంచనా. ఇటీవల ధరలు తగ్గిన నేపథ్యంలో మళ్లీ కొనుగోళ్లు పెరుగుతున్నాయని కేడియా అడ్వైజరీ డైరెక్టర్ అజయ్ కేడియా తెలిపారు.ముడి చమురు ధరలు తగ్గడం వల్ల ద్రవ్యోల్బణంపై ఆందోళనలు తగ్గాయి. దీంతో అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపుపై ఉన్న భయాలు కూడా సడలాయి. అమెరికా డాలర్ విలువ 99 స్థాయి దిగువకు పడిపోవడం విలువైన లోహాల ఆకర్షణను పెంచింది" అని ఆయన పేర్కొన్నారు.కేంద్ర బ్యాంకులు నిరంతరం బంగారం కొనుగోలు చేయడం, గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి పెట్టుబడులు పెరగడంకూడా బంగారం, వెండి ధరలకు మద్దతుగా నిలుస్తున్నాయని కేడియా తెలిపారు.ఇక వడ్డీ రేట్ల భవిష్యత్ దిశపై స్పష్టత కోసం ఇన్వెస్టర్లు జాక్సన్ హోల్ సింపోజియంలో అమెరికా ఫెడ్ చైర్ కెవిన్ వార్ష్ ప్రసంగంపై దృష్టి సారిస్తున్నారు. మోనార్క్ పీఎంఎస్ అంచనా ప్రకారం 2026 చివరి నాటికి బంగారం ధర ఔన్సుకు 4,300-4,700 డాలర్లు, వెండి ధర 70-85 డాలర్ల మధ్య ఉండొచ్చని తెలిపింది. ఈ బేస్ కేస్‌కు 55 శాతం సంభావ్యతను కేటాయించింది.బుల్లిష్ పరిస్థితుల్లో మాత్రం బంగారం ఔన్సుకు 5,000-5,600 డాలర్లకు, వెండి 95-120 డాలర్లకు చేరే అవకాశం ఉందని మోనార్క్ పీఎంఎస్ పేర్కొంది. ప్రముఖ నిపుణులు అజయ్ కేడియా ప్రకారం ఎంసీఎక్స్ బంగారానికి రూ.1,56,000 వద్ద కీలక మద్దతు ఉంది. రూ.1,67,000 వద్ద నిరోధ స్థాయి ఉంది. ఈ స్థాయిని అధిగమిస్తే బంగారం ధర రూ.1,72,000ను కూడా దాటే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు.

## 407% రిటర్నులు తెచ్చిన 12 ఐపిఒలు

**ముంబయి,ఆ గస్టు 28:** భారతీయ ప్రైమరీ మార్కెట్లోకి కొత్తగా లిస్ట్ అయిన కంపెనీలు తమ ఇన్వెస్టర్లకు అద్భుతమైన లాభాలను అందిస్తున్నాయి. నిఫ్టీ ఐపిఒ ఇండెక్స్ 2415 పాయింట్ల వద్ద 52 వారాల గరిష్ఠ స్థాయిని తాకింది. ఈ నేపథ్యంలో గత ఏడాది కాలంలో మార్కెట్లోకి వచ్చిన 12 కంపెనీల ఐపిఒలు ఏకంగా 407 శాతం వరకు లాభాలు అందించింది మల్టీబ్యాగర్లుగా మారాయి. అందులో ఆదిత్య ఇన్ఫోటెక్, రూబికాన్ రీసెర్చ్ వంటి ప్రముఖ స్టాక్స్ ఉన్నాయి. ఈ యేడాదిలో ఇప్పటి వరకు 56 మెయిన్ బోర్డ్ ఐపిఒలు విజయవంతంగా పూర్తి కాగా ఆ కంపెనీ మొత్తంగా రూ.82,895 కోట్ల మేర మార్కెట్ నుంచి సమీకరించాయి. నిఫ్టీ 50 బెంచ్ మార్క్ ఇండెక్స్ హెచ్చుతగ్గులకు గురైనప్పటికీ, నిఫ్టీ ఐపిఒ ఇండెక్స్ మాత్రం 2415 ఇంట్రాడే పాయింట్లకు చేరుకుని 52 వారాల గరిష్ఠాలను నమోదు చేసింది. సీపీ ప్లస్ బ్రాండ్ మాతృ సంస్థ ఆదిత్య ఇన్ఫోటెక్ షేరు ధర రూ.675 ఆఫర్ ధరతో పోలిస్తే మార్కెట్లో బలమైన లాభాలతో ర్యాలీ తీసి అగ్రస్థానంలో నిలిచింది. గత కొద్ది నెలల్లో లిస్ట్ అయిన స్టాక్స్‌లో ఆదిత్య ఇన్ఫోటెక్ అగ్రస్థానంలో నిలిచింది. ఇష్యూ ధర రూ.675తో పోలిస్తే 407 శాతం మేర పెరిగింది. ఈ స్టాక్ 2025 ఆగస్టు 5వ తేదీన రూ.1018 వద్ద లిస్ట్ అయింది. ఇప్పుడు ఆగస్టు 24, 2026 నాటికి రూ.3419 వద్దకు చేరింది. రూబికాన్ రీసెర్చ్ కంపెనీ రెండో స్థానంలో ఉంది. ఐపిఒ ఇష్యూ ధర రూ.485తో పోలిస్తే 266 శాతం మేర రాబడి అందించింది. ఈ స్టాక్ 2025, అక్టోబర్ 16న రూ.620.10 వద్ద లిస్ట్ అయింది. ఆ తర్వాత ఇప్పుడు రూ.1776.10 వద్ద ట్రేడవుతోంది. ఓమ్నిటెక్ ఇంజనీరింగ్ కంపెనీ 162 శాతం లాభాలు అందిచింది.

## జూలైలో పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి 6.7 శాతం



**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** దేశ పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి జూలైలో వార్షిక ప్రాతిపదికన 6.7 శాతంగా నమోదైంది. మార్కెట్ అంచనా వేసిన 6 శాతం కంటే ఇది అధికం. శుక్రవారం విడుదలైన అధికారిక గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. జూన్‌లో తొలుత 7.3 శాతంగా నమోదైన పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి జూలైలో కొంత మందగించినప్పటికీ, జూన్ గణాంకాలను తాజాగా భారీగా సవరించి 8.8 శాతంగా నిర్ణయించారు.సవరించిన జూన్ గణాంకాలు పారిశ్రామిక రంగంలో వృద్ధి ఊహించిన దానికంటే బలంగా ఉన్నట్లు సూచిస్తున్నాయి. జూలైలో వృద్ధి వేగం కొంత తగ్గినా పారిశ్రామిక కార్యకలాపాలు ఆరోగ్యకరమైన స్థాయిలో కొనసాగినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో అత్యధిక వాటా కలిగిన తయారీ రంగం జూలైలో ప్రధాన వృద్ధి చోదకంగా నిలిచింది. తయారీ ఉత్పత్తి వార్షిక ప్రాతిపదికన 7.3 శాతం పెరిగింది. జూన్‌లో ఈ వృద్ధి 7.8 శాతంగా ఉంది. మైనింగ్ ఉత్పత్తి 0.9 శాతం పెరగగా, నీటి సరఫరా ఉత్పత్తి 7.4 శాతం వృద్ధి చెందింది. జూన్‌లో మైనింగ్ వృద్ధి 1 శాతం, నీటి సరఫరా వృద్ధి 6.1 శాతంగా నమోదయ్యాయి. తయారీ రంగంతో పోలిస్తే మైనింగ్ రంగం వృద్ధి చాలా తక్కువగా ఉండటం వల్ల మొత్తం పారిశ్రామిక వృద్ధికి తయారీ రంగమే కీలక ఆధారంగా కొనసాగుతున్న విషయం వెల్లడవుతోంది. పెట్టుబడులకు సంబంధించిన కార్యకలాపాల్లోనూ బలమైన వృద్ధి కనిపించింది. జూలైలో క్యాపిటల్ గూడ్స్ ఉత్పత్తి 16.1 శాతం పెరిగింది. జూన్‌లో ఇది 14.2 శాతంగా ఉంది.ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ గూడ్స్ ఉత్పత్తి 6.9 శాతం, ఇంటర్మీడియట్ గూడ్స్ ఉత్పత్తి 10 శాతం పెరిగాయి. జూన్‌లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ కన్‌స్ట్రక్షన్ గూడ్స్ ఉత్పత్తి 7.5 శాతం వృద్ధి చెందింది.వినియోగ వస్తువుల విభాగంలోనూ మిశ్రమ ఫలితాలు నమోదయ్యాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఉత్పత్తి జూలైలో 10.5 శాతం పెరిగింది.

# రెండు రోజుల నష్టాలకు బ్రేక్




## లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఆగస్టు 28:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు వరుసగా రెండు సెషన్ల నష్టాలకు శుక్రవారం బ్రేక్ వేశాయి. ఐటీ షేర్లలో భారీ కొనుగోళ్లు మార్కెట్లకు ప్రధానంగా అండగా నిలిచాయి. ఎంపిక చేసిన బ్యాంకింగ్, కన్స్యూమర్ షేర్లలో బలహీనత ఉన్నప్పటికీ ఐటీ, ఫార్మా, మెటల్ షేర్లలో ర్యాలీతో బెంచ్‌మార్క్ సూచీలు పుంజుకున్నాయి. ఎన్విడియా మెరుగైన ఫలితాలు ప్రకటించడంతో ప్రపంచ టెక్నాలజీ షేర్లలో సానుకూల సెంటిమెంట్ నెలకొనడం కూడా దేశీయ ఐటీ స్టాక్స్‌కు కలిసొచ్చింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ కెవిన్ వార్ష్ ఈరోజు కీలక ప్రసంగం చేయనున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. జాక్సన్ హోల్, వ్యోమింగ్‌లో జరుగుతున్న వార్షిక కాన్సాస్ సిటీ ఫెడ్ ఆర్థిక సదస్సులో వార్ష్ తొలిసారిగా ఫెడ్ చైర్మన్ హోదాలో కీలక ప్రసంగం చేయనున్నారు. అమెరికా ద్రవ్య విధానంపై ఆయన చేసే వ్యాఖ్యలపై మార్కెట్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. మరోవైపు ముడిచమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది.330 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్‌శుక్రవారం బీఎస్ఇ సెన్సెక్స్ 330.92 పాయింట్లు లేదా 0.43 శాతం లాభపడి 77,264.51 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 84.80 పాయింట్లు లేదా 0.35 శాతం పెరిగి 24,175.65 వద్ద స్థిరపడింది. అంతకుముందు రెండు సెషన్లలో సెన్సెక్స్ 0.93 శాతం, నిఫ్టీ 1 శాతం చొప్పున నష్టపోయాయి. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.16 శాతం, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.33 శాతం చొప్పున లాభపడ్డాయి.మార్కెట్‌లో కొనుగోళ్ల జోరు కనిపించింది. బిఎస్ఇలో 2,385 షేర్లు లాభపడగా, 1,932 షేర్లు నష్టపోయాయి. మరో 248 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. కమొడిటీ మార్కెట్లో అక్టోబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 27 సెంట్లు తగ్గి 89.43 డాలర్లకు చేరింది.ఫారెక్స్ మార్కెట్లో రూపాయి స్వల్పంగా బలపడింది. గత సెషన్‌లో 95.4400 వద్ద ముగిసిన రూపాయి శుక్రవారం 95.4075 వద్ద కొనసాగింది. భారత్ 10 యేళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ రాబడి 6.851 శాతం నుంచి 6.916 శాతానికి పెరిగింది. ఎంసిఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ 0.48 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,59,765కు చేరాయి. టెంప్‌సెన్స్ ఇన్‌స్ట్రుమెంట్స్ భారీ లిస్టింగ్ షేరు శుక్రవారం బీఎస్ఈలో రూ.586.80 వద్ద ముగిసింది. ఇది ఇష్యూధర రూ.300తో పోలిస్తే 95.60 శాతం ప్రీమియం. స్టాక్ మార్కెట్‌లో రూ.631.20 వద్ద లిస్టయింది. ఇష్యూ ధరతో పోలిస్తే ఇది 110.4 శాతం ప్రీమియం. ఇంట్రాడేలో రూ.635 గరిష్ఠాన్ని, రూ.551.20 కనిష్ఠాన్ని తాకింది. బిఎస్ఇలో కంపెనీకి చెందిన 47.68 లక్షలకు పైగా షేర్లు చేతులు మారాయి. ఐటీ షేర్లలో భారీ ర్యాలీశుక్రవారం ఐటీ షేర్లు భారీగా లాభపడ్డాయి. నిఫ్టీ ఐటీ సూచీ 3.51 శాతం పెరిగింది. రంగాల వారీగా కోఫోర్జ్ 5.93 శాతం లాభంతో ముందంజలో నిలిచింది. ఎల్‌టీఐమైండ్‌ట్రీ 4.73 శాతం, టిసిఎస్ 4.16 శాతం, పర్సిస్టెంట్ సిస్టమ్స్ 3.91 శాతం, టెక్ మహీంద్రా 3.53 శాతం చొప్పున పెరిగాయి.ఇన్ఫోసిస్ 2.99 శాతం, ఒరాకిల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సాఫ్ట్‌వేర్ 2.83 శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 2.66 శాతం, ఎంఫసిస్ 1.72 శాతం చొప్పున లాభపడ్డాయి.విప్రో షేరు 2.58 శాతం పెరిగింది. ఎంటర్‌ప్రైజ్‌స్థాయిలో ఏజెంటిక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగాన్ని వేగవంతం చేసేందుకు గూగుల్ క్లౌడ్‌తో భాగస్వామ్యాన్ని విస్తరిస్తున్నట్లు కంపెనీ ప్రకటించడం ఇందుకు కారణం.తేజస్ నెట్‌వర్క్స్ షేరు 7.63 శాతం దూసుకెళ్లింది. బీఎస్ఎన్ఎల్ 4జీ మొబైల్ నెట్‌వర్క్ కోసం పరికరాల సరఫరాకు టీసీఎస్ నుంచి లెటర్ ఆఫ్ ఇంటెంట్ అందుకున్నట్లు తేజస్ నెట్‌వర్క్స్ వెల్లడించింది. ఈ వార్తల నేపథ్యంలో టిసిఎస్ షేరు కూడా 4.09 శాతం లాభపడింది.గ్రేట్ ఈస్టర్న్ షిప్పింగ్ బైబ్యాక్‌తో షేరు 1.70 శాతం పెరిగింది. ఓపెన్ మార్కెట్ మార్గంలో గరిష్ఠంగా రూ.1,530 ధరకు రూ.900 కోట్ల వరకు షేర్ల బైబ్యాక్ చేయడానికి కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది.

## ఆల్‌టైమ్ గరిష్ఠానికి ఫారెక్స్ ఖజానా



### 728.328 బిలియన్ డాలర్లకు చేరిక

**న్యూఢిల్లీ, ఆగస్టు 28:** భారత విదేశీ మారక నిల్వలు ఆల్ టైమ్ గరిష్ఠానికి చేరుకున్నాయి. ఆగస్టు 21తో ముగిసిన వారంలో దేశ ఫారెక్స్ నిల్వలు 12.422 బిలియన్ డాలర్లు పెరిగి 729.328 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు రిజర్వ్ బ్యాంకు శుక్రవారం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు వారంలోనూ ఫారెక్స్ నిల్వలు 9.905 బిలియన్ డాలర్లు పెరిగి 716.907 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. తాజా పెరుగుదలతో ఈ యేడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో నమోదైన 728.494 బిలియన్ డాలర్ల రికార్డు బద్దలైంది. మధ్యప్రాచ్యంలో ఘర్షణలు ప్రారంభమైన అనంతరం భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరగడంతో రూపాయి విలువపై ఒత్తిడి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆర్‌బిఐ విదేశీ మారక మార్కెట్‌లో జోక్యం చేసుకుంటూ డాలర్ల విక్రయాలు చేపట్టడంతో ఫారెక్స్ నిల్వలు వరుసగా కొన్ని వారాలపాటుతగ్గాయి. తాజాగా పరిస్థితులు మెరుగుపడటంతో నిల్వలు మళ్లీ రికార్డు స్థాయికి చేరుకున్నాయి.9.482 బిలియన్ డాలర్లు పెరిగిన ఎఫ్‌సీఎఫారెక్స్ నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు (ఎఫ్‌సీఏ) ఈ వారంలో 9.482 బిలియన్ డాలర్లు పెరిగి 591.333 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.డాలర్లలో లెక్కించే ఎఫ్‌సిఎ విలువలో యూరో, పౌండ్, యెన్ వంటి అమెరికాయేతర కరెన్సీల విలువల్లో చోటుచేసుకునే పెరుగుదల లేదా తగ్గుదల ప్రభావం కూడా ఉంటుంది. బంగారం నిల్వల్లోనూ భారీ పెరుగుదదేశ బంగారం నిల్వల విలువ కూడా ఈ వారంలో 2.801 బిలియన్ డాలర్లు పెరిగి 114.218 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అంతర్జాతీయ ద్రవ్య నిధి వద్ద భారత రిజర్వ్ పొజిషన్ 26 మిలియన్ డాలర్లు పెరిగి 4.925 బిలియన్ డాలర్లకు చేరుకుంది.ఇక ప్రత్యేక డ్రాయింగ్ రైట్స్ 112 మిలియన్ డాలర్లు పెరిగి 18.852 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దేశంలోకి విదేశీ మారక ప్రవాహాలను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ గత నెలలో పలుచర్యలు చేపట్టాయి. ఇందులో ఎఫ్‌సీఎన్ఆర్ (బీ) డిపాజిట్లకు సంబంధించిన చర్యలు కూడా ఉన్నాయి.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | శనివారం 29 ఆగస్టు 2026 | I


# పి4 కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలి- సీఎం

**పి 4 పై అధికారులకు కలెక్టర్ కీర్తి చేకూరి దిశ నిర్దేశం**

**రాజమహేంద్రవరం సిటీ ,ఆగస్టు 28 (ప్రభాతవార్త)** అమరావతి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం నియోజకవర్గాల వారీగా పి 4 కార్యక్రమం పురోగతిపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాజమహేంద్రవరం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి సిపిఓ ఎల్ అప్పలకొండ నిడదవోలు నియోజకవర్గం విజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిడదవోలు నియోజకవర్గంలో పి 4 కార్యక్రమం ద్వారా చేపడుతున్న వివిధ అభివృద్ధి సంక్షేమ జీవనోపాధి నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని ముఖ్యమంత్రికి వివరించారు. నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా పేదరిక రహిత ఆంధ్ర ప్రదేశ్ నిర్మాణ లక్ష్యంగా పి 4 కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వంతోపాటు ప్రైవేట సంస్థలు దాతలు స్వచ్ఛంద సంస్థలు ప్రజలను భాగస్వాములను చేస్తూ పేద కుటుంబాల అవసరాలను గుర్తించి వాటికి తగిన పరిష్కారాలను అందించే విధంగా నియోజకవర్గం ఉండాలని సూచించారు. నియోజకవర్గస్థాయిలో విజిలెన్స్ సమీక్ష ప్రజా ఫిర్యాదుల పరిష్కార పర్యవేక్షణ వివిధ శాఖల మధ్య సమన్వయం కే పి ఐ ఎస్ పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు సుధీర్ కుమార్ వివరించారు. పి 4 కార్యక్రమం కింద గుర్తించిన కుటుంబాలు కమ్యూనిటీల అవసరాల ను శాఖల వారిగా సమన్వయం చేసుకొని వేగంగా పరిష్కరించాలని కలెక్టర్




అధికారులను ఆదేశించారు. పి 4 ను కేవలం మౌలిక వసతుల కల్పనకే పరిమితం చేయకుండా జీవనోపాధి నైపుణ్యాభివృద్ధి ఉపాధి మహిళా సాధికారత విద్యా ఆరోగ్యం పారిశుద్ధ్యం వంటి అంశాలకు అనుసంధానం చేయాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో చేపడుతున్న కార్యక్రమాలకు సంబంధించిన స్పష్టమైన కార్యచరణ ప్రణాళిక రూపొందించి నిర్దేశిత లక్ష్యాల మేరకు పురోగతి సాధించేలా ప్రజలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సిపిఓ ఎల్ అప్పలకొండ డిఐఓ శ్రీకాంత్ రామన్ జిల్లా అభివృద్ధి అధికారి కే రత్నకుమారి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రంగురాళ్ల కోసం రిజర్వ్ ఫారెస్ట్‌లో తవ్వకాలు కొత్త వ్యూహంతో అక్రమార్కులు!

**అడ్డతీగల, ఆగస్టు 28, ప్రభాతవార్త** అడ్డతీగల మండలంలోని తపసి కొండ రిజర్వ్ ఫారెస్ట్ పరిసర ప్రాంతాల్లో రంగురాళ్ల తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దుప్పలపాలెం గ్రామానికి చెందిన పోడురు వారి మకాం సమీపంలోని గొడ్డలి క్వారీ ప్రాంతంలో కొంతమంది అక్రమంగా రంగురాళ్లను తవ్వుతున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. గతంలో రంగురాళ్ల కోసం తవ్వకాలు జరిపిన అనంతరం భారీ గోతులను అలాగే వదిలేయడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందేది. దీంతో అధికారులు ఆయా ప్రాంతాలను గుర్తించి గోతులను పూడ్చడంతోపాటు కొంతకాలం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసేవారు. అయితే ప్రస్తుతం తవ్వకందారులు వ్యూహం మార్చినట్లు తెలుస్తోంది.





**తవ్విన గోతులను మళ్లీ మట్టితో పూడ్చివేత**

అధికారులకు అనుమానం రాకుండా తవ్వకాలు పూర్తయిన వెంటనే గోతులను తవ్వకందారులే మట్టితో పూడ్చివేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అనంతరం అనువైన సమయంలో మళ్లీ అదే ప్రాంతంలో తవ్వకాలు కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారులు సమాచారం మేరకు ప్రాంతాన్ని పరిశీలించే సమయానికి గోతులు కనిపించకపోవడంతో అక్కడ తవ్వకాలు జరగడం లేదని భావించి నిఘా తొలగిస్తున్నారని, ఇదే అవకాశంగా చేసుకుని అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

**వర్షాలను సైతం అవకాశంగా మార్చుకుంటున్నారా?**

ఇటీవల అడపాదడపా వర్షాలు కురుస్తుండటంతో కొండవాగుల్లో నీటి నిల్వలు ఏర్పడుతున్నాయి. ఇదే సమయంలో మల్లవరం మావిల్లు ప్రాంతంలోని ప్లాంటేషన్ క్వారీ వద్ద కూడా రంగురాళ్ల కోసం తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం. తవ్వకాలకు వెళ్లే వారికి కొంతమంది దళారీలు అక్కడికక్కడే భోజనం, ఇతర తినుబండారాలను అందిస్తున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది.

**అధికారుల తనిఖీలు... గోతుల పూడ్చివేత**

మూడు రోజుల క్రితం రంగురాళ్ల తవ్వకాలపై సమాచారం అందడంతో స్థానిక అటవీశాఖ అధికారులు సంబంధిత ప్రాంతాన్ని పరిశీలించినట్లు తెలిసింది. అక్కడ గుర్తించిన తవ్వకాల గోతులను పూడ్చివేసినట్లు సమాచారం.అయితే కేవలం గోతులను పూడ్చివేయడంతో సమస్య పరిష్కారం కాదని, తవ్వకాలు నిర్వహిస్తున్న వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని గిరిజన సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

**అటవీ సంపదకు ముప్పు**

రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో అక్రమంగా రంగురాళ్ల తవ్వకాలు కొనసాగితే అటవీ భూముల స్వరూపం దెబ్బతినడంతోపాటు కొండ ప్రాంతాల పర్యావరణానికి ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. తవ్వకాల కోసం భారీగా గోతులు తీయడం వల్ల వర్షాకాలంలో ప్రమాదాలు సంభవించే అవకాశం కూడా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నట్లు ఆరోపణలు ఉన్న ప్రాంతాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి, తవ్వకాల వెనుక ఉన్న వ్యక్తులు, దళారులను గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు. నిరంతర నిఘాతోపాటు అవసరమైన చోట గస్తీ పెంచి అటవీ సంపదను పరిరక్షించాలని గిరిజన సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

## జాతీయ రహదారి గ్రామాల్లో వెలగని వీధి దీపాలు

**రోడ్డు ఇరుప్రక్కలా కనిపించని చెట్ల పెంపకం.. పనుల్లో వ్యత్యాసాలపై విమర్శలు**

**రాజవొమ్మంగి, ఆగస్టు 28, ప్రభాతవార్త:** రాజవొమ్మంగి మండలంలో 516-ఈ జాతీయ రహదారి నిర్మాణం పూర్తయి టోల్‌గేట్ ద్వారా వసూళ్లు ప్రారంభించినప్పటికీ, రహదారి భద్రతకు సంబంధించిన పలు సమస్యలు ప్రయాణికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. జాతీయ రహదారి వెంబడి గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు ప్రస్తుతం వెలగకపోవడంతో రాత్రివేళల్లో పలు ప్రాంతాలు చీకటిమయంగా మారుతున్నాయి. మండలంలోని జడ్డంగి, సింగంపల్లి, వట్టిగడ్డ, దూసరపాము తదితర గ్రామాల వద్ద రాత్రివేళల్లో చీకటి నెలకొంటోంది. ఇదే సమయంలో జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు భారీగా కొనసాగుతున్నాయి. వీధి దీపాలు వెలగకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన కూడళ్ల వద్ద ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసి, రాత్రివేళల్లో వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



**జంక్షన్ల వద్ద ట్రాఫిక్ ఐలాండ్లకు బదులు స్పీడ్ బ్రేకర్లు**

దూసరపాము జంక్షన్ నుంచి లబ్బర్తి, లాగరాయి, కిండ్ర, కిర్రాబు, గడుతుర్తి పంచాయతీల పరిధిలోని సుమారు 25 గ్రామాలకు రాకపోకలు సాగుతున్నాయి. ఆయా గ్రామాలకు వెళ్లే జంక్షన్ల వద్ద ట్రాఫిక్ ఐలాండ్లు ఏర్పాటు చేయకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంపై స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రాత్రివేళల్లో స్పీడ్ బ్రేకర్లు వాహనదారులకు స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని చెబుతున్నారు. అదేవిధంగా జడ్డంగి జాతీయ రహదారి నుంచి జడ్డంగి, వెలుకపాలెం, గడుతుర్తి పంచాయతీలకు వెళ్లే రహదారి జంక్షన్ వద్ద కూడా ట్రాఫిక్ ఐలాండ్ ఏర్పాటు చేయకుండా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. జడ్డంగి గ్రామం నుంచి అమీనాబాద్, వాతంగి, లోదొడ్డి, చికిలింత, వంచంగి,





మారేడుబాక గ్రామాలకు వెళ్లే జంక్షన్ వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. జంక్షన్ ల వద్ద రిఫ్లెక్టర్లు, హెచ్చరిక బోర్డులు, క్యాట్‌ఐస్, రోడ్ మార్కింగ్స్, లైటింగ్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు

**వంతెన వద్ద రక్షణ కంచె ఏదీ?**

వట్టిగడ్డ గ్రామం వద్ద ఉన్న వంతెనకు ఇరువైపులా మెటల్ క్రాష్ బ్యారియర్లు లేదా గార్డ్‌రెయిల్స్ ఏర్పాటు చేయకపోవడం ప్రమాదకరంగా మారిందని ప్రజలు అంటున్నారు. సుమారు 15 అడుగుల ఎత్తులో ఉన్న వంతెన వద్ద వాహనాలు అదుపుతప్పితే తీవ్ర ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే రక్షణ కంచెలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**కొండ ప్రాంతంలోనూ అసంపూర్తి భద్రతా చర్యలు**

జడ్డంగి మడేరు ఆనకట్ట సమీపంలో కొండను తొలగించి జాతీయ రహదారిని నిర్మించారు. అయితే మిగిలిన కొండ ప్రాంతంలో ఒకవైపు రాళ్లు రోడ్డుపై పడకుండా రక్షణ గోడ నిర్మించి, మరోవైపు రక్షణ చర్యలు లేకుండా వదిలివేయడం కనిపిస్తోందని స్థానికులు చెబుతున్నారు. కొండ ప్రాంతాల్లో రాళ్లు, మట్టి రహదారిపైకి జారకుండా పూర్తిస్థాయిలో రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**రోడ్డుకు ఇరువైపులా చెట్ల పెంపకం ఏదీ?**

జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా రోడ్డు ఇరువైపులా చెట్ల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉన్నప్పటికీ, మండల పరిధిలో అనేక ప్రాంతాల్లో చెట్ల పెంపకం చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదని ప్రజలు అంటున్నారు. మరోవైపు అడ్డతీగల, గంగవరం, రంపచోడవరం ప్రాంతాల వైపు జాతీయ రహదారి నుంచి గ్రామాలకు వెళ్లే కొన్ని జంక్షన్ల వద్ద ట్రాఫిక్ ఐలాండ్లు, ఫ్లడ్‌లైట్లు, వంతెనల వద్ద గార్డ్‌రెయిల్స్ వంటి భద్రతా ఏర్పాట్లు ఉన్నాయని, రాజవొమ్మంగి మండలంలోని పలు జంక్షన్ల వద్ద మాత్రం వాటికి బదులుగా కేవలం స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంలో ఆంతర్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. జాతీయ రహదారిపై ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన నేపథ్యంలో వెలగని వీధి దీపాలను వెంటనే పునరుద్ధరించాలని, ప్రమాదకర జంక్షన్లను పరిశీలించి అవసరమైన చోట ట్రాఫిక్ ఐలాండ్లు, ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయాలని, వంతెనల వద్ద గార్డ్‌రెయిల్స్ ఏర్పాటు చేయాలని, కొండ ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టాలని, రహదారి ఇరువైపులా చెట్ల పెంపకం చేపట్టాలని ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు






## కోనసీమ గోవిందుడి సేవలో అశేష భక్త జనం...

**నిత్యాన్న పథకానికి విరాళాలు..**

**ఆత్రేయపురం, ఆగస్టు 28,(ప్రభాత వార్త)** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం శ్రావణమాసం మూడవ శుక్రవారం కావడంతో అశేష భక్తజనంతో శోభిల్లింది. ఏడు వారాల నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, గోపూజ, బాల భోగం, నివేదన తదితర కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. అనంతరం శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. కాకినాడ చెందిన పణంగిపల్లి వెంకట సీతాపతి రావు, కృష్ణ కుమారి దంపతులు, వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ. 101116/- విరాళంగా అందించారు, ఆత్రేయపురం మండలం రాజవరం చెందిన కందుకూరి సూర్య తేజ, సౌమ్య సుందరి దంపతులు, వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ. 51116/- వేలు విరాళంగా అందించారు. వారికి ఆలయ అర్చకులు శ్రీ స్వామివారి దర్శనం చేయించి వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, జూనియర్ అసిస్టెంట్ వై శ్రీనివాస్ లు శ్రీ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు తగు ఏర్పాట్లు చేశారు.



## తాళ్ళరేవు ఎంపీపీ రాయుడు సునీత భర్త గంగాధర్ మృతి.



**తాళ్ళరేవు, ఆగస్టు 28 (ప్రభాతవార్త):** తాళ్లరేవు ఎంపీపీ రాయుడు సునీత భర్త రాయుడు గంగాధర్(49) అనారోగ్యం కారణంగా కాకినాడ ట్రస్ట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయన స్వగ్రామం తాళ్ళరేవు మండలం పటవల కాగా, ఆయనకు రాజకీయాలపై మక్కువ ఎక్కువ. విద్యావేత్త అయిన గంగాధర్ పీహెచ్డీ పూర్తి చేసి పలు ఇంజినీరింగ్, లా కళాశాలలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా, ప్రిన్సిపల్ గా పనిచేసి ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారు.ఆయన సతీమణి రాయుడు సునీత తాళ్లరేవు ఎంపీపీగా ప్రజలకు సేవలు అందిస్తున్నారు. గంగాధర్ మృతి పట్ల ఎంపీపీ సునీత, ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. గంగాధర్ మృతితో మండలంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎంపీ గంటి హరీష్ మాధుర్, కూటమి నాయకులతో పాటు, అఖిలపక్ష, ప్రజా సంఘాల నాయకులు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గంగాధర్ పార్థీవ దేహాన్ని శనివారం ఉదయం ఆయన స్వగ్రామమైన పటవల తీసుకురానున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## ఆడపడుచులకు అన్నగా అభివృద్ధికి అగ్రగామిగా

**రాఖీలు కట్టేందుకు పోటెత్తిన మహిళలు**

**కోటిపల్లి--ముక్తేశ్వరం వంతెన నిర్మాణం సాధిస్తా**

**రామచంద్రపురం,ఆగస్టు 28 (ప్రభాతవార్త):** రక్షాబంధన్ వేడుకల సందర్భంగా రామచంద్రపురం టౌన్‌హాల్ మహిళల సందడితో కళకళలాడింది.రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నయ్యతో ఒకరోజు కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుంచి మహిళలు తరలివచ్చారు.మంత్రికి రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటుకున్నారు.ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి ఆడపడుచుకు అన్నగా అండగా ఉంటానని,వారి కష్టసుఖాల్లో తోడుగా నిలుస్తానని భరోసా ఇచ్చారు.రామచంద్రపురం నియోజకవర్గ అభివృద్ధికి గత రెండేళ్లలో రూ.250 కోట్ల నిధులు తీసుకొచ్చి పనులు చేపట్టామని తెలిపారు.రానున్న రోజుల్లో నియోజకవర్గ రూపురేఖలు మార్చేలా మరింత అభివృద్ధి చేస్తానన్నారు.అలాగే కోటిపల్లి--ముక్తేశ్వరం వంతెన నిర్మాణాన్ని సాధించి తీరుతానని మంత్రి స్పష్టం చేశారు.ఈ వంతెన నిర్మాణంతో నియోజకవర్గ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.మహిళల సంక్షేమం,ఆర్థిక స్వావలంబనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు.మహిళలను స్వయం ఉపాధి,పారిశ్రామిక రంగాల్లో ప్రోత్సహించి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.సమస్యలకు భయపడి ఆత్మహత్యలకు పాల్పడవద్దని,ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని మంత్రి సూచించారు.రక్షాబంధన్ సందర్భంగా మహిళల కోసం మంత్రి ప్రత్యేకంగా ప్రేమ విందు ఏర్పాటు చేశారు.వారితో కలిసి భోజనం చేస్తూ ఆత్మీయంగా ముచ్చటించారు.అనంతరం పాటలు,నృత్యాలు,అంత్యాక్షరి,టగ్ ఆఫ్ వార్,కుర్చీలాట తదితర పోటీలు నిర్వహించారు.మహిళలు ఉత్సాహంగా పాల్గొనగా విజేతలకు మంత్రి బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం,నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి,కూటమి నాయకులు,కార్యకర్తలు,వేలాదిమంది మహిళలు పాల్గొన్నారు.






**రామచంద్రపురమే నా శాశ్వత చిరునామా..**

తాను సేవ చేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చానని మంత్రి సుభాష్ అన్నారు.తాను అమలాపురం వెళ్తానంటూ జరుగుతున్న ప్రచారం అవాస్తవమని కొట్టిపారేశారు.రామచంద్రపురం నియోజకవర్గంలోనే శాశ్వతంగా ఉంటానని మంత్రి సుభాష్ స్పష్టం చేశారు.

## రత్నగిరికి వచ్చే వాహనాల తనిఖీలు ముమ్మరం చెయ్యాలి

**మద్యం సేవించిన వారిని గుర్తించాలి**

**దేవస్థానం సెక్యూరిటీ అధికారులకు పోలీసుల సూచన**

**అన్నవరం, ఆగష్టు - 28. ప్రభాతవార్త** అన్నవరం సత్యదేవుని సత్యగిరిపై బుధవారం అర్ధరాత్రి పెండ్లి బృందంపై తాగుబోతుల వీరంగం సృష్టించిన ఘటనకు స్పందించిన

కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ వారి ఉత్తర్వుల మేరకు పెద్దాపురం సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ ఏ బి జి తిలక్ ఆదేశాలతో శుక్రవారం ప్రత్తిపాడు సిఐ వి.సూర్య అప్పారావు దేవస్థానం సెక్యూరిటీ గార్డులకు పలు సూచనలు చేసారు. పలు వాహనాలు టోల్గేట్ నుండి కొండ పైకి వెళ్లే సమయంలో ముమ్మర తనిఖీలు చేపట్టాలని,మద్యం సేవించి వచ్చే వారిని గుర్తించి, అట్టివారిని నిలువరించాలని, తరచుగా చెకింగ్ లు చేయాలని, ఈ విషయంలో అన్నవరం పోలీసు వారు కూడా సహకరిస్తారని వారికి సిఐ అప్పారావు తెలియజేసారు. ఏదైనా గొడవలు జరిగినప్పుడు వెంటనే అన్నవరం పోలీసువారి దృష్టికి తీసుకురావాలని ముందుగా అక్కడున్న సెక్యూరిటీ గార్డులు వెంటనే గొడవను ఆపే ప్రయత్నం చేయాలని వారికి ఆదేశాలు జారీచేసారు. సీసీ కెమెరాల ద్వారా నిఘా పెంచి, కంట్రోల్ రూమ్ ద్వారా ఎక్కడైనా గొడవలు జరిగితే వెంటనే వారిని గుర్తించాలని సదరు విషయాన్ని వెంటనే అన్నవరం పోలీసు వారి దృష్టికి కూడా తీసుకురావాలని, డ్రోన్ల ద్వారా కూడా భద్రతను కట్టుదిట్టం చేసే చర్యలు చేపడుచున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో అన్నవరం ఎస్ఐ హరిబాబు, దేవస్థానం ఎస్ఓ ఆకుల ప్రసాద్, తదితరులు ఉన్నారు.



## ఆముడా పరిధిలోకి కోనసీమ పంచాయతీలు...

**ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా సంపద సృష్టి ధ్యేయంగా..అమ్ముడా చైర్మన్ అల్లాడ సోంబాబు**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు28,ప్రభాతవార్త.** అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని పలు పంచాయతీలు, మున్సిపాలిటీలు ఆముడా పరిధిలోకి వచ్చేలా ప్రభుత్వం రెండు రోజుల క్రితం 203 జీవోను తీసుకొచ్చిందని జాయింట్ కలెక్టర్ మైకోమ్ నిదియాదేవి తెలిపారు. ఈ జీవో ద్వారా జిల్లాలోని 19 మండలాల్లో 272 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీలు ఆముడా పరిధిలోకి వచ్చినట్లు వెల్లడించారు. ఆముడా పరిధిలోకి పంచాయితీలు నాలుగు మున్సిపాలిటీలు రావడం సంతోషకరమన్నారు. అమ్ముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎంపీ, ఎమ్మెల్యేలతో చర్చించి, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కలిసి ఈ అంశంపై వివరించినట్లు తెలిపారు. రెవెన్యూ మొత్తం ఉమ్మడి జిల్లా పరిధికి వెళ్లిపోవడం వల్ల కోనసీమకు నష్టం జరుగుతుందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, అందుకు అనుగుణంగా 203 జీవో తీసుకురావడంలో కృషి చేశామని పేర్కొన్నారు. ఆముడా పరిధిలోకి వచ్చిన పంచాయతీల్లో ఇకపై అప్రూవల్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, పంచాయతీ సెక్రటరీలకు ఇప్పటికే నాలుగు సార్లు అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. 300 గజాలకు మించి నిర్మాణాలు చేపట్టే సందర్భాల్లో ఆముడా నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. ప్లానింగ్ సెక్రటరీ ఒక్కరే ఉండటంతో పనుల్లో కొంత జాప్యం ఏర్పడిందని, ప్రస్తుతం పీఓ,ఏపీఓలను కేటాయించడం తో ఇకపై పనులు వేగవంతం అవుతాయని తెలిపారు. రావులపాలెం, ఆత్రేయపురం, గంగవరం తదితర ప్రాంతాలు కూడా ఆముడా పరిధిలోకి రావడంతో కోనసీమలో అభివృద్ధితో పాటు రెవెన్యూ బలోపేతానికి అడుగులు పడుతున్నాయని ఆముడా చైర్మన్ అన్నారు. ఇదిలా ఉండగా, 203 జీవో ద్వారా కోనసీమ ప్రాంతానికి ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకున్న ఆముడా చైర్మన్‌ను జేసీ అభినందించారు. కోనసీమలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి ఆముడా పరిధి దోహదపడుతుందని అమ్ముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు తెలిపారు.



## తప్పిపోయిన మత్స్యకారుల ను స్వగ్రామానికి చేర్చిన ఎంపీ హరీష్

**ఏడుగురి మత్స్యకార కుటుంబాల్లో వెల్లివిసిన ఆనందం...**



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,ఆగస్టు28, ప్రభాతవార్త** అన్ని లాంఛనాలు పూర్తి చేసి వెస్ట్ బెంగాల్ నుండి, సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారులను స్వగ్రామానికి తరలించడంలో అమలాపురం ఎంపీ హరీష్ బాలయోగి కీలక పాత్ర పోషించారు.వారిని స్వగ్రామానికి చేర్చి మత్స్యకారులకు అండగా నిలిచారు.గల్లంతైన మత్స్యకారులు వారి కుటుంబ సభ్యులను కలుసుకోవడంతో వారి కళ్లలో ఆనందం వెల్లివిరిసింది. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గల్లంతైన బోటును తీరానికి చేర్చడంలో సహాయం చేసిన ఇరువురికి, హరీష్ గ్రామస్థులు దుశ్శాలువాలతో సన్మానం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసి, మత్స్యకారులకు వెన్నంటి ఉన్న ఎంపీ హరీష్ బాలయోగి కి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉడిపి హోటల్ వ్యర్థాలతో రోగాలు బారిన టి. నగర్ వాసులు

**కనిపించని పారిశుధ్యం నిర్వహణ**

**రాజమహేంద్రవరం అర్బన్: ఆగస్టు 28, ప్రభాతవార్త,** వచ్చే సంవత్సరం గోదావరి పుష్కరాలు నిర్వహణ ఎలా ఉన్నప్పటికీ, నగరంలో మురికి కాలువల పారిశుద్ధ్య నిర్వహణ, షిల్టు తొలగింపు లో నగరపాలక సంస్థ ఆరోగ్య విభాగం, పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యంలో ఉంటున్నారని నగర ప్రజలు వాపోతున్నారు. రాజమహేంద్రవరం నగరానికి ముఖద్వారమైన రోడ్ కం రైల్వే బ్రిడ్జి ప్రధాన రహదారి కి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ నిర్వహణ లేక దుర్గంధం వ్యాపిస్తుంది. టీ నగర్లో ఉడిపి హోటల్ నుంచి నిత్యం వ్యర్థాలు బయటికి వదలడంతో సమీప డ్రైనేజీ వ్యర్థాలతో పూడుకుపోతుంది. దాంతో భరించరాని దుర్గంధం, విషవాయువులు వెలువడుతుండడంతో సమీప నివాసులు, దుకాణదార్లు రోగాలు బారిన పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. కార్పొరేషన్ అధికారులకు చాలా సార్లు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ వారు పట్టించుకోవడం లేదని నాలుగైదు నెలలకు ఒకసారి షిల్టు తీసి తరలించకుండా డ్రైనేజీల వద్ద నిల్వ ఉంచుతున్నారని, దానితో దోమలు, ఈగలు, దుర్గంధం, వ్యాపించడంతోపాటు రాకపోకులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు అంటున్నారు. ఉడిపి హోటల్ యాజమాన్యం స్పందించడం లేదని, డ్రైనేజీ కు ఔట్లెట్ సౌకర్యం లేక షిల్టు వ్యర్థాలు అక్కడే నిలిచిపోతున్నాయని, కోటిపల్లి బస్టాండ్ వద్ద డ్రైనేజీ లోతట్టు ప్రాంతం లో ఉంది. వర్షాలు కురిసిన సమయాల్లో డ్రైనేజీలు



పొంగిపొర్లి వ్యర్థాలు రోడ్లమీదకు పారుతున్నాయి మోకాళ్ళ లోతు ముంపు నీటిలో రాకపోకలు సాగించలేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్ అధికారులకు ఈ సమస్యపై ఉడిపి హోటల్ యాజమాన్యంపై ఫిర్యాదులు చేసినప్పటికీ స్పందించడం లేదన్నారు. ఇటీవల కార్పొరేషన్ కమిషనర్ వార్డు పర్యటనకు వచ్చినప్పుడు ఆయన దృష్టికి తీసుకువెళ్లామన్నారు. కొన్ని నెలల్లో గోదావరి పుష్కరాలు జరుగుతాయని, ఈ రోడ్డు విస్తరణ చర్యలు చేపట్టవలసి ఉందని అంతవరకు ఇబ్బందులు తప్పవని కార్పొరేషన్ అధికారులు సమాధానం ఇస్తున్నారని స్థానికులు అంటున్నారు. ఏదేమైనా పుష్కరాలు జరిగేంత వరకు అయినా డ్రైనేజీల్లో పూడికలు తీసి వ్యర్థాలను తరలించాలని, ఉడిపి హోటల్ యాజమాన్యంపై కార్పొరేషన్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని, కోటిపల్లి బస్టాండ్ ప్రాంతంలో లోతట్టులో ఉండి మూసుకుపోయిన డ్రైనేజీను ఆధునికరించాలని, డ్రైనేజీకి అవుట్లెట్ ఏర్పాట్లు చేయాలని, స్థానికులు ఎదుర్కొంటున్న ముంపు సమస్య నుంచి, దుర్గంధం బారి నుండి కాపాడాలని టీ నగర్ ప్రజలు,, దుకాణం దారులు విజ్ఞప్తి చేస్తున్నారు.





## నాలుగు స్తంభాలాటలో జనసేన!

- ఎవరికి వారే.. వేదికలు వేరే!
- పార్టీ కార్యక్రమాల్లోనూ కనిపించని సమన్వయం
- నాయకుల మధ్య పెరుగుతున్న అంతరం.. కేడర్‌లో అయోమయం

**పిఠాపురం, ఆగస్టు 28 ( ప్రభాతవార్త )** పిఠాపురం నియోజకవర్గ జనసేన రాజకీయాల్లో 'నాలుగు స్తంభాలాట' చర్చనీయాంశంగా మారుతోంది. పార్టీ కార్యక్రమాలు ఒకే పేరుతో జరుగుతున్నా.. నాయకుల వ్యవహారశైలిలో మాత్రం ఏకత్వం కనిపించడం లేదన్న అభిప్రాయం కేడర్‌లో వ్యక్తమవుతోంది. ఒక వర్గం కార్యక్రమానికి మరో వర్గం దూరంగా ఉండటం, ఎవరికి వారే ప్రత్యేకంగా వేదికలు ఏర్పాటు చేసుకోవడం, తమ అనుచరులతోనే కార్యక్రమాలు నిర్వహించుకోవడం పార్టీ అంతర్గత సమన్వయంపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానికంగా జనసేనకు రాజకీయ ప్రాధాన్యం పెరిగింది. దీంతో పదవులు, పార్టీ బాధ్యతలు, భవిష్యత్ రాజకీయ అవకాశాలపై ఆశలు కూడా పెరిగాయి. అయితే ఇదే సమయంలో నాయకత్వ స్థాయిలో సమన్వయం కొరవడుతోందన్న చర్చ మొదలైంది. ముఖ్యంగా పార్టీ కార్యక్రమాల్లో ఒకే వేదికపై కనిపించాల్సిన నేతలు వేర్వేరు కార్యక్రమాలు నిర్వహించడం, తమ తమ వర్గాలతోనే సమావేశాలు పెట్టుకోవడం రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది.

**వేదిక ఒక్కటే.. దారులు వేరు :**

పార్టీకి సంబంధించిన కార్యక్రమం ఏదైనా సరే.. అందరూ ఒకే వేదికపైకి వచ్చి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నది సాధారణ కార్యకర్తల ఆకాంక్ష. కానీ ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోందన్న చర్చ సాగుతోంది. ఒక నాయకుడు నిర్వహించే కార్యక్రమానికి కొందరు హాజరవుతుండగా.. మరికొందరు మరో కార్యక్రమంలో కనిపిస్తున్నారు. దీంతో 'ఎవరితో ఎవరు?' అనే ప్రశ్న కేడర్‌లో వినిపిస్తోంది.

**కేడర్‌కు సంకేతం ఏమిటి?**

నాయకుల మధ్య కనిపించే ఈ దూరం క్రమంగా కింది స్థాయి కార్యకర్తల్లోనూ ప్రభావం చూపుతోందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. నాయకులు ఒకే మాటపై ఉంటేనే కార్యకర్తల్లో స్పష్టత వస్తుంది. కార్యకర్తలలో నాయకులు ఆశలు రేకెత్తించిస్థానికంగా ఏకంగా ఉన్న కార్యకర్తలను వర్గాలుగా ఉపవార్గాలుగా విడదీస్తున్నారని కేడర్ నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణ,గ్రామస్థాయిలో సైతంపార్టీ కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాల్సిన ఇన్చార్జులు కేడర్ కు సమాచారం ఇవ్వకుండా రాఖీ కానుక చీరలు పంపిణీ చేశారనే విమర్శలు జనసైనికుల నుంచి వినిపిస్తున్నాయి.

**నాలుగు స్తంభాలాట ఎందుకు?**

స్థానిక నాయకత్వంలో ఎవరి ప్రాధాన్యం ఎంత? భవిష్యత్‌లో పార్టీ బాధ్యతలు ఎవరికి దక్కుతాయి? స్థానిక రాజకీయాల్లో ఎవరి మాటకు ప్రాధాన్యం ఉంటుంది? వంటి అంశాలే ఈ దూరానికి కారణమా అన్న చర్చ కూడా జరుగుతోంది. అయితే అసలు కారణం పార్టీ అధిష్ఠానం స్పష్టమైన సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేయడంలోనే ఉందా అన్న ప్రశ్న కూడా వినిపిస్తోంది.




**కేడర్ లో అయోమయం :**

నియోజకవర్గంలో పార్టీకి బలమైన కేడర్ ఉన్నప్పటికీ, నాయకత్వ స్థాయిలో సమన్వయం లేకపోతే ఆ బలం చీలిపోయే ప్రమాదం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ముఖ్యంగా పార్టీ కార్యక్రమాల లు, ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారంలో అందరూ కలిసి కనిపించాల్సిన సమయంలో వేర్వేరు కార్యక్రమాలు నిర్వహించడం కార్యకర్తలకు స్పష్టమైన సందేశాన్ని ఇవ్వడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకవైపు పార్టీ అధికారంలోకి వచ్చి బలపడుతున్న సమయంలో నే.. మరోవైపు స్థానికంగా నాయకుల మధ్య దూరం కనిపించటం పార్టీ భవిష్యత్తుకు ఇబ్బందికరంగా మారవచ్చునని కేడర్ భావిస్తోంది. నాయకుల మధ్య పోటీ సహజమే అయినా.. అది పార్టీ ప్రయోజనాలను దెబ్బతీసే స్థాయికి చేరకూడదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ఒక్కతాటిపైకి వస్తేనే బలం :**

ప్రస్తుతం పార్టీకి అవసరమైనది కొత్త వేదికలు కాదు.. ఉన్న వేదికపై అందరూ కలిసి నిలబడటమేనన్న చర్చ జరుగుతోంది. అధిష్టానం చొరవ తీసుకుని నాయకుల మధ్య సమన్వయం పెంచి, కార్యకర్తలకు ఒకే రాజకీయ దిశను చూపిస్తే " నాలుగు స్తంభాలాట"కు తెరపడే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.oo

# కానిస్టేబుల్ ఇంట్లో చోరీ సొత్తు స్వాధీనం



కొత్తపేట, ఆగస్టు 28, (ప్రభాతవార్త) హెడ్ కానిస్టేబుల్ ఇంట్లో చోరీకి గురైన వెండి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని నిందితున్ని అరెస్టు చేసినట్టుకొత్తపేట ఎస్సై జి సురేంద్ర తెలిపారు డిఎస్పి కార్యాలయం లో హెడ్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న వెల్లి బోయిన రాంబాబు తన భార్యతో కలిసి ఈ నెల 18వ తేదీన హైదరాబాద్ వెళ్లి 20వ తేదీన ఉదయం వచ్చి చూసుకునేసరికి తన ఇంట్లో 23 కాసుల బంగారు వస్తువులు 880 గ్రాముల వెండి వస్తువులుచోరీ కి గురైనట్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు ఆ మేరకు ఎస్సై జి సురేంద్ర కేసు నమోదు చేశారు జిల్లా ఎస్పి రాహుల్ మీనా ఉత్తర్వులు మేరకు కొత్తపేట డిఎస్పి సుంకర మురళీమోహన్ పర్యవేక్షణ లో అమలాపురం సి సి ఎస్ సి ఐ ఎన్ కొండయ్య వారి సిబ్బంది తో ప్రత్యేక బృందాలు గా ఏర్పాటు చేసి దర్యాప్తు చేశారని ఎస్ఐ సురేంద్ర తెలిపారు దర్యాప్తులో భాగంగా రావులపాలెం రూరల్ సి ఐ సిహెచ్ విధ్యాసాగర్ గురువారం ముద్దాయిని అరెస్ట్ చేసి అతని వద్ద చోరీ సొత్తు బంగారు వెండి వస్తువులు స్వాధీనం చేసికొన్నట్లు ఎస్సై తెలిపారు అలాగే ముద్దాయి నేరానికి ఉపయోగించిన మోటార్ సైకిలు రెండు ఇనుప రాడ్ లు స్వాదిన పరుచుకున్నట్లు తెలిపారు ముద్దాయిని శుక్రవారం గౌరవ కొత్తపేట కోర్టు లో హాజరుపర్చగ గౌరవ మెజిస్ట్రేట్ 15 రోజులు రిమాండ్ విధించారని ఎస్ ఐ సురేంద్ర తెలిపారు

## సమస్యల పరిష్కార వేదిక ప్రజాదర్బార్ - ఎమ్మెల్యే బండారు



కొత్తపేట, ఆగస్టు 28, (ప్రభాతవార్త) ప్రజా సమస్యల పరిష్కారానికి సరైన వేదిక ప్రజాదర్బార్ అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ప్రజల వద్ద నుండి స్వీకరించిన ప్రతీ అర్జీని పరిష్కరిస్తామన్నారు సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామన్నారు ఈరోజు నిర్వహించిన ప్రజాదర్బార్ లో 13 వినతులు వచ్చినట్లు ఎమ్మెల్యే సత్యానందరావు వెల్లడించారు కూటమి ప్రభుత్వ పాలనలో ప్రతి అంశంలోనూ జవాబుదారీతనం అమలు చేస్తున్నామన్నారు

## మేజర్ ధ్యాన్ చంద్ హాకీ ప్రీమియర్ లీగ్--2026

-జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆగస్టు 29న యానంలో హాకీ టోర్నమెంట్

యానాం, ఆగస్టు 28(ప్రభాతవార్త):జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్ హాకీ ప్రీమియర్ లీగ్--2026 పోటీలను ఆగస్టు 29న యానంలో ఘనంగా నిర్వహించనున్నారు. యానాం ప్రాంతంలోని హాకీ క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.యానాం రీజియన్ హాకీ అసోసియేషన్ అధ్యక్షులు, హాకీ పుదుచ్చేరి అనుబంధంతో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యానాంలోని జీఎంసీ బాలయోగి గ్రౌండ్ వేదికగా హాకీ ప్రీమియర్ లీగ్ జరగనుంది.ఈ సందర్భంగా కోచ్ అశ్విన్ వర్మ మాట్లాడుతూ, యానాం ప్రాంతంలో హాకీ క్రీడకు మరింత ప్రోత్సాహం కల్పించేందుకు, ప్రతిభావంతులైన యువ క్రీడాకారులకు మంచి వేదిక అందించేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు.జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ హాకీ ప్రీమియర్ లీగ్‌కు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై క్రీడాకారులను ప్రోత్సహించాలని, టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## బియ్యం బస్తాలపై క్రియార్ క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానంలో ఇబ్బందులుకమిషన్ పెంచాలని డీలర్ల వినతి



రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు 28(ప్రభాతవార్త) బియ్యం బస్తాలపై క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానంలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని, బియ్యం అమ్మకపు కమిషన్ను పెంచాలని కోరుతూ రాజమహేంద్రవరం రూరల్ మండల డీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో తహశీల్దారుకు వినతిపత్రం అందజేశారు.ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బియ్యం బస్తాలపై క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానం వల్ల రేషన్ డీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. గోడౌన్ నుంచి వచ్చిన ప్రతి బియ్యం బస్తాపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడంతో పాటు, ప్రతి బస్తాను ఈ-పోస్ యంత్రం ద్వారా నమోదు చేయాల్సి వస్తోందన్నారు.దీనివల్ల అదనపు పని భారం పెరగడంతో పాటు, హెల్పర్ సేవలను వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పేర్కొన్నారు. పెరిగిన అద్దెలు, హమాలీ కూలీలు, ఇతర ఖర్చులతో డీలర్లపై ఆర్థిక భారం పడుతోందన్నారు.క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానం ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసం ఉద్దేశించినదైనా, అయితే దీనివల్ల డీలర్లకు అదనపు ఖర్చులు, శ్రమ పెరుగుతున్నందున తగిన విధంగా కమిషన్ పెంచాలని కోరారు. ప్రస్తుతం ఒక్క రూపాయి చొప్పున కమిషన్ ఇస్తున్నారని, పెరిగిన ఖర్చులు మరియుహమాలీ ఛార్జీల దృష్ట్యా కిలోకు రూ.3 చొప్పున కమిషన్ పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.క్యూఆర్ కోడ్ స్కానింగ్ ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు, డీలర్లపై పడుతున్న అదనపు భారాన్ని తగ్గించాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.

## ధవళేశ్వరం పోలీసులకు రాఖీలు కట్టిన విద్యార్థులు




ధవళేశ్వరం, ఆగస్టు 28,(ప్రభాతవార్త) రాఖీ పౌర్ణమి సందర్భంగా ధవళేశ్వరం పోలీస్ స్టేషన్లో అన్నచెల్లెల వాతావరణం నెలకొంది. రాజోలోపు గ్రామంలోని ఈస్ట్ రిడ్జ్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ధవళేశ్వరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీసు అధికారులకు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు ధవళేశ్వరం పోలీస్ సిఐ టి. గణేష్, ఎస్.ఐ పి. విజయ్ కుమార్ లకు రాఖీలు కట్టారు. రాఖీ పౌర్ణమి ప్రాధాన్యతను వివరిస్తూ, సమాజంలో ప్రజలకు భద్రత కల్పించడంలో పోలీసులు అందిస్తున్న సేవలకు కృతజ్ఞతగా రాఖీలు కట్టడం ఎంతో ఆనందంగా ఉందని విద్యార్థులు తెలిపారు.ప్రజల రక్షణ కోసం పోలీసులు అహర్నిశలు విధులు నిర్వహిస్తూ, ఎండ, వానలు సైతం లెక్కచేయకుండా సేవలందిస్తున్నారని విద్యార్థులు పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలికల భద్రతకు పోలీసులు అందిస్తున్న రక్షణ, భరోసా ఎంతో అభినందనీయమని అన్నారు. పోలీసులను తమ కుటుంబ సభ్యులుగా భావిస్తూ రాఖీ కట్టడం తమకు ఎంతో సంతోషంగా ఉందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.విద్యార్థుల ఆత్మీయతకు సిఐ టి. గణేష్, ఎస్.ఐ పి. విజయ్ కుమార్ వారిని అభినందించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా విద్యార్థులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి రాఖీలు కట్టడం తమకు ఎంతో ఆనందాన్ని, ఆత్మీయ అనుభూతిని కలిగించిందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువు అభ్యసిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.రాఖీ పౌర్ణమి సందర్భంగా విద్యార్థులు, పోలీసు అధికారులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకోవడంతో పోలీస్ స్టేషన్ సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమం పోలీసులు, విద్యార్థుల మధ్య ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని చాటిచెప్పింది.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



ధవళేశ్వరం, ఆగస్టు28(ప్రభాత వార్త) ధవళేశ్వరం పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు యర్రమోతు ధర్మరాజు ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ధవళేశ్వరం మేనేజర్ సుసన్న కుమార్ బ్యాంకు ఆవరణలో విస్తృత సమావేశం నిర్వహించారు, పెన్షనర్లు సైబర్ నేరాలకు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. ఇటీవల రకరకాల సందేశాలతో మీరు కొంత సొమ్ము చెల్లించండి దానికి పది రెట్లు నెల తిరగకుండా మీ ఖాతాలో జమౌతాయి, అలాగే మిమ్మల్ని అదృష్టం వరించింది మీ ఖాతాకు కొంత సొమ్ము జమవుతుంది మీ ఖాతా సంఖ్య పాన్ నెంబరు ఆధార్ కార్డు నెంబరు వెంటనే పంపండి మరుక్షణమే మీ ఖాతానుండి సొమ్ము అందుకోండి అంటూ ఆకర్షితులను చేస్తూ అయోమయానికి గురిచేస్తున్నారు, డబ్బు వేసేది పోగా మన ఖాతాలో ఉన్న సొమ్ము దోపిడీ జరుగుతుంది, మీకు తెలియని వ్యక్తులకు ఏటీఎం కార్డు ఇవ్వడం, పిన్ కోడ్ చెప్పడం చేయవద్దు మీకు తెలియకపోతే నన్ను సంప్రదిస్తే మా సిబ్బందిచే మీయొక్క లావాదేవీలు చేయిస్తాను, ధర్మరాజు మాట్లాడుతూ వ్యక్తిగత రుణాలు తీసుకునే వారికి ఇన్సూరెన్స్ చేయించడం కట్టే విధంగా చూడండి, రుణం తీసుకుని మొదటి వాయిదా కట్టిన తర్వాత వాయిదాలు కట్టకపోతే ప్రమాదవశాత్తు మరణిస్తే బకాయి పూర్తి సొమ్ము కట్టవలసి వస్తుంది కావున ఇన్సూరెన్స్ ప్రతి ఏటా వాయిదా జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు, జిల్లా ఉపాధ్యక్షులు వెంపరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతినెలా మొదటి వారం పెన్షనర్లకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు,అలాగే పెన్షనర్లు అడిగిన పలు ప్రశ్నలకు సుసన్నకుమార్ సమాధానాలు ఇచ్చారు, మీకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా నేరుగా నన్ను కలవవచ్చు అన్నారు, అలాగే లోన్లు తీసుకోవడంతో పాటు డిపాజిట్లు వేయండి,వేయించండి, లాకర్ల సదుపాయాన్ని వినియోగించు కోవాలని సూచించారు, ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దువ్వూరి కామేశ్వర శర్మ, నాగులకొండ అశోక్ బాబు,కోశాధికారి ఉర్రింకల సత్యనారాయణ, రిటైర్డ ఈఈ కె. వెంకటేశ్వర్లు, నల్లి విజయ మోహన్, ప్రొఫెసర్ ఐ.వి. సుబ్బారావు, బొమ్మా రాములు, రాచకొండ ఏసుబాబు, బండారు రవీంద్ర, దాసరి సాయిబాబు, కురుముద్దాలి రామారావు, చంటి, బుగ్గా సుబ్రహ్మణ్యం, తదితరులు, బ్యాంకు ఉద్యోగిని ఎమ్. వి. లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు,లావాదేవీల్లో ఆర్థికంగా మోసపోకుండా వయోవృద్ధులైన మాఅందరికీ సరైన సూచనలు సలహాలు ఇచ్చిన మేనేజర్ సుసన్న కుమార్ ను పెన్షనర్లు దుశ్శాలువా, పూలమాలతో సత్కరించారు.

## అడ్డతీగల పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలు శూన్యం ఎంపీడీవో ఏవీవీ కుమార్



అడ్డతీగల, ఆగస్టు 28, ప్రభాతవార్త మండలంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నిమిత్తం ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ప్రజలు, రాజకీయ పార్టీల నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాలేదని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏవీవీ కుమార్ తెలిపారు.అడ్డతీగల మండల పరిధిలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 202 పోలింగ్ స్టేషన్లను ప్రతిపాదించినట్లు ఆయన పేర్కొన్నారు. ఓటర్ల అవగాహన, పరిశీలన నిమిత్తం ఈ నెల 26వ తేదీన ఆయా పంచాయతీ కార్యాలయాల్లో ఈ జాబితాను అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.నిర్ణీత గడువు ముగిసే నాటికి ప్రతిపాదిత పోలింగ్ కేంద్రాలపై ఎలాంటి ఫిర్యాదులు గానీ, మార్పులు–చేర్పుల అభ్యంతరాలు గానీ నమోదు కాకపోవడంతో తదుపరి ముందస్తు చర్యల నిమిత్తం పూర్తి వివరాలను జిల్లా పంచాయతీ అధికారి డీపీఓ వారికి నివేదించినట్లు ఎంపీడీవో వివరించారు.

## మైనర్ బాలుడు రియాన్స్ కార్తికేయ రెడ్డి భవిష్యత్ కు అండగా ఉంటాం

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి సూర్యనారాయణ రాజు- ఏఈ నూకరాజు కుటుంబ విషాద ఘటనపై బాలల హక్కుల కమిషన్ సీరియస్




రావులపాలెం, ఆగస్టు 28 (ప్రభాతవార్త): కాకినాడ పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు కుటుంబ విషాద ఘటనలో ప్రాణాలతో బయటపడిన మైనర్ రియాన్స్ కార్తికేయ రెడ్డికి పూర్తి రక్షణ కల్పించి, అతని భవిష్యత్తుకు అండగా ఉంటామని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ వేటుకూరి సూర్యనారాయణ రాజు తెలిపారు. శుక్రవారం రావులపాలెంలోని బాలుడి తాతయ్య కొవ్వూరి భాస్కరరెడ్డి ఇంటికి చేరుకున్న కమిషన్ చైర్మన్‌తో పాటు సభ్యులు డా. పి. నాగ మానస, గంగ సూర్యనారాయణ బాలుడిని పరామర్శించి ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలుడి భద్రత, విద్య, భవిష్యత్తు విషయంలో ఎలాంటి రాజీ ఉండదని చైర్మన్ స్పష్టం చేశారు.సాదిక్ ఖాన్ తనపై దాడి చేశాడని, ఉగ్రవాదులకు అప్పగిస్తానంటూ బెదిరించినట్లు బాలుడు తెలిపిన విషయాలను కమిషన్ తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, బాలుడికి ఎదురైనట్లు చెబుతున్న బెదిరింపులపై అధికారులతో చర్చించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాకినాడ కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించి పోలీస్, రెవెన్యూ, విద్యా, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులతో చర్చించనున్నట్లు చెప్పారు. బాలుడికి సంపూర్ణ రక్షణ కల్పించేందుకు అవసరమైన సిఫార్సులు ప్రభుత్వానికి, డీజీపీకి అందిస్తామని తెలిపారు. కమీషన్ సభ్యులతో పాటు కొత్తపేట ఆర్డీఓ జీవివి సత్యనారాయణ, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఇంచార్జి పీడీ వైకేడి రమాదేవి, తహసీల్దార్ బి ఎమ్ ముక్తేశ్వరరావు, చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎమ్ వెంకట, సిడిపిఓ ఏ గజలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర వాలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శిగా గాది గంగబాబు



యు.కొత్తపల్లి, ఆగస్టు 28 (ప్రభాతవార్త) : వైయస్సార్ సీపీ రాష్ట్ర వాలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శిగా కొండెవరం గ్రామానికి చెందిన గాది గంగ బాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం పిఠాపురం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పిఠాపురం వైఎస్సార్ సీపీ ఇంచార్జ్ వంగా గీత గంగ బాబును శాలువా, పూలమాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా గంగబాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియమించినందుకు వైఎస్ఆర్ సీపీ అధినాయకుడు జగన్ మోహన్ రెడ్డి, వంగా గీతలకు కృతజ్ఞతలు తెలిపారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు గంగబాబును అభినందించారు.

## నైపుణ్యాలను వెలికితీసేందుకే పరీక్షలు: డీఈఓ మహబూబ్ బాషా,



మామిడికుదురు.ఆగస్టు 28(ప్రభాతవార్త)ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచే ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాన్ని సాధించేందుకు నిరంతరం శ్రమించాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) మహబూబ్ బాషా సూచించారు. శుక్రవారం ఆయన నగరం మోడల్ ప్రైమరీ స్కూల్,పాశర్లపూడి, నగరం జెడ్పీహెచ్ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో జరుగుతున్న 'స్లాష్' పరీక్షల సరళిని, నిర్వహణ తీరును పరిశీలించిన ఆయన, ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. పరీక్షలు అనేవి విద్యార్థుల్లోని ప్రతిభను, నైపుణ్యాలను అంచనా వేసేందుకు ఒక చక్కని వేదిక లాంటివన్నారు. పరీక్షలను చూసి భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. విద్యాభ్యాసంతో పాటు జీవితంలో క్రమశిక్షణ, సమయపాలన చాలా ముఖ్యమని, గురువులను, పెద్దలను గౌరవిస్తూ ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం పాఠశాలల్లో కల్పిస్తున్న డిజిటల్ క్లాసులు, లైబ్రరీ వంటి ఆధునిక వసతులను విద్యార్థులందరూ పరిపూర్ణంగా ఉపయోగించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. బాగా చదువుకుని తమ తల్లిదండ్రులకు, పాఠశాలకు మరియు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) మోకా వెంకన్నబాబు, ఆయా స్కూల్స్ ప్రధానోపాధ్యాయులు బావిశెట్టి నాగేశ్వరరావు, పాలా సోమేశ్వరరావు,ఆగా మొహమ్మద్ అలీబేగ్, ఆర్వీఎస్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## పాశర్లపూడిలంకలో లార్వా నిర్మూలన చర్యలు.



మామిడికుదురు. ఆగస్టు 28(ప్రభాతవార్త) మండలపరిధిలోని పాశర్లపూడిలంక గ్రామంలో డెంగీ, మలేరియా వంటి ప్రమాదకర జ్వరాల వ్యాప్తిని అరికట్టేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా గ్రామంలోని పలుచోట్ల వర్షపు నీరు నిలిచిపోయింది.ఈ నేపథ్యంలో దోమల లార్వా (గుడ్లు) వృద్ధి చెందకుండా నివారించేందుకు శుక్రవారం ప్రత్యేక స్ప్రేయింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామంలోని నివాస ప్రాంతాలు, వర్షపు నీరు నిల్వ ఉన్న లోతట్టు ప్రాంతాలను గుర్తించి,అక్కడ లార్వా నిర్మూలనకు 'ఎబేట్' రసాయనాన్ని సిబ్బంది స్ప్రే చేశారు. రాజోలు సబ్ యూనిట్ అధికారి యెరుబండి ఆదినారాయణ ఆదేశాల మేరకు, పంచాయతీ కార్యదర్శి రేకపల్లి ఏసుబాబు పర్యవేక్షణలో ఈ పనులు జరిగాయి. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు కూడా తమ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కేవీ సూర్యనారాయణ, స్థానిక ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు మరియు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో హయ గ్రీవ స్వామి జయంతి



మామిడికుదురు.ఆగస్టు 28(ప్రభాతవార్త) స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణం శుక్రవారం ఆధ్యాత్మిక శోభతో వికసించింది. జ్ఞాన కారకుడైన శ్రీలక్ష్మీ హయగ్రీవ స్వామి జయంతి వేడుకలను ఇక్కడ అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రముఖ అర్చకులు బ్రహ్మశ్రీ సుదర్శనం వెంకటసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక అనుష్ఠానాలు ప్రారంభమయ్యాయి. స్వామి వారికి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం గావించి, శుద్ధ జలాలు, పంచామృతాలతో సంప్రదాయబద్ధంగా అభిషేకించారు.విద్యార్థుల్లో ఏకాగ్రత, ఉత్తమ విద్యాబుద్ధులు కలగాలని కాంక్షిస్తూ.. ఆలయంలో 10,000 పెన్నులను ఉంచి హయగ్రీవ అష్టోత్తర శతనామావళితో విశిష్ట పూజలు చేశారు. అనంతరం ఆ పూజించిన పెన్నులను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ప్రతి ఏటా ఈ జయంతిని ఇంతే ఘనంగా నిర్వహిస్తున్నామని, చదువుల దేవుని ఆశీస్సులు విద్యార్థులకు ఎంతో అవసరమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో నియోజకవర్గ పరిధిలోని భక్తులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ర్యాలి శ్రీ జగన్మోహిని దేవస్థానం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు... పాల్గొన్న ఎమ్మెల్యే, బండారు..

-ర్యాలిలో రెండేళ్ల నమ్మకం--సంక్షేమం--అభివృద్ధి' కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు ...



ఆత్రేయపురం, ఆగస్టు 28,(ప్రభాత వార్త) ప్రముఖ పుణ్యక్షేత్రం స్వయంభు సాలిగ్రామశిల ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ స్వామివారి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా మూడవ శ్రావణ శుక్రవారం కావడంతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై వరలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శ్రీ జగన్మోహిని కేశవ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు, నిర్వహించి స్వామివారి దర్శనం చేయించి వేద ఆశీర్వచనం అందించగా ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు స్వామివారి చిత్రపటం తీర్థప్రసాదాలు శేష వస్త్రంతో సత్కరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న సామూహిక వరలక్ష్మీ వ్రత కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. వ్రతం ఆచరిస్తున్న మహిళలను కలిసి వారికి పసుపు, కుంకుమలను అందజేశారు. శ్రావణ మాసంలో వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న మహిళలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. మహిళలు సంప్రదాయ దుస్తుల్లో హాజరై వరలక్ష్మీ అమ్మవారికి ఆలయ కార్యనిర్వాహణాధికారి దారపు రెడ్డి సురేష్ బాబు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు. పూజలు నిర్వహిస్తున్న మహిళల కుటుంబాల్లో సుఖశాంతులు, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు కలగాలని కోరుకున్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా చేపట్టిన 'రెండేళ్ల నమ్మకం--సంక్షేమం--అభివృద్ధి' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ర్యాలి గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని ఎమ్మెల్యే.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. పథకాల ద్వారా లబ్ధిదారులకు అందుతున్న ప్రయోజనాలను తెలియజేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, సాగునీరు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఇంటింటి పర్యటనలో ప్రజల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని, ప్రజలతో మమేకమై గ్రామాల అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు ముళ్ళపూడి భాస్కరరావు తెలుగు యువత అధ్యక్షులు వెచ్చా అనిల్ కుమార్, దేవస్థానం చైర్మన్,మెర్ల నాగేశ్వరరావు, ఈఓ,దారపురెడ్డి సురేష్ బాబు,జూనియర్ అసిస్టెంట్లు మేడిద శ్రీను దత్తు అర్చకులు, పుల్లం రాజు వర్మ, మద్దూరు సుబ్బారావు, జుజ్జువరపు హరిబాబు తోట రజిని మద్దింశెట్టి వీర వెంకట సత్యనారాయణ, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మహిళలకు చీరలు పంచిన జనసేన నాయకులు



యు.కొత్తపల్లి, ఆగస్టు 28(ప్రభాతవార్త) : రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని పిఠాపురం ఎమ్మెల్యే, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలోని పింఛను పొందుతున్న 45 సంవత్సరాలు లోపు సుమారు 2,500 మంది వితంతు మహిళలకు గురువారం చీరలను పంపించడం జరిగింది. ఆ చీరలను శుక్రవారం నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల వారీగా మహిళలకు జనసేన పార్టీ గ్రామ ఇంచార్జ్ లు, నాయకులు చేతుల మీదుగా అందజేశారు.

## ఆడపడుచులకు అన్నగా అండగా...

-డిప్యూటీ సీఎం ఆత్మీయ కానుక



గొల్లప్రోలు, ఆగస్టు 28(ప్రభాతవార్త) గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామంలో రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని 45 సంవత్సరాలు లోపు భర్తను కోల్పోయిన మహిళలను ఆడపడుచులుగా భావించి, వారికి ఒక అన్నగా అండగా నిలవాలనే గొప్ప ఆలోచనతో గౌరవనీయులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చీరలను అందించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం నియోజకవర్గం ఫైవ్ మ్యాన కమిటీ సభ్యులు ఓదురి కిషోర్ గారు, అధిక సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు అలాగే గొల్లప్రోలు పట్టణంలో వార్డు ఇన్చార్జిలు ఇంటింటికి వెళ్లి చీరలు అందజేసి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మొగలి రాజా తలారి శ్రీనివాస్ అధిక సంఖ్యలో జన సైనికులు పాల్గొన్నారు, గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామం ఆయా వార్డు ఇన్‌చార్జ్‌లకు చీరలను అందించి, ఇంటింటికీ వెళ్లి ఆడపడుచులకు అందజేసి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారురాజకీయాలకు అతీతంగా...ఆప్యాయతకు ప్రతిరూపంగా, అన్నగా ఆడపడుచులకు అండగా నిలిచే ఈ ఆత్మీయత కార్యక్రమంలో దుర్గాడ 7వ వార్డు మెంబర్ గొల్లపల్లి గంగా ఈశ్వరుడు,6వ వార్డు జనసేన ఇంచార్జి ,కాపారపు వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు

## ఆత్రేయపురం మండలంలో దేశంకు డుమ్మా వైఎస్ ఆర్పీ లో చేరికకు రంగం సిద్ధం.

-టీడీపీ,జనసేన నుండి వైఎస్ఆర్ సీపీలోకి లాంచనప్రాయంగా రావటానికి ఆమోదం



ఆత్రేయపురం, ఆగస్టు,28,(ప్రభాత వార్త). ఆత్రేయపురం మండలం మాజీ ఎంపీపీ మరియు పేరవరం గ్రామ మాజీ సర్పంచ్ బెజవాడ హిమబిందు సతీష్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1వ తేదీన భారీగా చేరికలు రంగం సిద్ధం చేస్తున్నారుడాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామం నుంచి ఆత్రేయపురం టీడీపీ మండల మాజీ ఎంపీపీ, పేరవరం గ్రామ మాజీ సర్పంచ్ బెజవాడ హిమబిందు సతీష్ దంపతుల ఆధ్వర్యంలో టిడిపి మరియు జనసేన పార్టీ నుండి నాయకులు కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో జాయిన్ అవ్వటానికి గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి రావటానికి ఆమోదం పొందారు . వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి,సీనియర్ రాయి వెంకటేశ్వరరావు గార్ల నాయకత్వంపై ఉన్న ప్రగాఢ నమ్మకంతో, పార్టీ సిద్ధాంతాలు మరియు ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు వారు "వార్త" కు తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ సాయంత్రం 4 గంటలకు టిడిపి మరియు జనసేన పార్టీల నుండి భారీగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరికల కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రానున్న రోజుల్లో మరిన్ని భారీ చేరికలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కర్రి నాగిరెడ్డి, రాష్ట్ర బూత్ కమిటీ విభాగం ప్రధాన కార్యదర్శి మార్గాన గంగాధర్ రావు, రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శి చిలువూరి రామ కృష్ణం రాజు, రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శి కొల్లి శ్యాంసన్ , రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సాకా ప్రసన్నకుమార్, మండల అధ్యక్షులు కనుమూరి శ్రీనివాసరాజు, ఆత్రేయపురం మండల ఎంపీపీ కుందా అన్నపూర్ణ మరియు ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమ్మవారికి వెండి కిరీటం సమర్పణ

-భక్తిశ్రద్ధలతో శాస్త్రోక్త పూజలు



పిఠాపురం, ఆగస్టు 28 ( ప్రభాతవార్త ) పిఠాపురం పట్టణంలోని చింతా వారి వీధిలో వెలసిన శ్రీ మహాలక్ష్మీ గణపతి సహిత శ్రీ సీతారామాంజనేయ స్వామివారి ఆలయంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఆలయంలో కొలువుదీరిన శ్రీ మహాలక్ష్మీ అమ్మవారికి మేకావారి వీధికి చెందిన డాక్టర్ కొరిమిల్లి సూర్యనారాయణ, మాజీ కౌన్సిలర్ విజయలక్ష్మి దంపతులు, వారి కుమారులు వెంకటేష్, డాక్టర్ సతీష్‌లు రూ.2 లక్షల వ్యయంతో తయారు చేయించిన వెండి కిరీటాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో సమర్పించారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకుల సమక్షంలో వేదమంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత విఘ్నేశ్వరుడైన శ్రీ గణపతికి విశేష పూజలు, అనంతరం శ్రీ మహాలక్ష్మీ అమ్మవారికి అభిషేకం, అర్చనలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం దాత కుటుంబ సభ్యులు సమర్పించిన వెండి కిరీటాన్ని అమ్మవారికి అలంకరించారు. వెండి కిరీటంతో అలంకరించిన అమ్మవారిని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.ఆలయ అర్చకులు కాశీవిశ్వనాథ శర్మ దాత కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం అందజేశారు. ఆలయ నిర్వాహకులు దాతలను ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని అర్చకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పిఠాపురం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి పద్మబుజ్జి, చింతా వెంకటేశ్వరరావు, గుండు బుల్లి రాజు, ధూళిపూడి భీమేశ్వరరావు, కొత్తపల్లి వీరరామ రాఘవ, కర్నీడి ఏడుకొండలు, రవికుమార్, వీరభద్ర రావు తదితరులు పాల్గొన్నారు.

## రాఖీ పౌర్ణమి వేడుకల్లో ఆత్మీయత



కాకినాడ రూరల్, ఆగస్ట్ 28( ప్రభాతవార్త): రాఖీ పౌర్ణమి సందర్భంగా టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి కూటమి ముఖ్య నాయకులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, జనసేన జిల్లా అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబుకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు.అనంతరం టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కూడా రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా అనంతలక్ష్మి మాట్లాడుతూ.. రాఖీ పౌర్ణమి ప్రేమానుబంధం, ఆత్మీయతకు ప్రతీక అన్నారు.నాయకులు, కార్యకర్తలను కుటుంబ సభ్యులుగా భావిస్తున్నామని, కష్టసుఖాల్లో పరస్పరం అండగా నిలవాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు.

## మన బంధం ఇలాగే కొనసాగాలి అన్నయ్యా!

-ఘనంగా రక్షాబంధన్ వేడుక..




అంబాజీపేట, ఆగస్టు 28,(ప్రభాతవార్త):మనసున మమతను నింపుకున్న ప్రతి సోదరికి,ఆ సోదరిని సర్వంగా భావించే ప్రతి సోదరునకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కష్టనష్టాల్లో,ఆపదల సమయాల్లో ఒకరికొకరం తోడుగా ఉందామని, అక్క– తమ్ముడు, అన్నా–చెల్లెమ్మ అనుబంధానికి ప్రత్యేకగా సోదరుడికి రాఖీలు కట్టిన అక్కలు,చెల్లెమ్మలు సంతోషాల సంబరాలు జరుపుకున్నారు. అంబాజీపేట మండలంలో రాఖీ పౌర్ణమి వేడుకను శనివారం ఘనంగా జరుపుకున్నారు. సోదరుడి ముంచేతికి రాఖీలు కట్టిన సోదరిలు మిఠాయిలు తినిపించారు.ప్రేమ,ఆప్యాయత, అనురాగంతో రాఖీలు కట్టిన తోబుట్టువులకు సోదరులు బహుమతులు,కానుకలు అందించారు.అనుబంధాల వేడుక,ఆప్యాయతలకు పండుగ.. మన బంధం ఇలాగే కొనసాగాలి అన్నయ్యా! అంటూ నుదిటిన కుంకుమ బొట్టు పెట్టిన చెల్లెమ్మలు రాఖీలు కట్టి ప్రేమను పంచుకున్నారు.

## చంద్ర నాగేశ్వరరావు దంపతుల పెళ్లిరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు



కడియం, ఆగస్టు 28 ( ప్రభాతవార్త) చంద్ర నాగేశ్వరరావు, శ్రీమతి పర్వత వర్ధిని దంపతుల పెళ్లిరోజు సందర్భంగా కడియం మండలం జేగురుపాడు గ్రామ స్టాలిన్ యువసేన యువకుల ఆధ్వర్యంలో శుక్రవారం దేవి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.బీసీ సంఘం పెద్దలు కొప్పిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో అమ్మవారికి పూలతో ప్రత్యేక అలంకరణ చేసి, కుంకుమాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగేశ్వరరావు దంపతులు మరిన్ని పెళ్లి రోజులు జరుపుకోవాలని, అలాగే చందన నాగేశ్వరరావు రాజకీయంగా ఉన్నత శిఖరాలు అందుకోవాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో అంగర రాజు, కొప్పిశెట్టి ప్రసాద్, మట్ట బాలాజీ, బుడ్డిగా శ్రీను, వనము దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా రాఖీ



కాట్రేనికోన ఆగస్టు 28 (ప్రభాతవార్త)మండల వ్యాప్తంగా రాఖీ పండుగను శుక్రవారం ప్రజలంతా ఘనంగా నిర్వహించారు. అన్నా చెల్లెలు, అక్క తమ్ముళ్లు తమ సోదరులకు రాఖీలను కట్టి ఆశీర్వదించి సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ ఆశీర్వాదాలు తీసుకున్నారు . వివిధ ప్రాంతాల్లో ఉన్న సోదరులు తమ చెల్లెలు అక్కలతో రాఖీలు కట్టించుకునేందుకు స్వగ్రామాలకు వచ్చారు ఆద్యంతం సంతోషంగా గడిపారు.

## కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్య కోసం మానవహారము



ఎటపాక: ఆగస్టు 28 (ప్రభాత వార్త): ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సమ్మె ఎనిమిద వ రోజు కు చేరుకుంది రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం అన్ని జిల్లాల్లో విజయవంతంగా నడుస్తున్నది ఈ సమ్మె కు నేడు హాస్పిటల్ లలో డ్యూటీలు చేస్తూనే మధ్యాహ్నం విరామ సమయంలో మానవహారం కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలుపుతామని అని అన్నారు ఈ సమ్మె ...

## నేడు విద్యుత్ కు అంతరాయం...

ఎటపాక ఆగస్టు 28 ( ప్రభాత వార్త): పురుషోత్తపట్నం 33/11kv సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు లైన్లకు దగ్గరగా ఉన్న చెట్లకొమ్మలు తొలగించుట కారణంగా నేడు ఉదయం ఎనిమిది గంటల నుండి ఒంటి గంటల వరకు పురుషోత్తపట్నం సబ్ స్టేషన్ పరిధి లోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయటం జరుగుతుంది. కావున ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించగలరని రంపచోడవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.అచ్యుతారావు పత్రిక ప్రకటన లో తెలియజేశారు

## కూటమి ప్రభుత్వానికి అండగా ఉండాలి..రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెదబాబు..

## -33వ రోజు డోర్ టు డోర్ ప్రోగ్రాం.



అంబాజీపేట,ఆగస్టు 27, (ప్రభాతవార్త): సంక్షేమం,అభివృద్ధి పారదర్శకంగా అందిస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు గంగాధరరావు( పెదబాబు) కోరారు. క్లస్టర్ 007 ఇన్చార్జి గణపతి వీర రాఘవులు ఆధ్వర్యంలో క్లస్టర్ పరిధిలో110,116 పోలింగ్ బూత్ లలో "రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి,సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా 33వ రోజు తెలుగుదేశం పార్టీ డోర్ టు డోర్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు ...

## చెట్లను సోదరులుగా కాపాడుకుందాం


## -మండల అటవీ శాఖ అధికారి నాగేశ్వరరావు చెట్లకు రాఖీలు కట్టిన విద్యార్థులు



శంఖవరం ఆగస్టు 28 ప్రభాతవార్త: ప్రాణవాయువును అందిస్తున్న చెట్లను సోదరులుగా భావించి కాపాడుకోవాలని మండల అటవీ శాఖ అధికారి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శంకవరం మండలంలోని అటవీ అధికారులు విద్యార్థులతో రక్షాబంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు ...

## గాజుల అలంకరణలో దేదీప్యమానంగా భ్రమరాంబిక దేవి

## -ఆలయంలో భారీ కుంకుమ పూజలు



శంఖవరం ఆగస్టు 28 ప్రభాతవార్త: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని భ్రమరాంబిక అమ్మవారి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. శంఖవరం మండలం కత్తిపూడి లో వేంచేసియున్న భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా అమ్మవారిని రంగురంగుల గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. గాజుల అలంకరణలో అమ్మవారు దేదీప్యమానంగా దర్శనమిచ్చారు ...

## ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న సత్యం, ఏఎంసీ చైర్మన్ రిషి



కె గంగవరం, ఆగస్టు 28, (ప్రభాతవార్త) : కె.గంగవరం మండలం పాణింగపల్లి గ్రామంలో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయ పునః నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ (రిషి) ముఖ్య అతిథులుగా పాల్గొని, కొత్తపల్లి మొరార్జీ దంపతులచే ప్రత్యేక పూజలు అనంతరం శంకుస్థాపన నిర్వహించారు.ఆలయ నిర్మాణం పాణింగపల్లి గ్రామానికి ఆధ్యాత్మిక శోభను తీసుకురావడంతో పాటు భక్తుల విశ్వాసాలకు మరింత బలం చేకూరుతుందని సత్యం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్, ఈ ఓ జె భీమశంకర్ రావు,రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ సాంబశివరావు,తోటవెంకన్న, కంచుమర్తి బాబురావు కూటమి పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అపర్ణ అమ్మవారి ఆలయంలో వైభవంగా రాఖీ పౌర్ణమి వేడుకలు

## -భక్తులకు అన్నప్రసాద వితరణ



గొల్లప్రోలు, ఆగస్టు 28.(ప్రభాతవార్త)రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో గల శ్రీ అపర్ణ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. శుక్రవారం పౌర్ణమి సందర్భంగా అమ్మవారిని రంగురంగుల విశేష పుష్పాలతో నయనానందకరంగా అలంకరించారు ...

## అగ్ని బాధితులకు అండగా జడ్పీటీసి సాగర్.



తాళ్లరేవు, ఆగస్టు 28 (ప్రభాతవార్త): జడివేల తాళ్లరేవు సంతపేటలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు తాళ్లరేవు జడ్పీటీసీ దొమ్మేటి సాయిబాబ్ సాగర్ అండగా నిలిచారు ...

## ఆదిత్య విశ్వ విద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ఆన్లైన్ సర్టిఫికేషన్ కోర్స్ ప్రారంభం




గండేపల్లి, ఆగస్టు 28. ప్రభాతవార్త గండేపల్లి మండలం, సూరంపాలెం లో గల ఆదిత్య విశ్వ విద్యాలయం, స్కూల్ ఆఫ్ బిజినెస్ నందు ప్రొఫెషనల్ కమ్యూనికేషన్ & ఎంప్లాయబిలిటీ స్కిల్స్" అనే అంశం పై ఆన్లైన్ స సర్టిఫికేషన్ కోర్స్ ను ప్రారంభించినట్లు యూనివర్సిటీ డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి తెలిపారు ...

## వైభవంగా నరసింహాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు.....




సఖినేటిపల్లి ఆగస్టు 28. ప్రభాత వార్త: డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది గ్రామంలో వేంచేసియున్న క్షేత్రాలలో నవనారసింహ క్షేత్రాలలో ప్రముఖమైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం నందు శ్రావణ మాసం మూడవ శుక్రవారం శ్రీ రాజ్యలక్ష్మి అమ్మవారికి సామూహిక వరలక్ష్మి కుంకుమ పూజలు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ కిరణ్, అర్చక స్వాముల ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి ...

## గంగవరం మండలంలో శ్రావణ శుక్రవారం పూజలు



కె గంగవరం, ఆగస్టు 28(ప్రభాత వార్త): కె గంగవరం మండలంలోని కోటిపల్లి, కోట, పామర్రు,కుందూరు,సత్యవాడ, కూళ్ల, మల్లవరం,దంగేరు,శీలల, బ్రహ్మపురి,మసకపల్లి కుడుపూరు ఇలా పలు ఆలయాల్లో శ్రావణ పౌర్ణమి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు ...

## మాకు తిమ్మాపురంలో పునరావాసం వ్యవసాయ భూమి కల్పించండి



వి.ఆర్.పురం,ఆగస్టు 28,ప్రభాతవార్త పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం కోసం సర్వం త్యాగం చేసిన తమకు జిల్లాలోని అడ్డతీగల మండలం, తిమ్మాపురం గ్రామం వద్ద పునరావాస కాలని కట్టించి, భూమికి బదులుగా వ్యవసాయ భూమి అక్కడే కల్పించాలని మండలంలోని గుండుగూడెం గ్రామానికి చెందిన నిర్వాసిత గిరిజనులు అధికారులను కోరారు ...

## జంధ్యాల పౌర్ణమి వేడుకలు....



సఖినేటిపల్లి ఆగస్టు 28, ప్రభాత వార్త: డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దివ్య సన్నిధిలో జంధ్యాల పౌర్ణమి వేడుకలు అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు ...

# రైతు విశిష్ట సంఖ్య తప్పనిసరి

## -ఆగస్టు 31లోగా పంటల బీమా చేయించుకోవాలి



కడియం, ఆగస్టు 28( ప్రభాతవార్త) ప్రతి రైతు రైతు విశిష్ట సంఖ్యను రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని జిల్లావ్యవసాయ అధికారి బి. వెంకటేశ్వరరావు సూచించారు ...


## మూడు గ్రామాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు..



రాజవొమ్మంగి, ఆగస్టు 28, ప్రభాతవార్త రాజవొమ్మంగి మండలం మారేడు బాక పంచాయతీ కోనూరి వారి వీధి రామాలయంలో సమరసత సేవా ఫౌండేషన్ మహిళా విభాగం ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు శుక్రవారం జరిగాయి ...

## నేడు విద్యుత్ సరఫరా అంతరాయం

కాట్రేనికోన ఆగస్టు 28 (ప్రభాతవార్త) మండలంలో కాట్రేనికోన, మరియు పల్లంకుర్రు, చెయ్యేరు 33/11 కె.వి సబ్ స్టేషన్ పరిధిలో 33 కెవి లైన్ పై కవర్ కండక్టర్ ఏర్పాటు చేయుట కొరకు శనివారం ఉదయం 8గంటల నుండి సాయంత్రం 5 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని ... విద్యుత్ సరఫరా ఉండదన్నారు.సరఫరా అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## నేడు మండలంలో రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ పర్యటన..

-ప్రజాదర్బారు. మండల బీజేపీ అధ్యక్షులు లోసుల రాజబాబు



రాజవొమ్మంగి, ఆగస్టు 28, ప్రభాతవార్త రాజవొమ్మంగి మండలంలో శనివారం రాష్ట్ర ఎస్టీ కమీషన్ చైర్మన్ సొళ్ల బొజ్జిరెడ్డి పర్యటిస్తున్నట్టు మండల బీజేపీ అధ్యక్షులు లోసుల రాజబాబు తెలిపారు ...

## కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి ఎమ్మెల్యే దాట్ల



కాట్రేనికోన ఆగస్టు 28 (ప్రభాతవార్త) రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం తోనే గ్రామాల్లో అభివృద్ధి సంక్షేమం సాధ్యపడుతుందని ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు ...

## పర్యావరణ హితం కోరుతూ మడ చెట్లకు రాఖీలు..

-కోరంగిలో అభయారణ్యంలో వృ(ర)క్షా బంధన్.




తాళ్లరేవు ఆగస్టు 28 (ప్రభాతవార్త): పర్యావరణ హితం కోరుతూ అటవీ శాఖ, గ్రీన్ క్లైమేట్ టీం ఆధ్వర్యంలో కోరంగి అభయారణ్యంలోని సి బి ఈ టి లో శుక్రవారం వృ(ర)క్షాబంధన్ ఘనంగా నిర్వహించారు ...

## పామర్రు పోలీస్ స్టేషన్ పరిధిలో


కె. గంగవరం, ఆగస్టు 28(ప్రభాతవార్త): కె గంగవరం మండలం బట్లపాలిక శివారు దొంగలగూడెం గ్రామానికి చెందిన జుత్తుక కృష్ణ(63) ఈనెల 25వ తేదీన ప్రమాదవశాత్తు అదుపు తప్పిన అదుపు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయం కావడంతో ... వారి వద్ద నుండి రూ 5,200 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

## కాట్రేనుకోన ఎస్సై బదిలీ



కాట్రేనికోన ఆగస్టు 28 (ప్రభాతవార్త)ఎంట్రే పాటు కాట్రేనికోన ఎస్సైగా బాధ్యతలు నిర్వహించిన ఐ అవినాష్ బదిలీ అయ్యారు. 2024 నుండి ఇప్పటివరకు ఎస్సైగా బాధ్యతలు నిర్వర్తించిన అవినాష్ ... కొత్త ఎస్సై రావలసి ఉంది.

## ఘనంగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



సీతానగరం, ఆగస్టు 28, (ప్రభాతవార్త) తెలుగుజాతి ఖ్యాతిని నలుదిక్కులా చాటిన ఎన్టీఆర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు ...

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps